ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 21.04.2026 | సంపుటి : 12 | సంచిక : 272 | పేజీలు : 12 | వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# కాంగ్రెస్ అంటేనే కర్షక పార్టీ

## భారీ ప్రాజెక్టులు నిర్మించింది మేము

## రైతులకు ఉచితవిద్యుత్ అందించిందీ కూడా మేమే

- నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా
- 2029లో నువ్వో నేనో తేల్చుకుందామని కేసీఆర్‌కు సవాల్
- రెండో విడత రైతు భరోసా నిధులను విడుదల చేసిన రేవంత్
- రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలి పార్టీ కాంగ్రెస్ అని వెల్లడి

"కేసీఆర్ నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో నేనో తేల్చుకుందాం. కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లను గోదావరిలో పోసి వృథా చేశారు. కాళేశ్వరం పేరిట చేసిన దోపిడీకి కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయ్యింది"
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో కాటారం(జనంసాక్షి):** పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలిపార్టీ కాంగ్రెస్ అని అన్నారు." రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిలోపే చేసి చూపించాం. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశాం. గత విడతలో రైతుభరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశాం. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తాం. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? ప్రజాపాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలి అని ఒక పెద్దమనిషి అంటున్నారు. ఫామ్‌హౌస్‌లో పడుకునే పాపాల భైరవుడు మళ్లీ ఎందుకు రావాలి? లక్షలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ జెండా మోస్తే.. ఈ ప్రభుత్వం వచ్చింది. పాపాల

మిగతా 2లో..

### రూ.198 కోట్లతో కాళేశ్వరం ఆలయ అభివృద్ధి

విస్తరణకు పనులకు సీఎం శంకుస్థాపన

2లో..



## కాళేశ్వరం పేరుతో కేసీఆర్ భారీ అవినీతి

- అద్భుతమైన కట్టడం అంటూ ప్రచారాలు
- లోపాలు ఉన్నాయని 2020లోనే అధికారుల వెల్లడి
- సీబీఐ విచారణ కోరినా పట్టించుకోని కేంద్రం
- నిపుణులతో కలసి పరిశీలించిన సీఎం రేవంత్
- మరమ్మతులు చేయించి నీటిని అందుబాటులోకి తెస్తాం
- అవినీతి బయట పడుతుందనే జగిత్యాల సభ
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో..

# అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తాం

## పేదల ఇళ్లు కూల్చిన చోటే పునర్నిర్మిస్తాం

- తొలి సంతకం దానిపైనే పెడతాం
- మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు
- అన్నింటా దరిద్రం తాండవిస్తోంది
- ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ మోసం
- రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులను దగా చేస్తున్నారు
- యూరియా కోసం మళ్లీ క్యూలు
- రెండేళ్లయినా ఒక్క నిర్మాణాత్మక పనిలేదు
- ప్రాజెక్టులను పడావు పెట్టారు..
- రిటైర్డ్ ఉద్యోగులకు సొమ్ములు రావడం లేదు
- జగిత్యాల సభలో కేసీఆర్ విమర్శలు

### పార్టీ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డి.. అక్కడికక్కడే నియామకం

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. అధికారంలోకి వచ్చిన మొదటి సంతకంతోనే హైడ్రాను తీసి చెరువులో పడేస్తాం.బీఆర్ఎస్ హయాంలో 46వేల చెరువులు మంచిగా చేశాం. కానీ ఒక్క గుడిసె కూడా కూలగొట్టలేదు. మూసీని మంచిగ చేయాల్సిందేనని.. కానీ ఇళ్లు కూలగొట్టుడు ఎందుకు.? భూములు కబ్జా పెట్టే రియల్ ఎస్టేట్ దందా తప్ప అందులో ఏమీ లేదు. జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నా.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మొత్తం పార్టీ బాధ్యతలను ఆయనే మోస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే జీవన్ రెడ్డికి బ్రహ్మాండమైన పదవి వస్తుంది జగిత్యాల యుద్ధం మీ వంతు తెలంగాణ యుద్ధం మా వంతు..
- జగిత్యాల సభలో కేసీఆర్



**జగిత్యాల బ్యూరో (జనంసాక్షి):** గ్రామ పంచాయతీలను నాశనం పట్టించారని.. మున్సిపాలిటీలను మురికి కూపం పట్టించారని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. మరి ఏం సక్కగుందని ప్రశ్నించారు. అం దుకే కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలి అని జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకులు అంటున్నారని తెలిపారు. వాళ్ల నోటి నుంచి వట్టిగానే ఆ మాట వస్తదా.. బాధ్యత లేకుండానే వస్తదా అని ప్రశ్నించారు. ఏం చూసినా సక్కగా లేకపోతే.. పొద్దున లేస్తే దోపిడి తప్ప ఇంకోటి లేకపోతే ఎందుకు

మిగతా 2లో..



ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

## ఫీజు గడువు 23 వరకు పొడిగింపు




## ఢిల్లీకి బీఆర్ఎస్ బృందం

కాళేశ్వరంపై న్యాయవాదులతో సంప్రదింపులు

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ త్రిసభ్య కమిటీ ఢిల్లీ పర్యటనకు వెళ్లింది. ఈ ప్రతినిధుల బృందంలో మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. ఏప్రిల్ 22న తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్‌పై తుది తీర్పు వెలువడనుంది. అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన కార్యాచరణను సిద్ధం చేసేందుకు వీరి ఢిల్లీ

మిగతా 2లో..



## అనుమతి ఇచ్చే వరకు హర్మూజ్ గుండా ప్రయాణించొద్దు

- భారత నౌకలక ఇండియన్ నేవీ సూచన
- భారత నౌకలను టార్గెట్ చేయడంపై దర్యాప్తు చేస్తున్నాం:ఇరాన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**హర్మూజ్ జలసంధిలో భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన నేపథ్యంలో భారత పతాక నౌకలకు మన నౌకదళం అడ్వైజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమనుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొంది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ

మిగతా 2లో..

# మలి విడత శాంతి చర్చలకు హాజరుకాబోం




- దూరంగా ఉంటున్నట్లు ప్రకటించిన ఇరాన్
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల్లో కీలక పరిణామం





**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్లామాబాద్ వేదికగా నిర్వహించ తలపెట్టిన మలివిడత శాంతి చర్చలకు తాము హాజరు కావడం లేదని ఇరాన్ వెల్లడించింది. అమెరికాతో చర్చలకు ప్రతినిధులను పంపడం లేదని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందం మరికొన్ని గంటల్లో ముగియనున్న వేళ ఇరాన్ నుంచి ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం.కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటి నుంచి దాన్ని అమెరికా ఉల్లంఘిస్తూనే ఉందని విదేశాంగ శాఖ అధికారప్రతినిధి ఇస్మాయిల్ పేర్కొన్నారు. హర్మూజ్ వద్ద నౌకలను దిగ్బంధించడం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఇరాన్‌కు చెందిన కార్గో షిప్‌ను పట్టుకోవడం వంటి ఉదంతాలను ప్రస్తావించారు. ఒకవేళ అమెరికా దుందుడుకు చర్యలకు పాల్పడితే అదే స్థాయిలో తమ నుంచి బదులుంటుందని హెచ్చరించారు. మరోవైపు రెండో విడత చర్చల కోసం ఇప్పటికే తమ ప్రతినిధులను పాకిస్థాన్ పంపిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. బుధవారంతో కాల్పుల విరమణ ఒప్పందం ముగియనున్న వేళ ఇరాన్ నుంచి ఈ ప్రకటన రావడంతో జరగబోయే పరిణామాల పట్ల ఉత్కంఠ నెలకొంది. ఇరాన్‌తో శాంతి చర్చలకు

మిగతా 2లో..



## సుప్రీంకోర్టు తీర్పుతో దిగొచ్చిన ట్రంప్

### అమెరికా చరిత్రలో అతిపెద్ద రిఫండ్

### సుంకాలు తిరిగి చెల్లించనున్న అగ్రరాజ్యం

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ అక్కడి సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో సుంకాల తిరిగి చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికా కస్టమ్స్ బోర్డర్ ప్రొటెక్షన్ ఇందుకోసం ఆన్‌లైన్ సిస్టమ్‌ను తీసుకొచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటల నుంచి దిగుమతి దారులు, వారి బ్రోకర్లు క్లెయిమ్‌లను సబ్మిట్ చేయొచ్చు. అమెరికా చరిత్రలో ఇది అతిపెద్ద రిఫండ్ ప్రక్రియగా నిలవనుంది. గతేడాది ట్రంప్ వివిధ దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, 1977 నాటి అత్యవసర అధికారాల చట్టం కింద ట్రంప్ ఈ సుంకాలను విధించడం

మిగతా 2లో..

## దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం

### అధ్యక్షుడు లీ జె మ్యూంగ్‌తో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇరు దేశాల మధ్య సోమవారం పలు ఒప్పందాలు కుదిరాయి. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలక ముందడుగు అని అన్నారు. భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీ, రక్షణ, షిప్ బిల్డింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో విస్తరిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. చిప్స్ నుంచి షిప్స్ వరకు, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు.. ఇలా వివిధ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కూడా కుదిరాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, టెక్నాలజీ, ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని మోదీ తెలిపారు.

నికత్ జరీన్ భవిష్యత్తులో మరిన్ని

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### అభినందించిన డీజీపీ శివధర్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** మంగోలియాలోని ఉలాన్‌బాటర్‌లో ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు జరిగిన ప్రతిష్టాత్మక బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించిన డీఎస్పీ నిఖత్ జరీన్‌ను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి సోమవారం నాడు తన కార్యాలయంలో అభినందించారు. అంతర్జాతీయ

మిగతా 9లో..



## జేఈఈ మెయిన్‌లో మెరిసిన తెలంగాణ బిడ్డలు



### విడుదలైన తుది విడత పరీక్ష ఫలితాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు వచ్చేశాయ్.దేశంలో లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు వచ్చేశాయ్. ఈ మధ్యాహ్నం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. సాయంత్రం పేపర్ -1 (బీఈ/బీటెక్) పరీక్ష తుది ఫలితాలను ప్రకటించారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ తుది విడత ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10మంది విద్యార్థులు 100 పర్సంటైల్

మిగతా 2లో..

మూడేళ్ల చిన్నారిని

## పీక్కుతిన్న వీధికుక్కలు

- ఇటుక బట్టీలో పసిపాపను ఎత్తుకెళ్లి చంపిన వైనం
- పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో ఘటన
- యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఘటన
- చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్

9లో..

జమ్ముకాశ్మీర్‌లో

## ఘోర ప్రమాదం

బస్సు బోల్తాపడి 15మంది మృతి

పలువురికి తీవ్రగాయాలు

## మలి విడత శాంతి చర్చలకు హాజరుకాబోం

హర్మ్యూజ్ దిగ్బంధనం అడ్డంకిగా మారిన వేళ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దీనిపై తన నిర్ణయం వెనక్కి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. శాంతి చర్చలకు హర్మ్యూజ్ వద్ద అమెరికా దిగ్బంధనం విఘాతం కలిగిస్తోందని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ట్రంప్‌నకు ఫోన్‌లో తెలిపినట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఈ అంశాన్ని అధ్యక్షుడు పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. శాంతి చర్చలకు తాము హాజరు కాబోవడం లేదని ఇరాన్ స్పష్టంచేసిన నేపథ్యంలో దిగ్బంధనం విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గాలనే యోచనలో ఉన్నట్లు సదరు వార్తా కథనాలను బట్టి తెలుస్తోంది.

## సుప్రీంకోర్టు తీర్పుతో దిగొచ్చిన ట్రంప్

రాజ్యాంగ విరుద్ధమని ఈ ఏడాది ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పునిచ్చింది. పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టంచేసింది. సుంకాలు చెల్లుబాటు కాకపోవడంతో ఆ మొత్తం రిఫండ్ చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ సుంకాలను చెల్లించిన వ్యాపార సంస్థలు, దిగుమతిదారులు ఈ రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రంప్ వెలువరించిన ఉత్తర్వుల అనంతరం 3.30 లక్షల మంది దిగుమతిదారులు దాదాపు 166 బిలియన్ డాలర్లను సుంకాల రూపంలో చెల్లించారు. ఇందులో 56,497 మంది దిగుమతిదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి వడ్డీతో కలిపి సుమారు 127 బిలియన్ డాలర్లు ప్రస్తుతం వాపసు ఇవ్వడానికి ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. కెయిమ్ ఆమోదం పొందిన తర్వాత సుమారు 60 నుంచి 90 రోజుల్లో డబ్బు తిరిగి రానుంది. సాంకేతిక సమస్యల వల్ల కొంత ఆలస్యం జరగొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల చెల్లించిన సుంకాలను ముందుగా వాపస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే తొలుత చెల్లించిన వారికి ఆలస్యం కానుంది. దిగుమతిదారులు తాము పొందిన రిఫండ్‌ను వినియోగదారులకు పంచాల్సిన అవసరం లేదు. అయితే, ఫెడ్ఎక్స్ వంటి కొన్ని సంస్థలు మాత్రం తమ కస్టమర్లకు ఈ ప్రయోజనాన్ని బదిలీ చేస్తామని వెల్లడించడం గమనార్హం.

## అనుమతి ఇచ్చే వరకు హర్మ్యూజ్ గుండా ప్రయాణించొద్దు

జలమార్గాన్ని దాటాయి. దానిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ . అదే రోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఇకపోతే భారత్‌కు చమురు సరఫరాలో ఆటంకాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. తాజాగా రష్యా నుంచి చమురు దిగుమతికి అవసరమైన బీమా సేవలను విస్తృతం చేయాలని నిర్ణయించింది. దీనిలోభాగంగా 11 రష్యా బీమా సంస్థలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేసింది. వాస్తవానికి ఈ సంస్థలు నౌకా రవాణాలో బీమాలను అందించే పీ అండ్ ఐ క్లబ్స్ (ప్రొటెక్షన్ అండ్ ఇండెమ్నిటీ)లో మెంబర్స్ కాకపోవడం గమనార్హం. ఇరాన్-అమెరికా పోటీపడి హర్మ్యూజ్‌ను దిగ్బంధించడంతో చమురు నౌకలు ఈ జలసంధిని దాటడం చాలా కష్టంగా మారింది. మరోవైపు రష్యాకు చెందిన చాలా చమురు నౌకలు ఈ మార్గంలో కాకుండా ఎర్ర సముద్రం మీదుగా ఆసియాలోని తమ గమ్యస్థానాలకు చేరతాయి. అందుకే భారత్ మాస్కో వైపు మొగ్గు చూపింది. వీటిల్లో గ్యాస్‌ప్రోమ్ ఇన్స్యూరెన్స్, రోస్‌గోస్‌ట్రాక్, బ్యాలెన్స్, సోగ్లాసీ, ఉగోరియా గ్రూప్, స్బెర్‌బ్యాంక్, ఏఎస్‌టీకే బీమా సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు గత వారం అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా అనుమతులను పొడిగించింది. ఐరోపా కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ గ్రూప్ ఆఫ్ పీఅండ్ఐ క్లబ్స్' సంస్థే థర్డ్‌పార్టీ, పొల్యూషన్, కార్గో డ్యామేజ్ వంటివి కవర్ చేస్తూ అత్యధికంగా బీమా పాలసీలు ఇస్తాయి. ప్రపంచ సముద్ర రవాణాలో ఈ సంస్థ వాటా 87శాతం వరకు ఉంది. అమెరికా ఆంక్షలు ఉన్న నేపథ్యంలో ఈ సంస్థ రష్యా నౌకలకు బీమా పాలసీలు ఇవ్వదు.

భారత నౌకలను టార్గెట్ చేయడంపై దర్యాప్తు చేస్తున్నాం:ఇరాన్

హర్మ్యూజ్ జలసంధిలో శనివారం రెండు భారత నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అన్న అంశంపై దర్యాప్తు చేపట్టినట్టు ఇరాన్ వెల్లడించింది. ఈ మేరకు ఆ దేశ ప్రతినిధి ఇస్మాయిలీ బాఘేయి ఒక ప్రకటన చేశారు. "మా దళాలే భారత నౌకలను లక్ష్యంగా చేసుకొన్నాయా..? అనే అంశంపై సంబంధిత సంస్థలు విచారణ చేపట్టాయి" అని పేర్కొన్నారు.శనివారం హర్మ్యూజ్ జలసంధిలో ఐఆర్‌జీసీ అనుమతి లభించిన తర్వాత ప్రయాణిస్తున్న రెండు భారత నౌకలపై కాల్పులు జరిగాయి. ఈ ఘటనతో ఆ రెండు నౌకలు తిరిగి పర్షియన్ గల్ఫ్‌లోకి వెళ్లిపోయాయి. వీటిల్లో ఒక దానిలో 20 లక్షల బ్యారెళ్ల చమురు ఉంది. ఈ ఘటనపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీకి సమన్లు జారీ చేశారు. ఇరాన్ జలసంధిని తెరిచినట్లు ప్రకటించిన తర్వాతే వాణిజ్య నౌకలు బయల్దేరిన విషయం తెలిసిందే. అమెరికాతో రెండో విడత చర్చలకు సంబంధించి తమ వద్ద ఎటువంటి ప్రణాళికా లేదని ఇస్మాయిల్ బాఘేయి తెలిపారు. చర్చల విషయంలో అమెరికా సీరియస్‌గా లేదని వ్యాఖ్యానించారు. కేవలం దుందుడుకు చర్యలు.. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

## భారత్‌లో డోపింగ్ సమస్య తీవ్రం..

### కేటగిరీ 'బీ' నుంచి 'ఏ' :ఏఐయూ

న్యూఢిల్లీ(జనంసాక్షి): డోపింగ్ సమస్య తీవ్రంగా ఉన్న దేశాల జాబితాలోకి భారత్ చేరిందని అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) సోమవారం తెలిపింది. ఇప్పటి దాకా కేటగిరీ బిలో ఉన్న భారత్ కేటగిరీ ఎకు మారిందని వివరించింది. ఇండియా ఈ జాబితాలోకి చేరడంతో ఇక నుంచి భారత అథ్లెట్లు మరింత కఠినమైన డోపింగ్ నిరోధక నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. కేటగిరీ-ఎలో రష్యా, బెలారస్, ఇథియోపియా, కెన్యా, నైజీరియా, ఉక్రెయిన్ వంటి దేశాలున్నాయి. అథ్లెటిక్స్‌లో అత్యధిక డోపింగ్ ఉల్లంఘనల విషయంలో భారత్ గత మూడేళ్లలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిందని ఏఐయూ తెలిపింది."భారత్‌లో డోపింగ్ పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. డొమెస్టిక్ డోపింగ్ నిరోధక కార్యక్రమం డోపింగ్ ముప్పు స్థాయికి తగినట్లుగా లేదు. దేశంలో డోపింగ్ వ్యతిరేక సంస్కరణల కోసం అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) కృషి చేసినప్పటికీ తగినంత మార్పు రాలేదు. అథ్లెటిక్స్ సమగ్రతను పరిరక్షించే సంస్కరణలను సాధించేందుకు కేటగిరీ-ఎలో ఉన్న ఇతర దేశాల ఫెడరేషన్‌లతో వ్యవహరించిన రీతిలోనే ఏఐయూ ఇప్పుడు ఏఎఫ్ఐతో కలిసి పనిచేస్తుంది" అని ఏఐయూ ఛైర్మన్ డేవిడ్ హౌమన్ తెలిపారు. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) అధ్యక్షుడు విటోల్డ్ బాంకా ఇటీవల దిల్లీలో పర్యటించారు. "నిషేధిత ఉత్ప్రేరకాలు, స్టెరాయిడ్ల ఉత్పత్తి భారత్‌లో అధికంగా ఉంది. ఇదొక తీవ్రమైన సమస్య. దీనిని ఎవరూ ఉపేక్షించడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జరుగుతున్న కృషి సత్ఫలితాలను ఇస్తుందని నమ్ముతున్నా" అని విటోల్డ్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ అంటేనే కర్షక పార్టీ



భైరవుడు ఎందుకు రావాలో.. పార్టీ మారుతున్న పెద్దమనిషి చెప్పాలి. జీవన్‌రెడ్డి చరిత్ర, ఆయన వెనకున్న మచ్చలన్నీ నాకు తెలుసు. 40 ఏళ్లపాటు తన కుటుంబానికి ఎన్నో పదవులు ఇచ్చుకున్నారు. 14 సార్లు కాంగ్రెస్ బీ ఫామ్ ఇస్తే.. మోసం చేసి వెళ్లిపోయారు. ఓడిపోయినప్పటికీ ఎన్నోసార్లు పదవులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఆయన్ను గౌరవించింది. ఏడాదిపాటు పదవి లేకపోతే జీవన్‌రెడ్డి కార్యకర్తల గుండెలమీద తన్ని శత్రువు పంచన చేశారు. 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినందుకు ప్రజాప్రభుత్వం పోవాలా? ఒక్కాయనకు పదవి రాకపోతే.. ప్రజాప్రభుత్వం పోవాలా? నేరెళ్లలో ఎస్సీలను ఇసుక లారీలతో తొక్కించినందుకు పాపాల భైరవుడు మళ్లీ రావాలా? వాస్తు బాగా లేదని బాగున్న సచివాలయం కూల్చి కొత్తగా కట్టుకున్నారు. బిడ్డ, కొడుకు, తండ్రి ఇలా తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా? పేదలు.. దొరల గడీల ముందు ఊడిగం చేస్తూ అలాగే ఉండాలని భావించారు. పేదలు కట్టుకోవడానికి పనికిరాని బతుకమ్మ చీరలు పంచారు. వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి.. పదేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. కేసీఆర్.. నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## రూ.198 కోట్లతో కాళేశ్వరం ఆలయ అభివృద్ధి

జయశంకర్ భూపాలపల్లి(జనంసాక్షి):

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకు న్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి , మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులపై ఈ పర్యటనలో ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది. .

## కాళేశ్వరం పేరుతో కేసీఆర్ భారీ అవినీతి

జయశంకర్ భూపాలపల్లి(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కేసీ ఆర్ హయాంలో అవినీతికి పాల్పడ్డారని తె లంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపిం చారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం చేసు కున్నారని పేర్కొన్నారు. సోమవారం మేడిగడ్డ బ్యారేజీను పరిశీలించి ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఎన్డీఎస్ఏ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు ఉన్నాయని 2020లోనే ఇంజినీర్లు చెప్పారని, వారి లేఖలను అప్పటి సీఎం, ఎల్ అండ్ టీ అధికారులు పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలిపోయిందని గుర్తు చేశారు. అన్నీ దాచిపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నించారని.. కానీ, ప్రకృతి మరొకటి తలచి బ్యారేజీ పూర్తిగా కుంగిపోవడంతో ప్రపంచానికి తెలిసిందన్నారు. మేడిగడ్డ సందర్శనకు మంత్రులతో కలిసి వెళ్లిన సీఎం.. బ్యారేజీ మరమ్మతుల కార్యాచరణపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎల్ అండ్ టీ అతిథిగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2018 ఎన్నికల్లో కాళేశ్వరాన్ని చూపించి లబ్ధి పొందారు. మేడిగడ్డ విషయంలో కేంద్రం సీబీఐ విచారణను ఇప్పటికీ ప్రారంభించలేదు. సీబీఐ విచారణ వెంటనే ప్రారంభించాలని ఇటీవలే మరోలేఖ రాశాం. రూ.1.50 లక్షల కోట్లలో రూ.లక్ష కోట్లు ఇప్పటికే కాంట్రాక్టర్లకు చెల్లించారు. రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేసే ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదు. రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తున్న ప్రాజెక్టును చూస్తూ వదిలేయలేం. సాంకేతిక నిపుణులతో పాటు మేం పరిశీలనకు వచ్చిన రోజే కేసీఆర్ మీటింగ్ పెట్టుకున్నారు. నిజాలు తెలియకూడదనే ఇవాళ కేసీఆర్ సమావేశం ఏర్పాటు చేశారని రేవంత్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో ఓ స్పష్టత వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారమని చెప్పుకొచ్చారు. సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్నాకే అధికారులు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సేకరించిన శాంపిల్స్ రిజల్ట్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి పనిలో ఎన్డీఎస్ఏ అప్రూవల్ తీసుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావును.. కాళేశ్వర్ రావు అని అప్పటి గవర్నర్ నరసింహన్‌తో చెప్పించారని ప్రస్తావించారు. కేసీఆర్ అవినీతిని ప్రకృతే గుర్తించి మొదట బయటకు తీసిందని తెలిపారు. 2023 ఎన్నికల ముందు కాళేశ్వరం కూలిపోయిందని చెప్పుకొచ్చారు. అన్ని విషయాల్లో కాళేశ్వరం విఫలమైందని ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై శాసనసభలో చర్చించి సీబీఐ విచారణకు ఆదేశించామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తొమ్మిది నెలలైనా కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై తమ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రానికి తీర్మానం పంపిందని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావును జైల్లో వేయాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి ఆనాడు అనలేదా అని ప్రశ్నించారు. కానీ కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. అంతకుముందు సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ ఇప్పటి వరకూ చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. కాళేశ్వరం విచారణపై సీబీఐ ఎందుకు మౌనంగా ఉంది..? అని నిలదీశారు. తాము పదే పదే లేఖలు రాసినా ఎందుకు స్పందిచడం లేదు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరంపై లక్షకోట్లు ఖర్చుచేసి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. దీనిని తాము వదిలేయలేక, దీనిపై ఖర్చు చేయలేక సాంకేతిక నిపుణులతో ఇక్కడికి వచ్చామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నెల రోజుల ముందే అధికారులతో, సాంకేతిక నిపుణులతో ఇవాళ సమావేశం పెట్టుకున్నామని తెలిపారు. నిజాలు బయట పడతాయని తెలిసి ఇవాళ కావాలని వాళ్లు ఓ మీటింగ్ పెట్టుకున్నారని.. అయినా మేం అనుమతులు ఇచ్చామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తెలివి ఉందని.. మాట్లాడుతున్నారో, తెలివి లేక మాట్లాడుతున్నారో తెలియదని ఎద్దేవా చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ఈ ప్రాజెక్టుకు ప్రాణవాయువు అని ఉద్ఘాటించారు. హరీశ్‌రావు నిక్కర్‌తో తిరక్కముందే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని విమర్శించారు. ఎల్లంపల్లి నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంటలు పండించారని ప్రస్తావించారు. కాళేశ్వరంలో దోషులను వదిలేది లేదని హెచ్చరించారు.. దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును కూడా ఊరికే వదలబోమని.. రిపేర్లు చేసి నీరు అందిస్తామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ హయాంలో చేసిన బండారం బయటపడుతుందని వాళ్లు ఈరోజు మీటింగ్ పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. సీబీఐ విచారణ జరుపుతారని బీజేపీ వాళ్ల కాళ్లు మొక్కించేందుకే హరీశ్‌రావు, వినోద్ రావు ఢిల్లీకి పోయారని విమర్శించారు. కాళేశ్వరంపై విచారణ కు ఆదేశిస్తారని తెలిసి బీజేపీ నేతల కాళ్లు పట్టుకునేందుకు హరీశ్‌రావు ఢిల్లీకి పరుగెత్తారని విమర్శించారు. మీడియా బయటపెట్టినా వాళ్లు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన ఎందుకు చేయలేదని నిలదీశారు. బీజేపీని అడ్డుపెట్టుకుని అవినీతి కేసుల నుంచి బయట పడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తామన్నారు. హరీశ్‌రావు ఢిల్లీ రహస్య పర్యటనన మీడియా బయట పెట్టిందని తెలిపారు. హరీశ్‌రావు రహస్య పర్యటన వెనక మతలబు ఏంటో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఎవరెవరిని కలిశారో హరీశ్‌రావు బయటపెట్టాలని సవాల్ విసిరారు. జడ్జిమెంట్ ప్రకటించకముందు వాదించడానికి వీలుండదని అన్నారు. మరి న్యాయవాదుల ను కలవడానికి వెళ్లాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. గోదావరి జలాలతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయాలని 1975 లో జలగం వెంగళరావు ఆనాటి మహారాష్ట్ర సీఎంతో ఒప్పందం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 2009లో రూ.38, 063 కోట్లతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మొదలు పెట్టారని పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్లకు రూ.11,700 కోట్లు ఖర్చు చేశారని ప్రస్తావించారు. 2016లో మొదలుపెట్టిన మేడిగడ్డను 2019లో పూర్తిచేశామని ప్రారంభించారని తెలిపారు. ఇది అద్భుతమని భ్రమలు కల్పించి 2018 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందారని మండిపడ్డారు. 2023 లో మేడిగడ్డ కుప్పకూలిందని అన్నారు. అన్నిటిని దాచిపెట్టి 2023 ఎన్నికల్లో ప్రయోజనం పోందాల నుకున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టులో సమస్యలు రాగానే 2023, నవంబర్ 1వ తేదీన ఎన్డీఎస్ఏ ప్రాథమిక రిపోర్ట్ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఇచ్చిందని ప్రస్తావించారు.

## తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

### ఫీజు గడువును 23 వరకు పొడిగించిన బోర్డు

హైదరాబాద్(జనంసాక్షి):

తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు, ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 23 వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు ఈనెల 12న విడుదలయ్యాయి. కాగా ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులై మార్కులు ఎక్కువ సాధించాలని భావించే విద్యార్థులు, ఫెయిలైన విద్యారులకు మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 22 నుంచి 25 వరకు ప్రాక్టికల్స్, మే 26న ఫస్టియర్, సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

## ఢిల్లీకి బీఆర్ఎస్ బృందం

పర్యటనకు వెళ్లారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై.. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై లాయర్లతో చర్చిస్తున్నారు.

## జేఈఈ మెయిన్‌లో మెరిసిన తెలంగాణ బిడ్డలు

స్కోరుతో అదరగొట్టారు. తెలంగాణ నుంచి మంథా శివకామేశ్, భవితేశ్ రెడ్డి, సాయిరుత్విక్ రెడ్డి, వివన్‌శరద్ మహేశ్వరి, రిషి ప్రేమ్‌నాథ్ 100 పర్సంటైల్ స్కోరు సాధించారు.జేఈఈ (మెయిన్) సెషన్ 1, సెషన్ 2 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని జాతీయ ర్యాంకులను కేటాయించారు. ఈ పరీక్షల్లో రాణించి టాప్‌లో నిలిచిన మొత్తం 2.50లక్షల మందికి జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం కల్పిస్తారు. మే 17న జరిగే ఈ పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 4వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగనుంది. 'అడ్వాన్స్‌డ్'లోనూ సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తుంటారు.

# అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తాం

ఈ పరిస్థితి వస్తుందని అడిగారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాశనం.. ఉద్యోగస్తులు ఆగం.. రిటైర్డ్ ఉద్యోగస్తులు ఆగం.. విద్యార్థుల జీవితం ఆగం.. ఆటో కార్మికుల జీవితాలు ఆగం.. ఎవరు సక్కగున్నరు అని కేసీఆర్ అడిగారు. సంతృప్తిగా ఎవరున్నారని అన్నారు. ఈ అందానికి బోడి ముండ హైడ్రాను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా ఉందని.. నిజామాబాద్‌కు నిద్రా తీసుకొస్తామని పీసీసీ ప్రెసిడెంట్ ఒకరు చెబుతున్నారని మండిపడ్డారు. రేపు జగిత్యాలకు జిద్రా అంటాడని సెటైర్ వేశారు. మీకేం కావాలి.. పేదోళ్ల కొంపలు కూల్చడమేనా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో మూడున్నర లక్షల మందికి ఎక్కడ ఉంటే అక్కడే పట్టాలిచ్చామని కేసీఆర్ గుర్తుచేశారు. కానీ ఇవాళ ఏం కూలగొడుతున్నారని మండిపడ్డారు. పిల్లలను పుస్తకాలు కూడా తీసుకోనివ్వరా.. అంత ఎగిర్తమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేది ఖాయమని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజుల్లోనే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామని హామీ ఇచ్చారు. మొదటి సంతకంతోనే హైడ్రాను తీసి చెరువులో పడేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 46వేల చెరువులు మంచిగా చేశామని.. కానీ ఒక్క గుడిసె కూడా కూలగొట్టలేదని స్పష్టం చేశారు. మూసీ అని గరీబోళ్లను ఏడిపిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. పొద్దున లేస్తే నిద్రపోకుండా, వారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 వేల ఇళ్లు కూలగొడతామని అంటున్నారని.. అది ధర్మమేనా అని ప్రశ్నించారు. మూసీని మంచిగ చేయాల్సిందేనని.. కానీ ఇళ్లు కూలగొట్టుడు ఎందుకని నిలదీశారు. భూములు కబ్జా పెట్టే రియల్ ఎస్టేట్ దందా తప్ప అందులో ఏమీ లేదని అన్నారు. ఈజీగా చేయగలిగిన దాన్ని నాశనం పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఏది చూసినా కూడా ఒకరకమైన దోపిడీ, ఒకరకమైన గుండాగిరి, అరాచకంతో ముందుకెళ్తున్నారే తప్ప.. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ఒక్క స్కీమ్ కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను పండబెట్టింద్రని.. ఏం రోగమని కేసీఆర్ ప్రశ్నించారు. మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు మళ్లీ దాపురించాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ చుట్టుముట్టాయని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ పునర్నిర్మాణ మహాయజ్ఞంలో అందరూ కలసి రావాలని పిలుపుపిచ్చారు. ఏ వర్గం కూడా ఇప్పుడు సంతోషంగా లేరని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మొదలుకుని అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ప్రాజెక్టులను పడావు పెట్టారని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేరారని తెలిపారు. 45 ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తమకు స్నేహం ఉందని ప్రస్తావించారు. సోమవారం జగిత్యాలలో కేసీఆర్ పర్యటించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ సమక్ష్యంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు. రెండేళ్లలో ఒక్క నిర్మాణాత్మక పని కూడా కాంగ్రెస్ చేపట్టలేదన్నారు. ఉద్యమనాటి పరిస్థితులు మళ్లీ దాపరించాయని, ఎరువుల బస్తాలకు మళ్లీ క్యూలో చెప్పులు పెట్టాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కరెంట్ ఆగం అయ్యిందని, మిషన్ బగీరథ మూలన పడిందన్నారు. పెట్టిన ఇల్లులాగా ఉన్న తెలంగాణను అప్పగింతే సర్వనాశనం చేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పేరు ఎక్కడా ఎత్తకుండా కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉండేవని కెసిఆర్ వ్యాఖ్యానించారు. గతంలో తెలంగాణ పదం పలకడానికే భయపడే రోజులు ఉండేవని పేర్కొన్నారు. భిన్న రాజకీయ పార్టీల వల్లే జీవన్‌రెడ్డి, తాము వేర్వేరుగా పనిచేశామని అన్నారు. జీవన్‌రెడ్డి గుండెధైర్యంతో నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.జీవన్‌రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని వెల్లడించారు. ఆయన ప్రజాజీవితం ఎంతోమందికి ఆదర్శమని ప్రశంసించారు. జీవన్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్‌కు ఊపు వస్తోందన్నారు.జీవన్‌రెడ్డితో కలిసి అన్నదమ్ముల్లా పనిచేస్తామని వివరించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డికి తక్షణ బాధ్యతలు ఇస్తామని స్పష్టం చేశారు. కరీంనగరే కాదని.. చుట్టుపక్కల జిల్లాల్లోనూ జీవన్‌రెడ్డి పనిచేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి కీలక బాధ్యతల్లో ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణ పదాన్నే నిషేధించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. మన నీళ్లు, వనరులను దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. కొన్ని పార్టీల తీరుతో ఆవేశం, దు:ఖం వచ్చేదని చెప్పుకొచ్చారు. పాలమూరు లాంటి జిల్లాల్లో 90 శాతం వలసలే ఉన్నాయని ప్రస్తావించారు. గంజి కేంద్రాలు పెట్టిన అధ్వాన స్థితికి తెలంగాణను చేర్చారని తెలిపారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు చంద్రబాబు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. కరెంట్ ఛార్జీలపై నిరసన తెలిపితే బషీర్‌బాగ్‌లో కాల్చి చంపారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటనతోనే తెలంగాణ జెండా పట్టుకుని ఉద్యమం చేశానని ప్రస్తావించారు. బక్కపలచనోడు, ఇతనితో ఏమవుతుందని హేళన చేశారని గుర్తుచేశారు. మొక్కవోని దీక్షతో తెలంగాణ మొత్తం తిరిగి ఉద్యమించానని ఉద్ఘాటించారు. మాజీ సీఎం రోశయ్య 14ఈ జీవో తెస్తే ఉద్యోగ గర్జన చేపట్టామని ప్రస్తావించారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ దీక్ష చేపట్టానని తెలిపారు. తన దీక్షతో పార్లమెంట్ అల్లకల్లోలమైందని అన్నారు. మాజీ కేంద్రమంత్రి చిదంబరం వచ్చి తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఆంధ్రోళ్ల ఒత్తిడితో మళ్లీ అడ్డంపడితే పోరాడామని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక అందరినీ కలుపుకుని ప్రణాళికతో ముందుకెళ్లామని ఆంధ్రోళ్ల ఒత్తిడితో మళ్లీ అడ్డంపడితే పోరాడామని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక అందరినీ కలుపుకుని ప్రణాళికతో ముందుకెళ్లామని అన్నారు.కాకతీయ రాజుల పేరుతో చెరువులు బాగుచేసుకున్నామని తెలిపారు. పదేళ్లలో ఎన్ని చేశామో మీరే చూశారని ప్రస్తావించారు. మిషన్ భగీరథ పూర్తికాకపోతే ఓట్లు వేయొద్దని అసెంబ్లీలోనే చెప్పానని అన్నారు. ఐదేళ్లలోనే మిషన్ భగీరథ పూర్తిచేసి మంచినీళ్లు ఇచ్చామని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మిషన్ భగీరథకు ఏం రోగం పుట్టింది? అని ప్రశ్నించారు. ఇప్పుడు మిషన్ భగీరథ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ చావాలి అంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారని అన్నారు. తాను విమర్శించే వారు వెయ్యి జన్మలెత్తినా తాను చావనని తెలిపారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా అని ఎద్దేవా చేశారు. చావాలంటూ మీరు శాపాలు పెడితే తాను చస్తానా? అని ప్రశ్నించారు. చివరి శ్వాస ఉన్నంతవరకు పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పుడు తెలంగాణలో కరెంట్ వస్తోందా? అని ప్రశ్నించారు. పంటపొలాలు ఎండిపోయి ప్రజలు ఏడుస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేటప్పుడు ఉల్టాపల్టా కావొద్దని అప్పుడే చెప్పానని ప్రస్తావించారు. వీళ్లు రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీమ్ అంటారని చెప్పానని అన్నారు. ఒక్కసారే వెయ్యాల్సిన రైతుబంధును ఒక్కో ఎకరానికి ఒకసారి ఇస్తున్నారని ధ్వజమెత్తారు.

## పార్టీ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డి

### అక్కడికక్కడే నియామకం

జగిత్యాల(జనంసాక్షి): రాజకీయాల్లో ఎందరికో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి జీవన్‌రెడ్డి అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ భవిష్యత్ ప్రయోజనాల కోసం ఆయన బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. జగిత్యాలలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగిస్తూ కీలక ప్రకటన చేశారు. జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా ప్రకటించారు. భిన్న రాజకీయ వేదికల వల్ల వేర్వేరుగా పని చేశామని, వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ జీవన్‌రెడ్డి, తాను మంచి స్నేహితులమని చెప్పారు."జీవన్‌రెడ్డి, నేను కలిసి ఎంతో పని చేశాం. 40-45 ఏళ్లుగా మేం మంచి స్నేహితులం. నేను సీఎంగా ఉన్నప్పుడు కూడా నన్ను కలిసి ఒక బ్రిడ్జి అడిగారు. జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే ఇతర నియోజకవర్గాల్లో కూడా ప్రభావం ఉంటుందని సర్వేలు చెప్పాయి. ఆయన్ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నా. జీవన్‌రెడ్డి నిఖార్సైన నేత.. ఆయనకు పదవులు కొత్తకాదు. అన్నదమ్ముల్లా కలిసి పనిచేద్దామని ఆయనతో చెప్పాను. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మొత్తం పార్టీ బాధ్యతలు ఆయనే మోస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే బ్రహ్మాండమైన పదవి వస్తుంది. జగిత్యాల యుద్ధం మీ వంతు.. తెలంగాణ యుద్ధం మావంతు.ఒకప్పుడు తెలంగాణ చాలా భయంకరమైన పరిస్థితుల్లో ఉండేది. మేం ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ఏపీ చేయలేని, మాట్లాడలేని పరిస్థితి. అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్నే నిషేధించిన రోజులు ఉండేవి. మన బతుకు, మన భాష, ఉద్యోగాల మీద దాడి ఉండేది. విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు నేను తెలంగాణ కోసం పోరాడతానని చెప్పాను. హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు వస్తే బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపారు. తెలంగాణ కోసం నేను బయలుదేరితే అవహేళనలు చేశారు. ఎన్నో ప్రయత్నాలు చేస్తే.. ఉద్యమ కెరటంగా తయారై తెలంగాణ సాధించుకున్నాం" అని కేసీఆర్ అన్నారు.

## ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలుడు

సంగారెడ్డి(జనంసాక్షి):సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో అకస్మాత్తుగా రియాక్టర్ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంటలు పరిసర ప్రాంతాలను ఆవరించాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ పరిశ్రమ పరిసరాల్లో వ్యాపించింది.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఫైర్ ఇంజిన్లు రంగంలోకి దిగాయి. పేలుడు కారణంగా ఎవరైనా గాయపడినారా లేదా అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పేలుడు ఎలా జరిగింది, రియాక్టర్‌లో ఏవైనా సాంకేతిక లోపాలున్నాయా అనే దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే అంశంపైనా కూడా విచారణ జరుగుతోంది. ఈ ఘటనతో గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## సిఎం రేవంత్‌తో నార్వే బృందం భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్20 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నార్వే రాయబారి హెచ్.ఈ. మే-ఎలిన్ స్టెనర్ ప్రతినిధి బృందం కలిసింది. జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలపింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, పెటటుబడులు తదితర పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.


## మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన సీఎం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్ పూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని సోమవారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఎన్ డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు 20, 21, 22 వద్ద బోర్ రిగ్స్ ద్వారా జియో టెక్నికల్, జియో ఫిజికల్, జీపీఆర్, శాంపిల్స్ సేకరణను, పనులను పరిశీలించారు. 520 బోర్ రిగ్స్ ద్వారా శాంపిల్స్ సేకరించి సిడబ్ల్యుపిఆర్ఎస్ కు ప్రభుత్వం పంపనుంది. అక్కడ ల్యాబ్ లో పరీక్షల అనంతరం బ్యారేజ్ డ్యామేజీపై పూర్తి అవగాహన రానుంది. బ్యారేజ్ వద్ద సీకేంట్ పైల్స్ కు సంబంధించి ప్యారలల్ క్రాస్ హోల్ సెస్మిక్ టెస్ట్ వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు.

# ముందున ఏమున్నది.. జీవన్‌రాగం!

- ప్రజలు తిరస్కరించినా.. అవకాశాలు దక్కుతాయా?
- 75 ఏళ్లలో పార్టీ మారి ఏం సాధిద్దామని..?
- జీవన్ రెడ్డికి ముందున్న ప్రశ్నలు



**జగిత్యాల బ్యూరో (జనంసాక్షి) :** 4 దశాబ్దాలుగా కాంగ్రెస్‌తోనే పయనం.. ఎన్నో పదవులు అలకరించిన నైజం.. ఓడినా రెండుసార్లు పార్టీ నుంచి అవకావం లభించింది. 75 ఏళ్ల వయసులో మాజీ మంత్రి, సీనియర్ నేత టీ. జీవన్ రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమవ్వడం తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా జగిత్యాల జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది. తెలంగాణ రాజకీయ చరిత్రలో జగిత్యాల నియోజకవర్గం ఒక ప్రత్యేక అధ్యాయం రాసింది. గడిచిన పదేళ్లలో ఆ నియోజకవర్గ ప్రజలు తాడిపర్తి జీవన్ రెడ్డిని రెండుసార్లు స్పష్టంగా తిరస్కరించారు.అయినా ఆయనకు పదవులపై ఆశ చావలేదనే విమర్శలు కాంగ్రెస్ కార్యకర్తల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రయాణానికి స్వస్తి చెప్పి, ఈ వయసులో ఆయన తీసుకుంటున్న ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జీవన్‌రెడ్డి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే జీవన్‌రెడ్డి అనే రీతిలో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయం సాగింది. అయితే, గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు ఆయనను తీవ్రంగా కలిచి వేశాయి. మానసికవేదనకు గురయ్యా...ఆత్మగౌరవం లేని చోట ఉండలేనంటూ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కారెక్కేశారు. అయితే 'రాజకీయాల్లో గెలుపు అవకాశాల తలుపు తెరుస్తుంది, ఓటమి ఆ తలుపు మూసేస్తుంది' ఇది ఏ రాజకీయ నాయకుడు కాదనలేని సత్యం. అదే కాలంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన శ్రీధర్ బాబు గెలిచారు, మంత్రి అయ్యారు. తొలిసారి గెలిచిన అడ్లూరి మంత్రిపదవి దక్కించుకున్నారు. పొన్నం ప్రభాకర్ మంత్రిమండలిలో చోటు పొందారు. గెలిచినవారికి గుర్తింపు దక్కింది, గౌరవం లభించింది, అధికారంలో భాగస్వామ్యం కలిగింది. జీవన్ రెడ్డి గెలిచి ఉంటే నిస్సందేహంగా మంత్రి అయ్యేవారు. ఆయన సామర్థ్యంపై అనుమానం అక్కర్లేదు. కానీ ప్రజాస్వామ్యంలో సామర్థ్యం మాత్రమే సరిపోదు.. ప్రజల ఆమోదం కావాలి. ఆ ఆమోదం రెండుసార్లూ జీవన్ రెడ్డికి దక్కలేదు. పర్యవసానంగా పార్టీలో ప్రాధాన్యత తగ్గింది, మంత్రిపదవి అందకుండా పోయింది.

ఓటమి చెందిన నాయకులకు పార్టీలో ప్రాధాన్యత తగ్గడం అనివార్యం. ఇది జీవన్ రెడ్డికి మాత్రమే వర్తించే నిబంధన కాదు, ప్రజాస్వామ్య రాజకీయాల సహజ నియమం. ప్రజలు తిరస్కరించిన నాయకుడికి పార్టీ పట్టం కట్టలేదు. అందులో తప్పేమీ లేదు. ఎందుకంటే పార్టీ కూడా చివరకు ప్రజల తీర్పుకే కట్టుబడి ఉంటుంది. జగిత్యాల ప్రజలు పదేళ్లలో రెండుసార్లు ఒకే నాయకుడిని తిరస్కరించడం యాదృచ్ఛికం కాదు. అది ఆ నియోజకవర్గం ఇచ్చిన స్పష్టమైన సందేశం. బ్యాలెట్ పేపర్‌పై రాసిన తీర్పుకు మించిన న్యాయస్థానం మరొకటి లేదు. ప్రజలు తమ అభిప్రాయాన్ని అత్యంత నిష్పాక్షికంగా, నిర్భయంగా నమోదు చేశారు. గెలిచే అర్హత ఉన్నా గెలవలేని నాయకుడి గాథ జీవన్ రెడ్డిది. ఆ ఓటమికి కారణం పార్టీ కాదు, వ్యవస్థ కాదు. సాక్షాత్తూ జగిత్యాల ప్రజలే. ప్రజాస్వామ్యంలో అంతకంటే పెద్ద తీర్పు మరొకటి లేదు అనేది కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వన్‌మ్యాన్ షో.. జీవన్‌రెడ్డి తట్టుకోగలడా?

గతంలో ఇతర పార్టీలోంచి హేమాహేమీలు బీఆర్ఎస్‌లో జాయిన్ అయ్యి అక్కడ కారు ఉక్కపోత తట్టుకోలే బయటికి వచ్చిన వారు అనేక మంది ఉంటే.. మరికొందరు పార్టీలో కొనసాగుతూ రాజీకయాల్లో సైలెంట్‌గా ఉంటున్నారు. ఏఐసీసీ కమిటీ మెంబర్ స్థాయికి ఎదిగి బీఆర్ఎస్‌లో జాయిన్ అయిన కె. కేశవరావు ఇంచుమించు పరిస్థితి అలానే ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీ రోల్ ప్లే చేసిన ఆయన.. అక్కడి రాజకీయ పరిస్థితులను తట్టుకోలే ప్లేట్ మార్చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏమాంత్ర ఆలస్యం చేయకుండా కారుకు హ్యాండ్ ఇచ్చి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇకపోతే కాంగ్రెస్ జాతీయ పార్టీ కాబట్టి అక్కడ అలకలు, అసంతృప్తులు, బుజ్జగింపులు కామన్... కాని లోకల్ పార్టీల్లో అంతకు మించిన విభేదాలు ప్రాంతీయ పార్టీలో ఉంటాయి. అందులో బీఆర్ఎస్ గురించి అయితే చెప్పనవసరం లేదు. అక్కడ అంతా వన్ మ్యాన్ షో ఉంటుంది. సుప్రీం కేసీఆర్ ఏం చెబితే... అదే పై స్థాయి నుంచి కింది స్థాయి నేతల వరకు ఫాలో కావాల్సిందే. అది పార్టీ రూల్.. ఎవరైనా కాదు... కూడాదు అని లైన్ క్రాస్ అయితే ఆయన చాప్టర్ అక్కడితోనే క్లోజ్ అవుతుంది. అది ఎంతటి పెద్ద వాళ్లైన సరే పార్టీ నుంచి ఎలిమినెట్ చేస్తారు. పార్టీ వాళ్లైనా... రక్త సంబంధికులైనా అందరికి ఒకటే రూల్... ఇందులో భాగంగానే కేసీఆర్ తీరును వ్యతికించినందుకు తన కూతురు కవితను పార్టీ నుంచి బహిష్కరించారనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

కాంగ్రెస్ పార్టీలో పొన్నాల లక్ష్మయ్య సీనియర్ నాయకుడు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయాలను శాసించిన వారిలో ఆయన ముందు వరుసలో ఉండేవారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆయన హవా కొనసాగింది. రెండుసార్లు మంత్రిగా కీలకశాఖలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంగ్రెస్ రాష్ట్ర పార్టీకి తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారం చేసుకున్న ఆయన తర్వాత ఉమ్మడి వరంగల్లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. అయితే, జనగాంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి లాంటి నాయకులు ఉండటంతో ఆయన రాజకీయ భవిష్యత్ ప్రశ్నర్థకంగా మారింది. ప్రస్తుతం పొన్నాల లాక్కోలేక పీక్కోలేక పార్టీలోనే కొనసాగుతున్నారు. పార్టీలో ఆయనను పట్టించుకునే పరిస్థితే లేకుండా పోయింది. గతంలో హేమాహేమీలకు పట్టిన గతే జీవన్ రెడ్డికి పడుతుందని అంటున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానంపై అసంతృప్తితో బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి... గులాబీ వనంలో వికసిస్తారా...? అక్కడి నుంచి మళ్లీ బయటికి వస్తారా...? ఇంతకీ జీవన్ రెడ్డిలో పొలిటికల్ జర్నీలో ఎలాంటి మలుపులు తిరుగుతాయో వేచి చూడాల్సిందే.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి




**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్20 (జనంసాక్షి) :** నిర్మల్ లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ గారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అంబేద్కర్ ని అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. అనంతరం రాజ్యంగా పీఠిక కు చెందిన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, కన్వీనర్ రాచకొండ సాగర్, ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ అంకం మౌనిక, ప్రధాన కార్యదర్శులు రవీందర్ రెడ్డి, చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ అడ్వాల రమేష్, తో పాటు పట్టణ, మండల అధ్యక్షులు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాల మెరుగుదల లక్ష్యంగా విద్య బోధన సాగాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా, సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. స్టోర్ రూమ్ తనిఖీ చేశారు. ఫుడ్ కమిటీ లో సభ్యులుగా ఉన్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ, వారికి అందిస్తున్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల ముడిసరుకుల గడువు వివరాలు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆహార పదార్థాల గడువు తేదీ రిజిస్టర్లలో తప్పనిసరి నమోదు చేసి, ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ ఉండాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విషయంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వసతి గృహాల్లో సంక్షేమ వారోత్సవాలు సమర్థవంతంగా చేపట్టాలని వివరించారు. అవసరమైన చిన్న చిన్న రిపేర్లకు సంబంధించిన పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారురాలు సుల్తానా కు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నందున లబ్ధిదారు కుటుంబ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. తనకు ఇందిరమ్మ ఇంటిని కట్టించినందుకు ప్రభుత్వానికి లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు. తన సొంత ఇంటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న, డిటిడిఓ అంబాజీ, తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మికాంత రావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, గ్రామ సర్పంచ్ మల్లేష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

- ఎమ్మెల్యే అనిల్ జాధవ్

**నెరడిగొండ, ఏప్రిల్20 (జనంసాక్షి) :** అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందే విదంగా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన గొల్ల నారాయణ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృ ప్రవేశానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అర్హులందరికీ రెండవ విడతలో ఇల్లు అందేలా కృషి చేస్తానని అన్నారు.గ్రామంలో నిర్మిస్తున్న ఇండ్లను త్వరతరగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీఓ శేఖర్ హౌసింగ్ డి ఈ రమేశ్ నాయకులు పాల్గొన్నారు..

## బాసరలో బాబు జన్మదిన వేడుకలు




**బాసర, ఏప్రిల్ 20(జనం సాక్షి) :** 'బాసర అభివృద్ధి అంటేనే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సీఎం చంద్రబాబు నాయుడు గుర్తొస్తారు" అంటూ ఇక్కడి స్థానికులు, ఆయన అభిమానులు ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో చంద్రబాబు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారి, బస్టాండ్ వద్ద సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల్ల లక్ష్మణ్, నాగేష్, సాయి, సురేష్, చంద్రమోహన్, గణేష్, దేవ్ భాయ్, అల్లంరాజు తదితరులు పాల్గొన్నారు. బాసర క్షేత్ర అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర కీలకమని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఆయన హయాంలోనే టీటీడీ ఆధ్వర్యంలో బాసరలో అతిథి గృహం నిర్మించారని, హుడా ద్వారా పట్టణ అభివృద్ధి, జన్మభూమి కార్యక్రమం కింద సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారని చెబుతున్నారు.



## మహిళల అభ్యున్నతికి ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి సీతక్క

**కాటారం ఏప్రిల్ 20( జనం సాక్షి):** మహిళల అభ్యున్నతి కోసమే ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తురుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

మహిళల కోసం రూ.66 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. అలాగే స్వశక్తి సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అప్పగించడం ద్వారా రూ.1.60 లక్షల కోట్ల లాభాన్ని సమకూర్చినట్లు వెల్లడించారు.

ఇక మహిళల ఉపాధి అవకాశాల పెంపు దిశగా కుట్టు శిక్షణ కేంద్రాలు, పెట్రోల్ పంపులను అప్పగిస్తున్నామని, కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 20, (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నార్వాయిపేట గ్రామానికి చెందిన కైరత్ పాషా తమ తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమిని కొందరు అక్రమంగా మార్చి పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సాయిని శ్రీనివాస్ తనకు హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులో గల భూమి వివరాలను భూ భారతి పోర్టల్ లో నవీకరించి పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సాయికుమార్ తమ తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమిని తమకు ఎలాంటి సమాచారం లేకుండా కొందరు విక్రయించారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన తాళ్లపల్లి నరేష్ తాను రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట ఆన్లైన్ లో నమోదు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గుండా రవీందర్ తల్లితండ్రుల పోషణ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి అయినా తన కుమారుని నుండి ప్రతినెల నగదు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కొత్త మాధవి, కొత్త కిరణ్ మానసిక దివ్యాంగులు అయిన తమకు పెన్షన్ ఇప్పించాలని వేరువేరుగా కోరుతూ అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ కు చెందిన లింగన్నపేట సత్యనారాయణ తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం పోతపల్లి గ్రామానికి చెందిన ఆవునూరి రాయలింగు తనకు గల భూమి ప్రభుత్వ రికార్డులలో తప్పిపోయినదని, నమోదు చేసి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీల సంఖ్య పెంపుదల ముఖ్యం కాదు

# ప్రజాస్వామ్య నాణ్యతే అసలు ప్రశ్న

**భారతదేశంలో లోక్‌సభ సభ్యుల సంఖ్య పెంపు, నియోజకవర్గాల పునర్విభజన, జనాభా ఆధారంగా కొత్త ప్రాతినిధ్యం వంటి అంశాలపై ఇటీవలి కాలంలో మళ్లీ తీవ్ర చర్చ మొదలైంది. అధికార పార్టీ దీనిని ప్రజాస్వామ్య అవసరంగా చూపుతుంటే, ప్రతిపక్షాలు ప్రాంతీయ సమతౌల్యం, రాజకీయ లాభనష్టాల కోణంలో స్పందిస్తున్నాయి. టెలివిజన్ స్టూడియోలు, రాజకీయ వేదికలు, సోషల్ మీడియా చర్చలన్నీ సంఖ్యల చుట్టూనే తిరుగుతున్నాయి. కానీ దేశ ప్రజల మనసులో మాత్రం మరింత ప్రాథమికమైన ప్రశ్న ఉంది. ఇప్పుడున్న ఎంపీలు ఎంత మంది సక్రమంగా పని చేస్తున్నారు? పని చేయని వ్యవస్థలో సభ్యుల సంఖ్య పెంచితే దేశానికి లాభమా, లేక భారం పెరుగుతుందా?**

ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున మాట్లాడటానికి, ప్రభుత్వాన్ని ప్రశ్నించటానికి, చట్టాలను పరిశీలించటానికి, దేశ దిశను నిర్ణయించటానికి ఎంపీలు ఎన్నుకోబడతారు. కానీ గత దశాబ్ద కాలపు పార్లమెంట్ పనితీరు చూస్తే సంఖ్య కంటే నాణ్యతే క్షీణించినట్లు స్పష్టమవుతోంది. లోక్‌సభ సమావేశాల రోజులు గణనీయంగా తగ్గాయి. ఒకప్పుడు సంవత్సరానికి 120 రోజులు సమావేశమైన పార్లమెంట్, ఇప్పుడు సగటున 55--70 రోజుల మధ్యకే పరిమితమవుతోంది. 17వ లోక్‌సభ పూర్తి కాలంలో జరిగిన సిట్టింగ్స్ సంఖ్య కూడా గతంతో పోలిస్తే తక్కువగానే నమోదైంది. అంటే దేశ సమస్యలు పెరుగుతున్నాయి, కానీ వాటిపై చర్చించాల్సిన వేదిక సమయం తగ్గుతోంది.

హాజరు శాతం కొంతమేర బాగుందని చెప్పవచ్చు. చాలామంది సభ్యులు సభకు వస్తున్నారు. కానీ వారిలో ఎంతమంది ప్రజా సమస్యలపై మాట్లాడారు? ఎంతమంది రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆరోగ్యం, విద్య, పేదరికం వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు? ఎంతమంది చట్టాలపై లోతైన చర్చ చేశారు? ఎన్నో కీలక బిల్లులు నిమిషాల్లో ఆమోదం పొందాయి. కమిటీలకు పంపి పరిశీలించే సంప్రదాయం బలహీనపడింది. ప్రశ్నోత్తర సమయం కూడా పలుమార్లు అంతరాయాలకు గురైంది. ఈ పరిస్థితుల్లో ఎంపీల సంఖ్య పెంపు గురించి మాట్లాడటం, ఇల్లు కూలిపోతుంటే పై అంతస్తు నిర్మించాలనుకోవడం లాంటిదే.

ఇంకా తీవ్రమైన సమస్య ఏమిటంటే పార్లమెంట్ క్రమంగా ధనికుల ఆధిపత్య వేదికగా మారుతోంది. ఇటీవల ఎన్నికైన సభ్యులలో అత్యధికులు కోటీశ్వరులే. కోట్లాది ఆస్తులు, వ్యాపార సామ్రాజ్యాలు, కార్పొరేట్ సంబంధాలు ఉన్నవారు ప్రజా ప్రతినిధులుగా వస్తున్నారు. ఇది చట్టపరంగా తప్పు కాకపోయినా, ప్రజాస్వామ్య పరంగా ప్రశ్నార్థకమే. ఎందుకంటే భారీ వ్యాపార ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు విధానాలను ప్రజల కోసం చూస్తారా? లేక తమ రంగాలకు, తమ వ్యాపారాలకు, తమ పెట్టుబడులకు అనుకూలంగా మలచాలని చూస్తారా? ఇది సహజమైన ప్రజా అనుమానం.

పేదలు, మధ్యతరగతి, కార్మికులు, చిన్న రైతులు, నిరుద్యోగ యువత, చిన్న వ్యాపారులు ... నిజానికి వీరే దేశానికి వెన్నెముక. కానీ విధానాల చర్చలో వీరి స్వరం తరచూ బలహీనంగా కనిపిస్తుంది. విద్య ఖర్చులు పెరిగినా, వైద్య భారం అధికమైనా, ఇంధన ధరలు మండిపోతున్నా, పట్టణ మధ్యతరగతి (ఈ.ఎం.ఐ.)లతో నలిగిపోతున్నా, గ్రామీణ పేదలు ఉపాధి కోసం పోరాడుతున్నా, పార్లమెంట్‌లో నిరంతర ఒత్తిడి కనిపించదు. ప్రజల దైనందిన కష్టాల కంటే రాజకీయ వ్యూహాలు, ఎన్నికల గణాంకాల వ్యూహాలు, అధికార పోరు ప్రధాన చర్చనీయ అంశాలుగా మారాయి.

ఇంకా ప్రజలను విసిగించే అంశం పార్టీ ఫిరాయింపులు. ఎన్నికల ముందు ఒక సిద్ధాంతం, ఎన్నికల తర్వాత మరో పార్టీ. ప్రజలు ఒక జెండాకు ఓటేస్తే, కొందరు సభ్యులు పదవుల కోసం, మంత్రి పదవుల కోసం, గత నేర చరిత్ర కేసుల భయాలతో, లేదా అధికారానికి దగ్గరగా ఉండాలనే ఆశతో పార్టీలు ఫిరాయిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ నైతికత సమస్య కాదు; ఇది ఓటరును బహిరంగంగా బిడియం లేకుండా నిస్సిగ్గుగా మోసం చేయటం. ప్రజాస్వామ్యంలో ఓటరు ఇచ్చిన ఓటు విలువ కేవలం వ్యక్తికి మాత్రమే కాదు, అతడు ప్రకటించిన సిద్ధాంతానికి నమ్మకంతో ఇచ్చింది కూడా. ఆ విలువను తుంగలో తొక్కి అధికారం వైపు వెళ్లే నాయకులు సంఖ్య పెరిగితే మాత్రం ప్రజాస్వామ్యం బలపడుతుందా!?

క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న సభ్యుల సంఖ్య కూడా ప్రజాస్వామ్యానికి మచ్చగానే ఉంది. తీవ్రమైన కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తులు చట్టసభల్లో కూర్చోవడం ప్రజలకు తప్పుడు సంకేతం ఇస్తుంది. చట్టాన్ని గౌరవించాల్సిన వేదికలోనే చట్టపరమైన అనుమానాలున్నవారు ప్రభావం చూపితే వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుంది.

ఇంతకీ ఇప్పుడు సభ్యుల సంఖ్య పెంచితే ఏమవుతుంది? మరిన్ని జీతాలు, భత్యాలు, నివాసాలు, భద్రత, సిబ్బంది, కార్యాలయాలు, పెన్షన్లు, పరిపాలనా ఖర్చులు పెరుగుతాయి. ఇది చివరకు ప్రజల పన్ను డబ్బే. ప్రజలకు మెరుగైన చట్టాలు, బలమైన చర్చలు, పారదర్శక పాలన, అవినీతి తగ్గింపు, బాధ్యతాయుత ప్రతినిధులు రాకపోతే ఈ ఖర్చు న్యాయసమ్మతం కాదు.

సంఖ్య పెంపు ముందు దేశానికి అవసరమయ్యేవి స్పష్టమైన సంస్కరణలు. సభ్యుల పనితీరుపై వార్షిక ప్రజా నివేదికలు ఉండాలి. హాజరు, చర్చల్లో పాల్గొనడం, కమిటీ పని, అడిగిన ప్రశ్నలు, ప్రజా నిధుల వినియోగం అన్నీ ఓటర్లకు తెలిసేలా ఉండాలి. క్రిమినల్ కేసులున్న అభ్యర్థుల విచారణ వేగవంతం కావాలి. పార్టీ ఫిరాయింపులపై కఠిన చట్టాలు అమలు కావాలి. సభా అంతరాయాలకు శిక్షలు ఉండాలి. చట్టాలను కమిటీలకు పంపడం తప్పనిసరి కావాలి. ముఖ్యంగా సామాన్య వర్గాల నుంచి నిజమైన ప్రతినిధులు రాజకీయాల్లోకి వచ్చేలా ఎన్నికల ఖర్చు సంస్కరణలు అవసరం.

దేశానికి పెద్ద పార్లమెంట్ కంటే గొప్ప పార్లమెంట్ అవసరం. కుర్చీలు పెరగడం వల్ల ప్రజాస్వామ్యం బలపడదు; బాధ్యత పెరగడం వల్లే బలపడుతుంది. కోటీశ్వరుల సభగా, అవకాశవాదుల వేదికగా, పార్టీలు ఫిరాయించే నాయకులకు ఆశ్రయంగా, ప్రజా సమస్యలపై నిశ్శబ్ద వేదికగా పార్లమెంట్ మారితే సభ్యుల సంఖ్య 543 అయినా, 800 అయినా ప్రయోజనం లేదు. ప్రజలు ఇప్పుడు అడుగుతున్న ప్రశ్న చాలా సరళం. సూటిగా అడిగేది...ముందు పనిచేసే ఎంపీలను ఇవ్వండి... తర్వాత సంఖ్య పెంచండి. ఇదే ప్రజాస్వామ్యానికి నిజమైన కనువిప్పు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

---

# చరిత్ర, తత్వశాస్త్రం కన్నా వర్తమాన కర్తవ్యాలు, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు ముఖ్యం






టన్నుల కొద్ది సిద్ధాంతాల కన్నా ఆచరణాత్మక కర్తవ్యాలే ముఖ్యం. ఎన్ని సుద్దులు సిద్ధాంతాలు చరిత్ర చెప్పినా ఆచరణాత్మక కార్యక్రమాలు వాటి అమలు ముఖ్యం. అందువల్ల కాంగ్రెస్, బిజేపీ, ఆర్.ఎస్.ఎస్ పక్షాలు, మావోయిస్టులు, సోషలిస్టులు, టిడిపి, బీఆర్ఎస్, బీయస్పీ వంటి పార్టీలు, సంస్థలు వర్తమాన కర్తవ్యాలు ప్రకటించాలి. అయిదేళ్లలో ఏం చేస్తారో ఎన్నికల ప్రణాళికలో పేర్కొనాలి. ప్రణాళిక అమలుకు క్యాలెండర్ ప్రకటించాలి. అందువల్ల ప్రజలకు తక్షణం ఏమేం చేస్తారో తెలుస్తుంది. తెలపాలి. వర్తమాన కర్తవ్యాల రూపకల్పనతోనే తమ తమ చారిత్రక దృక్పథం, తాత్విక దృక్పథం, సమాజ నిర్మాణం పట్ల సమగ్ర అవగాహన ప్రతిఫలించాలి.

**జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం - రాజ్యాంగ భరోసా**

విద్య, వైద్యం, నిరుద్యోగం సమస్యల పరిష్కారంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి. వీరు పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారులుగా, కాంట్రాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, న్యాయమూర్తులుగా, శాసనకర్తలుగా, పరిపాలనా దక్షులుగా జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం అందుకోవడానికి చట్టసభల్లో, ఉద్యోగ, న్యాయస్థానాలలో రిజర్వేషన్ల అమలు (ఆర్టికల్స్ 15(4), 16(4)) గురించి పార్టీల ప్రణాళికలో పేర్కొనాలి. రాజ్యాంగ ప్రవేశిక పేర్కొన్న సామాజిక, ఆర్థిక న్యాయం ఆర్టికల్ 38, 39 ద్వారానే సాధ్యమవుతుంది.

**అర్థశాస్త్ర అంశాలు - వర్తమానమే జీవనాడి**

చరిత్రకు అర్థశాస్త్రానికి మధ్య ఉండే సంబంధం గతానికి, వర్తమానానికి మధ్య ఉండే సంబంధమే. అర్థశాస్త్రం వర్తమానం. గతానికి, వర్తమానానికి మధ్య జరిగే నిరంతర సంభాషణే చరిత్ర అంటాడు ఇ. హెచ్. కార్. సిద్ధాంతాలేవీ జీవితానికి మించినవి కావు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 ప్రాతిపదికన వివక్ష లేని అభివృద్ధి సాగాలి. భారతదేశంలో 'ఇండియన్ ఎకనమిక్ కాంగ్రెస్' ద్వారా సంపద సృష్టి, సమాన పంపిణీపై లోతైన కృషి జరగాలి. అప్పుడే దేశం ఆర్థికంగా పరిపుష్టి చెందుతుంది.

**చరిత్రపై అతి శ్రద్ధ - సామాజిక సంఘర్షణలకు దారి**

మనదేశంలో సంపద సృష్టి, నైపుణ్యాల అభివృద్ధి పట్ల శ్రద్ధ తక్కువ, చరిత్ర పట్ల , మత విద్వేషాల పట్ల , కమ్యూనిస్టులైతే వర్గాల పట్లఎక్కువ శక్తిని "ప్రతిభ"ను కనబరుస్తారు. దీనివల్ల సమాజంలో సంఘర్షణ పెరిగింది. చరిత్ర గురించి, వర్ణ వర్గ కుల వివక్షల వాదోపవాదాలతో సమయం వృధా చేసే బదులు, ఆర్థిక తత్వశాస్త్రానికి, వైజ్ఞానిక రంగానికి నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలి. అధ్యాపకులు కేవలం పాఠాలు చెప్పేవారిగా కాకుండా, సమాజానికి నూతన అంశాలను జోడించే శాస్త్రవేత్తలుగా ఎదగాల్సిన అవసరం నేడు ఎంతో ఉంది.

**గతం కన్నా వర్తమాన జీవన ప్రమాణాలు ముఖ్యం**

గతంలో కొన్ని సామాజిక వర్గాలు కులం, మతం పేరిట ఆధిపత్యం చలాయించాయి. ప్రస్తుత ప్రజాస్వామ్యంలో వీటన్నిటిని వదిలి స్వేచ్ఛా సమానత్వంతో ముందుకు సాగడం రాజ్యాంగ లక్ష్యం. ఆర్టికల్ 17 ప్రకారం అస్పృశ్యత నివారణ ఒక సామాజిక కర్తవ్యం. నూతన ఆవిష్కరణలు వదిలి చరిత్ర గురించి మాత్రమే మాట్లాడే వారు అసలు విషయాలను పక్కదారి పట్టిస్తున్నా రని భావించవచ్చు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం, శాంతియుత పరివర్తన సాధించడమే మన తక్షణ ధ్యేయం కావాలి.

**విద్య - నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం**

అమెరికా వంటి దేశాల్లో నూతన ఆవిష్కరణల వల్ల 75 శాతం బిలియనీర్లు తొలితరం వారే. కానీ మనదేశంలో ఉన్నత అవకాశాలను ఇంకా పాత తరాల వారే ఆక్రమిస్తున్నారు. దీనికి విరుగుడు ఆర్టికల్ 21ఏ మరియు ఆర్టికల్ 46 అమలు చేయడమే. నూరు శాతం తొలితరం వెనుకబడిన వర్గాల వారికి నాణ్యమైన ఆధునిక విద్యను పదహారేళ్ళపాటు 'కేజీ టు పీజీ' ఉచిత రెసిడెన్షియల్ విధానంలో అందించినప్పుడే నిరుద్యోగం తొలగి, కొత్తతరం పారిశ్రామికవేత్తలు తయారవుతారు.

**భారతదేశ పునర్నిర్మాణం - వైజ్ఞానిక దృక్పథం**

వలసపాలన వల్ల ఇండియాలో నూతన ఆవిష్కరణలు కుంటుపడ్డాయి. స్వాతంత్ర్యం తర్వాత కూడా మనం వైజ్ఞానిక ప్రపంచానికి లీడర్‌గా కాకుండా ఫాలోవర్‌గా మిగిలిపోయాం. దేశం సంపన్నంగా ఎదగడానికి మనవైన ఆవిష్కరణలు, ఉపాధి కల్పన (ఆర్టికల్ 41) అత్యంత ముఖ్యం. అర్థశాస్త్రవేత్తలు చరిత్రకన్నా వందల రెట్లు ఎక్కువ కృషి చేసి గ్రామీణ వృత్తుల ఆధునీకరణకు, వ్యవసాయ రంగంలో నూతన ఉత్పత్తి విధానాలకు బాటలు వేయాలి.

**అమలు క్యాలెండర్ - ప్రజాస్వామ్య జవాబుదారీతనం**

ప్రతి రాజకీయ పార్టీ తన ఎన్నికల ప్రణాళికను అమలు చేసే తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రకటించాలి. కేవలం గతాన్ని తవ్వుకుంటూ కూర్చోవడం సంఘర్షణలకు దారి తీస్తుంది. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో (Articles 330, 332), అన్ని రంగాల్లో అన్ని వర్గాలకు వాటా దక్కినప్పుడే రాజ్యాంగం కలలు గన్న సంక్షేమ రాజ్యం సిద్ధిస్తుంది. టైం పొండ్‌తో నిర్దిష్ట కాల పరిమితిలో సాధించే ప్రోగ్రామ్ లేని ఆదర్శాలు లక్ష్యాలు కడుపు నిఫవు. జీవితాలు మారవు. ఆచరణాత్మక అమలు క్యాలెండర్ ద్వారానే ఏ పార్టీ నిజాయితీ అయినా నిరూపించబడుతుంది.



**బి.ఎస్.రాములు, సామాజిక తత్వవేత్త & భారతదేశ తొలి బీసీ కమిషన్ చైర్మన్**
**ఫోన్. 8331966987**

---

## భాగ్యమే..

ఓటు విలువ గుర్తించుము
చేటు నెరిగి పయనించుము
ఆశల గుండమున మునిగి
నోటుకు బానిస కాకుము

నేతను గని ఓటు వేయి
మాటలమూటలకు సోయి
మరచి నీవు శయనించిన
తలరాతలు మారు నోయి
గతమనునది కట్టి పెట్టు
వర్తమానికి సానపట్టు

పై రెంటిని గమనిస్తూ
భవిత కొరకైపరుగెటు

ఆవులిస్తూ లెక్కించకు
ఆదమరచి నిద్రించకు
మగత మత్తున జోగుతూ
పుణ్య తిథి విస్మరించకు

నీవే దేశ పనిముట్టు
కలుపు మొక్కల నరికటు
భయం విడిచి రణం సలిపిన
భాగ్యమే తలుపు తటు

**నమిలకొండ నాగేశ్వర్ రావు**
**8688553470, మేడ్చల్**

---

## ఆంతరంగిక మిత్రమా!


నువ్వు...
అక్షరాల్లో దొరకని అర్థానివి!
గుండె లోతుల్లో దాగున్న
మౌనానివి!!
అలసిపోయిన వేళ కనురెప్పల!
చాటున చేరే నిదురవు!!
కలత చెందిన మదికి!
ఓదార్పునిచ్చే జ్ఞాపకానివి!!
బాహ్య ప్రపంచపు హోరులో!
నన్ను నేను వెతుక్కునే ప్రశాంతతవు!!
నా ఏకాంతపు లోయల్లో !
ప్రతిధ్వనించే నా ఆత్మీయానివి!!
నీ ఉనికి ఏదని అడగను...
ఎందుకంటే, నీవే నేను...
నేనే నీవు!
నన్ను విడదీయలేని ఏకత్వానివి!!

**డా పూసపాటి వేదాద్రి**
**9912197694**

---

# ఈశాన్య రాష్ట్రాల సాహిత్యాన్ని ఎందుకంత తక్కువగా అనువాదం చేసుకుంటున్నాం ?

*మనకి తెలిసిన ఇంకా తెలుగు భాష లోనికి అనువాదం చేసుకున్న ఈశాన్య భారతం కి చెందిన రచయితలు ఎవరు అని ప్రశ్నించుకుంటే మనకి చప్పున గుర్తు వచ్చేవారు ఇందిరా గోస్వామి,బీరేంద్ర కుమార్ భట్టాచార్య, మమోని రైసాం గోస్వామి,రీటా చౌధురి ఇలాంటి వారు. వీరంతా అస్సాం రాష్ట్రానికి చెందిన వారు. అస్సామీ ఇంకా ఇంగ్లీష్ భాషలోని వారి రచనల్ని తెలుగు లోనికి అనువాదం చేయడం తో ఈశాన్య రాష్ట్రాలు అనగానే వాళ్ళే గుర్తుకి వస్తారు. కాని అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయా,త్రిపుర,మిజోరం ఈ రాష్ట్రాల నుంచి వచ్చిన సాహిత్యాన్ని మనలో ఎంతమందిమి చదివి ఉంటాము? నిజానికి చాలా తక్కువ గా ఉంటుంది ఆ సంఖ్య, అని చెప్పక తప్పదు.ఆ రాష్ట్రాల నుంచి ఎంతో ఆసక్తిదాయకమైన సాహితీ కృషి జరిగింది.అయితే తెలుగు లోనికి అనువాదం చేసుకోవడం లో ఎందుకో అంత చొరవ తీసుకోలేదు.*



ఆయా రాష్ట్రాల్లో దాదాపుగా 200 గిరిజన ఉప తెగలు ఉన్నాయి. మనకి బాగా తెలిసిన తెగలు కుకీ, మైటీ, లెప్చా, భూటియా,త్రిపురి,రియాంగ్,మిజొ,గారో,ఖాసీ,బోడో,ఆది,మిషింగ్ లాంటివి. అయితే ఆ రాష్ట్రాల్లోని రచయితలు చాలా మంది ఇంగ్లీష్‌లో రాయడం వల్ల ఒక తరహా పాఠకులకి అక్కడి సమస్యలు,సంప్రదాయాలు,జీవన విధానాలు తెలిశాయి.అయితే ఇంగ్లీష్ భాష లో వచ్చే సాహిత్యాన్ని చదివే అలవాటు మన పాఠకుల్లో తక్కువ.అందునా మన సాహితీపరులకి కూడా ఎందుకో గాని, అస్సాం దాటి అవతలి ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే సాహిత్యం పెద్దగా ఆకర్షణ కలిగించలేదు.

దానివల్ల తెలుగు అనువాద సాహిత్యం లో పెద్ద లోటు ఆ మేరకు ఏర్పడిందని చెప్పాలి. మరి పొరుగున ఉన్న దక్షిణాది రాష్ట్రాల విషయం ఏమిటా అని పరిశీలిస్తే తమిళులు,మళయాళీలు, కన్నడిగులు ఒక్క అస్సామీస్ నుంచి మాత్రమే గాక ఇతర ఇతర ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన పుస్తకాల్ని చక్కగా వాళ్ళ భాషల్లోకి ఈపాటికే అనువదించుకున్నారు.

అసలు ఎందుచేత ఈశాన్య రాష్ట్రాల్లోని చాలా మంది ఇంగ్లీష్ లో రాస్తారు అనేదాన్ని ముందుగా తెలుసుకోవాలి. దీనికి కొన్ని చారిత్రక,సామాజిక కారణాలు ఉన్నాయి.స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటిష్ వారి హయాం లో అమెరికా,ఫ్రాన్స్,ఇంకా బ్రిటన్ నుంచి వచ్చిన క్రైస్తవ మిషనరీలు దుర్గమమైన అరణ్యాల్లో కి కూడా చొచ్చుకిపోయి పాఠశాలలు తెరిచారు.స్థానికంగా ఉన్న భాషలకి లిపి లేకపోవడం తో ఇంగ్లీష్ నే అనుసంధాన భాష గా చేశారు.

అలా మాట్లాడటానికి ,రాయడానికి ఇంగ్లీష్ అనేది ప్రాధాన్యత వహించింది. అనేకమైన తెగలతో,స్థానిక భాషలతో అలరారే ఆయా రాష్ట్రాల్లో ఇంగ్లీష్ ఒక లింగా ఫ్రాంకా గా మారిపోయింది. మొదటి తరం రచయితలు అందరూ కూడా ఇంగ్లీష్ లోనే రాయడానికి పూనుకోవడం తో ఆ తర్వాత అదే సంప్రదాయాన్ని అందరూ కొనసాగించారు. ఇప్పటికీ,కవిత్వం,కథ,నవల,నాటకము ఇలా అన్ని ప్రక్రియలు వాళ్ళు ఇంగ్లీష్ లోనే కొనసాగిస్తున్నారు. అంత మాత్రం చేత వాళ్ళు స్థానిక భాషల్ని పూర్తిగా మర్చిపోలేదు. వాటిని కూడా అభివృద్ధి పరుచుకుని కొంతమంది వాటిల్లోనూ రాస్తుంటారు.ఇంకా చాలామంది స్థానిక భాషల్లోనూ, ఇంగ్లీష్ లోనూ రాస్తుంటారు.పర్యావరణం,సామాజిక సమస్యలు,తెగల మధ్య ఘర్షణలు,కేవలం ఈశాన్య రాష్ట్రాల్లోనే చూడగలిగే ఆచార సంప్రదాయాలు,ఇలా ఎన్నో వైవిధ్యం కలిగిన ఇతివృత్తాలతో వాళ్ళు రచనలు చేస్తున్నారు.

వారి జానపద సాహిత్యంని ఎక్కువగా ఇంగ్లీష్ భాషలోనికి అనువదించారు. ఇంకా ఆ కృషి సాగుతూనే ఉన్నది.కింఫోం సింగ్ నాంకిర్ని "ఖాసీ లెజెండ్స్" అనే పేరు తో ఒక పుస్తకం వెలువరించాడు.ఈస్టరైన్ కైర్ అనే రచయిత్రి " వెన్ రివర్ స్లీప్స్" అనే ఇంగ్లీష్ నవలలో నాగా లాండ్ యొక్క సంస్కృతిని చక్కగా స్పృశించారు. సిక్కిం రచయిత ఈషే డోమా "లెజెండ్స్ ఆఫ్ లెప్చాస్ లో స్థానిక జానపద కథల్ని అక్షరబద్ధం చేశాడు. మిజోరం కి చెందిన జానపద గాథల్ని లాల్తుంగ్ లియాన్ ఖియాంతె రాశాడు.

అలాగే ఆధునిక ఇతివృత్తాలతోనూ టెంసులా ఆవో, జానైస్ పేరియట్, మమాంగ్ డాయ్ ఇలాంటి రచయిత్రులు కొత్తపుంతలు తొక్కుతున్నారు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ కి చెందిన మమాంగ్ డాయ్ ని ఈశాన్య రాష్ట్రాల సాహిత్య చరిత్ర కి ఘన కీర్తిని తెచ్చిన రచయిత్రి గా గౌరవిస్తారు. ఆమె రాసిన ద బ్లాక్ హిల్స్ అనే ఇంగ్లీష్ నవల దేశ విదేశాల్లో విశేషమైన పేరు ప్రఖ్యాతులు పొందింది. అరుణాచల్ నుంచి మొదటి ఐ.ఏ.ఎస్. అధికారిగా 1979 లో సెలెక్ట్ అయిన ఆమె కొన్నాళ్ళ తర్వాత స్వచ్ఛంధ విరమణ చేసి పూర్తి స్థాయి రచయిత్రి గా చాలా పుస్తకాలు రాశారు.హిందూస్థాన్ టైంస్, టెలిగ్రాఫ్ దినపత్రికల్లో కాలమిస్ట్ గా ప్రఖ్యాతి వహించారు.పద్మశ్రీ,కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ఇలా ఎన్నో గౌరవాలు పొందారు. ఆమె రాసిన ద లెజెండ్స్ ఆఫ్ పెన్సన్,ద స్టుపిడ్ క్యుపిడ్,ఎస్కేపింగ్ ద ల్యాండ్,ద స్కై క్వీన్,ఒన్స్ అపాన్ ఏ మూన్ టైం అలాంటి నవలలు అన్నీ మంచి ఆదరణ పొందాయి.

ఇటీవల ఏంజల్ చక్మా అనే త్రిపుర రాష్ట్రానికి చెందిన యువకుడిని ఉత్తరాఖండ్ రాష్ట్రం లో చైనా వాడిలా ఉన్నావు అంటూ వేధించి చనిపోయేలా చేసిన దుండగులు ఈశాన్య రాష్ట్రాల చరిత్ర ని , సాహిత్యాన్ని చదివి ఉంటే అలా చేసి ఉండేవారు కాదు.ఒకరి గురించి లేనిపోని అపోహలు పెంచుకోవడం,సరైన జ్ఞానం లేకపోడం ఇవి చాలా ప్రమాదకరమైన పరిస్థితులకి దారి తీస్తాయి. నిజానికి ఈశాన్య రాష్ట్రాల ప్రజలు బర్మా,టిబెట్,ఆగ్నేయాసియా దేశాల ప్రజలకి జన్యుపరంగానూ,సంస్కృతి పరం గానూ దగ్గరగానూ ఉంటారు. అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, సిక్కిం,త్రిపుర,మేఘాలయా వంటి రాష్ట్రాలకి పర్యటనకి వెళుతున్న తెలుగువారు ముక్త కంఠం తో ఒక మాట చెబుతుంటారు.

రోడ్ల మీద గాని, హోటల్స్‌లో గాని అక్కడి ప్రజల యొక్క సివిక్ సెన్స్ ఎంతో బాగుంటుందని,పర్యావరణాన్ని శ్రద్ధగా కాపాడుకుంటారని చాలా కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ఇలాంటి మంచి అలవాట్లు చూడగలం అని చెబుతుంటారు. ఈశాన్య రాష్ట్రాల లోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే సాహిత్యాన్ని ఇకనైనా తెలుగు లోకి ఎక్కువ గా అనువాదం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.



**మూర్తి కెవివిఎస్**
**7893541003**

---

# బీజేపీకి తమిళ 'నాడి' చిక్కేనా?



ద్రవిడ అస్తిత్వం కలిగిన దక్షిణాది రాష్ట్రంగా ఉన్న తమిళనాడులో పాగా వేయాలని బీజేపీ చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. రకరకాల సమీకరణాలు, వ్యూహాలతో తమిళనాడులో విస్తరణకు కమలనాథులు రంగంలో ఉంటున్నారు. తమిళనాడులో పట్టుకు ఎత్తుగడలను వేస్తున్నారు. హిందీ, హిందూత్వకు వ్యతిరేకంగా ప్రాంతీయ(ద్రవిడ) అస్తిత్వమే భూమికగా ఇక్కడ రాజకీయాలు సాగుతుంటాయి. ప్రాంతీయ భావన, తమిళ భాష ఆత్మగౌరవం తమలో ఇమిడ్చుకున్న తమిళులు జాతీయ పార్టీల పట్ల అంతగా ఆదరణ చూపేందుకు మొగ్గ చూపరనే వాదనలూ ఉన్నాయి. అయినా స్వయంగా దేశ ప్రధాని నరేంద్రమోడీ సైతం తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వంలో పాల్గొన్నారు. అన్నాడీఎంకేతో పొత్తులో ఉండి కూటమిలో భాగంగా 27 స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తోంది. ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకునే కమలం పార్టీ ఈసారి తమిళనాట రాజకీయ స్థానం సంపాదించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నది.

**'బండి' మాదిరిగానే 'అన్నామలై'ను పక్కకు..?**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ కుమార్‌ను తొలగించిన నేపథ్యంలో ప్రజలు సైతం.. బీజేపీ వైపు నుంచి తమ చూపును కాంగ్రెస్ వైపు చూడటం, రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారం లోకి రాగలిగిందని రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. తమిళనాడులో సైతం బీజేపీని బలంగా క్షేత్రస్థాయిలో నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా మాజీ ఐపీఎస్ అధికారి కే.అన్నామలై పాదయాత్ర చేసి.. జనంలో బీజేపీ పట్ల ఆదరణకు అడుగులు వేశారు. దీనికి బండి సంజయ్ 'ప్రజాసంగ్రామ యాత్ర'ను ఆదర్శంగా తీసుకున్నట్లు అన్నామలై చెప్పారు. పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగే లీడర్‌గా తమిళనాడులో ప్రత్యామ్నాయ రాజకీయానికి తెరతీసే ప్రయత్నం చేశారు. ఇంతలో బీజేపీ జాతీయ నాయకత్వం ఆయనను తప్పించింది. దీంతో పార్టీపై ఎఫెక్ట్ ఉంటుందనే వాదనలున్నాయి. బండి సంజయ్ కుమార్‌ను తెలంగాణలో బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తప్పించి.. రణక్షేత్రం నుంచి వైదొలగిన మాదిరిగానే తమిళనాడులో కూడా ఫలితాలుండొచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

**తమిళనాట కమలం వికసించేనా?**

గతంతో పోలిస్తే తాజా 2026 అసెంబ్లీ ఎన్నికల ముఖచిత్రం భిన్నంగా ఉన్నది. గత ఎలక్షన్స్‌లో బీజేపీ సుమారు 57 స్థానాలలో రెండో స్థానంలో నిలవగా, ఈ సారి కేవలం 27 సెగ్మెంట్లలోనే పోటీ చేయడం వెనక ఆంతర్యమేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కే.అన్నామలై వంటి నాయకుడిని ఎన్నికల బరిలో తప్పనిసరిగా నిలిపితే కలిగే మైలేజ్‌ను జాతీయ నాయకత్వం ఎందుకు గుర్తించలేదనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే. పైగా ఆయన పోటీ చేసిన సెగ్మెంట్‌ను పొత్తులో భాగంగా అన్నాడీఎంకేకు కేటాయించడం గమనార్హం. కార్యకర్తలు, సైద్ధాంతిక భావజాలం, బలమైన కేడర్ బూత్ స్థాయి వరకు కలిగి ఉండటం కమలం పార్టీ ప్రత్యేకత. అలాంటి వ్యవస్థను ఇటుక ఇటుక పేర్చుతూ సృష్టించే ప్రయత్నం చేసిన అన్నామలై వంటి లీడర్‌ను పక్కనపెట్టి నైనార్ నాగేంద్రన్ వంటి వారిని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడిని చేయడం పట్ల కార్యకర్తలలో అసంతృప్తి ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే, స్వయంగా దేశ పీఎం తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి రావడం.. బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతున్నది. ఎన్డీయే కూటమి తరఫున ఆయన ప్రచార బాధ్యతలు భుజాన వేసుకుని క్యాంపెయిన్ చేయడంతో ఎన్డీయే అభ్యర్థుల్లో కొంత ఉత్సాహం నెలకొంది. తమిళనాడులో రాజకీయంగా స్థానం కోసం బీజేపీ చాలా కాలంగానే ఎత్తుగడలు వేస్తున్నది. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ చాలా సార్లు తమిళనాడులో పర్యటనలు చేసి, తమిళ భాష గొప్పతనాన్ని ప్రస్తావించారు. చోళుల రాజదండం 'సెంగోల్'ను పార్లమెంటులో ప్రతిష్టించి.. తమిళుల మనసులో స్థానం పొందే ఎత్తుగడనూ ప్రయోగించారు. తమిళనాడును రాజకీయ ప్రయోగశాలగా భావించి రకరకాలుగా కమలనాథులు తమ విస్తరణకు ప్రయత్నాలు బలంగా చేస్తున్నారు. అయితే, ప్రస్తుత తమిళనాడు త్రిముఖ పోరులో డీఎంకే కూటమి, విజయ్ పార్టీని కాదని ప్రజలు ఎన్డీయే వైపు అందులో బీజేపీ పక్షాన ఏ మేరకు మొగ్గ చూపుతారో చూడాలి మరి.



**అంబీర్ శ్రీకాంత్**
**సెల్ : 81859 68059**

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు

- ఈనెల 23 వరకు మొదటి విడత దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని నాగర్ కర్నూల్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు పి విజయ్ కుమార్, యం చంద్రశేఖర్ రావు, సాయిలు సాగర్, కే ప్రదీప్ కుమార్, దస్తగిరి, ముబీన్ అహ్మద్, సురేష్ కుమార్, పి వెంకటస్వామి, ఎం శ్రీనివాసులు, నేతాజీ గౌడ్, సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి, కమిటీ సభ్యులపై ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. అక్రిడిటేష కార్డు కొరకు నమోదు చేసుకున్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు సంబంధించిన అక్రిడేషన్ జారి ప్రక్రియను రంగారెడ్డి జిల్లా నుండి నాగర్ కర్నూల్ జిల్లా కు మార్చేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ కు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గతంలో నాగర్ కర్నూలు జిల్లాకు గుర్తింపుగా ఉన్న నల్లమల్ల అటవీ ప్రాంతంలోని బ్రహ్మగిరి, మున్నూరు లను ప్రత్యేకంగా గుర్తించి, మీడియా అక్రిడేషన్ కార్డులపై ప్రత్యేక అక్రిడేషన్ కార్డుల మంజూరు చేసేలా, కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈనెల 25వ తేదీన జిల్లాలోని జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల మంజూరుకై మొదటి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులంతా ఈ నెల 23వ తేదీలోగా మీడియా అక్రిడేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని, ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన విధంగా ఈనెల 30వ లోగా మీడియా అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి జె కిరణ్ కుమార్, నూతనంగా ఎంపికైన జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీ సభ్యులు పి విజయ్ కుమార్, యం చంద్రశేఖర్ రావు, సాయిలు సాగర్, కే ప్రదీప్ కుమార్, దస్తగిరి, ముబీన్ అహ్మద్, సురేష్ కుమార్, పి వెంకటస్వామి, ఎం శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా (74) అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజావాణి నిర్వహించినట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి
- తంగడపల్లి గ్రామంలో ఇందిరమ్మండ్ల ప్రారంభం



**సదాశివపేట, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు ,కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని, ప్రతి ఒక్కరికి కూడా ఇండ్లు వస్తాయని ఎవరు కూడా అధైర్య పడొద్దు అని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారాధ్యంలో రుణమాఫీ, రైతు భరోసా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం పంపిణీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కిందొడ్ల శేఖర్,ఉప సర్పంచ్ ఇప్పపల్లి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న,పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ రేష్మ, సర్పంచ్‌లు బలరాం అనిత శ్రీనివాస్, ఇందూరి భారతమ్మ బాబు, నాయకులు ఆంజనేయులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అనంతగిరి ఈకో టూరిజంగా అభివృద్ధి

- యాత్రికుల కోసం సకల సౌకర్యాలు
- తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ఈకో టూరిజం వల్ల అనంతగిరి రూపురేఖలే మారబోతున్నాయని, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు పెద్ద మొత్తంలో పనులు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం అనంతగిరి గుట్టలో ఈకో టూరిజం అభివృద్ధిలో భాగంగా అనంతగిరి ఈకో అర్బన్ పార్క్, అనంతగిరి కొండల వీక్షణ గోపురం, అనంతగిరి పర్యావరణ పట్టణ ఉద్యాన వనము, అటవీ అతిథి గృహంలో దెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ దీ బ్రీజ్ ను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ సి.సువర్ణ, చీఫ్ కన్సర్వేటర్లు ప్రియాంక వర్గీస్, సునీత భగవత్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ , మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య లతో కలిసి సభాపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... అనంతగిరి ప్రాంతాన్ని పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం వల్ల వికారాబాద్ దశలవారీగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకో టూరిజం వల్ల పడిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడుతాయని ఆయన తెలిపారు. అనంతగిరిగుట్టలో వివిధ ఔషధ గుణాలు కలిగిన మూలికల చెట్లు ఉన్నందున పర్యాటకులు ఈ ప్రాంతానికి పెద్ద మొత్తంలో వస్తున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న పనులంటిని త్వరితగతిన పనులను చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం మూసీ నది జన్మస్థల ప్రాంతాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** సంక్షేమ వసతి గృహాలను సంబంధిత సిబ్బంది శుభ్రంగా ఉంచుకుంటేనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటారని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో అదనపు కలెక్టర్ సోమవారం గద్వాలలోని బీసీ బాలికల సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రస్తుతం అక్కడ కల్పించిన సౌకర్యాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. వసతిగృహ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఇలాగే ఎల్లప్పుడూ సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు వార్డెన్ కు, అక్కడి సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత , వసతి గృహ వార్డెన్ ప్రమీల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఖానాపూర్ రోడ్డు విస్తరణ బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ పేదల పక్షాన నిలుస్తూ, వారి సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గండిపేట్ మండలం ఖానాపూర్ గ్రామంలో రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోయిన 170 పేద కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసంగా కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించింది. ఈ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అభివృద్ధి పనుల్లో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, గుడిమల్కాపూర్ నార్సింగ్ ఏఎంసి చైర్మన్లు తలారి మల్లేష్ ముదిరాజ్, కోట వేణు గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్. నరసింహ, మాజీ కౌన్సిలర్లు అమరేందర్ రెడ్డి, రామ కృష్ణారెడ్డి, నేతలు ఆర్. శ్రవణ్, లక్ష్మీ శ్రీ, హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జలమండలి అప్రమత్తం

- నిరంతర తాగునీటి సరఫరా కోసం చర్యలు
- వాతావరణ ప్రభావాలతో పంపింగ్‌కు అంతరాయం



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరానికి తాగునీటిని సరఫరా చేసే సింగూర్, మంజీర పంప్ హౌస్‌లు ఉన్న ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గాలి దుమారం, వడగండ్ల వానలు, అకాల వర్షాలు తరచూ సంభవించడం వల్ల చెట్లు విరిగి పడటం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడి, నీటి పంపింగ్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోవడం జరుగుతోంది. ఫలితంగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఆలస్యమవడం లేదా అంతరాయం కలగడం జరుగుతోంది. ఈ పరిస్థితులు పాత మంజీరా నీటి సరఫరా వ్యవస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. 15 నుండి 30 నిమిషాలపాటు మాత్రమే కొనసాగే స్వల్పకాలిక విద్యుత్ అంతరాయాలు కూడా మంజీరా వ్యవస్థకు చెందిన పంపింగ్ స్టేషన్ల కార్యకలాపాలను గణనీయంగా దెబ్బతీస్తున్నాయి. ఆదివారం రోజున జరిగిన విద్యుత్ అంతరాయం కారణంగా మొత్తం కలిపి సుమారు 7 గంటలపాటు పంపింగ్ నిలిచిపోవడంతో షెడ్యూల్ ప్రకారం జరిగే పనులు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. విద్యుత్ సరఫరాలో తరచుగా వచ్చే అంతరాయాలు పంపింగ్ ప్రక్రియను నిలిపివేయడమే కాకుండా, పనితీరు లోపాలు, నీటి ప్రెషర్ లో మార్పులు, స్థిరమైన నీటి సరఫరా అందించడంలో ఆలస్యానికి దారితీస్తున్నాయి. దీని ఫలితంగా పలు ప్రాంతాల్లో నీటి సరఫరా ప్రభావితమవుతోంది. ప్రభావిత ప్రాంతాలు ఆర్.సి. పురం, బీహెచ్‌ఈఎల్, చందానగర్, మియాపూర్ నగర్, కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, ఎస్.ఆర్. నగర్, సనత్‌నగర్ పరిసర ప్రాంతాలలో నీటి సరఫరా షెడ్యూల్లు, లో ప్రెషర్ తో నీటి సరఫరా, కొన్నిసార్లు తాత్కాలిక కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. జలమండలి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రభావిత ప్రాంతాలకు నీటి సరఫరాను పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది. అదే సమయంలో, ఇతర ప్రాంతాల్లో సాధారణ నీటి సరఫరా కొనసాగేందుకు కూడా చర్యలు చేపడుతోంది.

# ఇద్దరు చైన్ స్నాచర్ల రిమాండ్

- వివరాలు వెల్లడించిన మేడ్చల్ డివిజన్ ఏసిపి సిహెచ్.శంకర్ రెడ్డి



**శామీర్‌పేట, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** మజీద్ పూర్ బస్ స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న ఓ మహిళ మెడలోంచి నల్లపూసల (రోల్డ్ గోల్డ్) గొలుసు దొంగిలించిన చైన్ స్నాచర్ల ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సోమవారం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్లో మేడ్చల్ డివిజన్ ఏసిపి సిహెచ్.శంకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని సైనిక్ స్కూల్లో ఆయాగా పనిచేస్తున్న ఇల్లా నాగలక్ష్మి ఈనెల 17న ఉదయం 6:30 గంటలకు అలియా బాద్ మున్సిపాలిటీ మజీద్ పూర్ చౌరస్తా బస్ స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉంది. అదే సమయంలో మేడ్చల్ పట్టణానికి చెందిన షేక్ సగీర్ అహ్మద్ (55), విభూది సాయి కృష్ణ (19) ఇద్దరు కలిసి స్కూటర్ పై వేగంగా వచ్చి ఆమె వద్ద ఆపారు. స్కూటర్ పై వెనక కూర్చున్న వ్యక్తి దిగి ఆమె మెడలో ఉన్న గొలుసు లాక్కొని స్కూటర్ ఎక్కి అక్కడి నుండి పారిపోయారు. తర్వాత చైన్ స్నాచ్చరు ఆ గొలుసును తాకట్టు పెట్టి డబ్బు పొందాలని భావించి మేడ్చల్ లోని కరూర్ వైశ్యా బ్యాంక్ వెళ్లి చూపించగా అది రోల్డ్ గోల్డ్ చైన్ అని తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుత్బుల్లాపూర్ జోన్ డిసిపి ఎన్. కోటిరెడ్డి, మేడ్చల్ డివిజన్ ఏసిపి సిహెచ్.శంకర్ రెడ్డి ఆదేశానుసారం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి.గురువయ్య, సిసిఎస్ కుత్బుల్లాపూర్ జోన్ ఇన్స్పెక్టర్ పి.నాయుడు, మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి.కిరణ్, కుత్బుల్లాపూర్ జోన్ ఎస్.ఓ.టి ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ రెడ్డి వారి వారి సిబ్బంది సమన్వయంతో కృషిచేసి ఇద్దరు దోపిడీ నేరస్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రోల్డ్ గోల్డ్ చైన్, యమహా ఫాసైనో (టిజీ 08 ఏజె 6197) స్కూటర్, రెండు సెల్ ఫోన్లు, ఒక కత్తి స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు. ఈ కేసును చేదించడంలో పోలీసులు సమన్వయంతో నిందితులను పట్టుకోవడంలో కృషి చేశారు. ఈ కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బందికి తగిన విధంగా పురస్కారం అందించ బడుతుందని ఆయన తెలిపారు.

## 330 క్వింటాళ్ల పిడిఎఫ్ బియ్యం పట్టివేత



**తూప్రాన్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** తూప్రాన్ టోల్గేట్ వద్ద అనుమానాస్పదంగా సర్కిల్ నిర్వహిస్తుండగా330 క్వింటల్లా పిడిఎఫ్ బియ్యం లారీని పట్టుకున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు తూప్రాన్ టోల్గేట్ వద్ద తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళుతున్న లారీని తనిఖీ చేయగా అనుమానాస్పదంగా లారీని తనిఖీ చేయడంతో3 30 కింటల బియ్యము గుర్తించినట్లు చెప్పారు ఈ బియ్యము హైదరాబాద్ నుంచి గుజరాత్ వెళ్తున్నట్లు డ్రైవర్ రాజు వాహన యజమాని రతన్ వై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# మొక్కజొన్న, పప్పు, శనగ చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

**చిన్నంబావి, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** రైతులు పండించిన మొక్కజొన్న, పప్పు శనగ పంటను కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్న పంటను రైతులు నెల రోజులు గా కల్లాలలోనే ఆరబెట్టుకుంటున్న కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండించిన మొక్కజొన్న పంటను, పప్పు శనగలు ఎకరానికి కొన్ని క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తాం అనే ఆంక్షలు లేకుండా రైతు పండించిన ప్రతి గింజను ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనాలి. చిన్నంబావి మండలంలో రైతులు పండించిన మొక్కజొన్న, పప్పు శనగ ధాన్యాన్ని నెల రోజులు దాటుతున్న కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి. సొంత మండల మంత్రికి రైతుల గోస రైతుల కన్నీరు రైతుల బాధలు కనిపిస్తలేవా 20 ఏళ్లు అధికారంలో ఉండి కూడా చిన్నంబావి మండల రైతులకు శాశ్వతమైన పంట ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. రైతు పండించిన ధాన్యాన్ని ఇతర జిల్లాలకు ఇతర మండలాలకు తీసుకెళ్లి అమ్ముకునే దౌర్భాగ్య స్థితిలో చిన్నంబావి మండల రైతు ఉన్నారు అంటే ఈ పాపం ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది సొంత మండల మంత్రి జూపల్లి కృష్ణారావుది సుమారుగా చిన్నంబావి మండల రైతు పదివేల శనగపప్పు ధాన్యాన్ని పండిస్తే కేవలం 3500 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి అది ఒక్క కొప్పునూరు గ్రామంలోనే కొనుగోలు చేసి తమ అసమర్థ పాలనను చూపిస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో రైతులు గుణపాఠం చెప్పాలి. మరి మిగతా గ్రామాల పప్పు శనగ పంటను ఎవరు కొనుగోలు చేయాలి దీనికి సమాధానం చెప్పాలి స్థానిక మంత్రి చిన్నంబావి మండల రైతుల మీద ఎందుకంత ఈర్ష రైతులను హరిగోస పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు రైతుల పక్షాన భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు కార్యకర్తలు నిలబడి పోరాటం చేస్తారు. గతంలో ఇదే చిన్నంబావి రైతులు స్థానిక మంత్రిని సాగునీటి కోసం తరిమేసిన రోజులు గుర్తుకు తెచ్చుకోవాలని, రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే మళ్లీ అదే గతి స్థానిక మంత్రికి తప్పదు. తెలంగాణ ప్రజలకు తెలంగాణ రైతంగానికి మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు భారత రాష్ట్ర సమితి ప్రజల తరపున రైతుల తరపున పోరాటం చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో చిన్నంబావి మండల భారత రాష్ట్ర సమితి మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, పెద్దమారు గ్రామ మాజీ సర్పంచ్, ఉమ్మడి మండలాల ఇంచార్జ్ గోవింద్ శ్రీధర్ రెడ్డి, చిన్నంబావి మండలం మాజీ సర్పంచ్ పసుపుల రంజిత్ కుమార్, ఈదన్న యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, తాజా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
21 ఏప్రిల్ 2026

# రోగులకు నాణ్యమైన చికిత్స అందించడమే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలి
- రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** రోగులకు నాణ్యమైన చికిత్స అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు పేర్కొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు సోమవారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ లతో సమావేశమై ఆయా విభాగాల పనితీరు, రోగులకు అందుతున్న సేవల నాణ్యత, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు, తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంచడం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి వైద్యుడు బాధ్యతతో, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. రోగులకు



సమయానికి నాణ్యమైన చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పేషెంట్‌కు సంబంధించిన వివరాలు అవుట్‌పేషెంట్, ఇన్ పేషంట్ ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులు, ఫార్మసీ వివరాలు తదితర అన్ని సమాచారం తప్పనిసరిగా హెల్త్ ప్రొఫైల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా రోగి ఎక్కడైనా చికిత్స పొందినప్పటికీ పూర్తి ఆరోగ్య చరిత్ర అందుబాటులో ఉండి, సరైన వైద్య సేవలు అందించడానికి సులభతరం అవుతుందని తెలిపారు. సైకియాట్రిక్, జెరియాట్రిక్, అడిక్షన్ మరియు ట్రాన్స్ జెండర్ రోగులకు ప్రత్యేక కౌన్సిలింగ్ సేవలు అందించాల్సిందిగా సూచించారు. ఇందుకోసం సామాజిక సోషల్ వర్కర్, కౌన్సిలర్ ను ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు చేపట్టాలన్నారు.

క్యాన్సర్ డే కేర్ సెంటర్ లో క్యాన్సర్ పేషెంట్లకు తగిన వైద్య చికిత్సలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవుట్‌పేషెంట్ సేవలు (ఓపిఎస్) అన్ని ఒకే చోట సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేయడానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఎంఎస్ ఐ డి సీ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ చికిత్స విభాగం, అడిక్షన్ ట్రీట్మెంట్ సెంటర్, జీరియాట్రిక్ విభాగాలను,క్రిటికల్ కేర్,ఫార్మసి, అవుట్‌పేషెంట్ సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వసంత్ కుమార్, డా. అనిల్ కుమార్, వివిధ విభాగాల హెచ్ ఓ డీలు, టీజీ ఆన్‌లైన్ బృందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశిం చారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి సమావేశ మంది రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 28 మంది ఫిర్యాదు దారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ అదనపు కలెక్టర్ కు సమర్పించారు. ప్రజల ఫిర్యాదులను సమ స్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారా నికి సంబంధిత అధికారుల ను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి అదనపు కలెక్టర్ రెవె న్యూ శ్రీను వివిధ శాఖల జిల్లా అధికారులు తదిత రులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం దుకాణాలపై ఎక్సైజ్ శాఖ దాడులు



**మక్తల్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** మక్తల్ మండలంలోని కర్ని గ్రామంలో అక్రమంగా మద్యం దుకాణాలు, ధాబాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్.ఐ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై, అక్రమంగా మద్యం విక్రయాలు చేయరాదని, అనుమతి లేకుండా ధాబాలు నిర్వహించరాదని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగా ఈ తరహా ఫిర్యాదులు చేస్తున్నాడని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈసందర్భగా మద్యం వలన కలిగే దుష్పరినామాలా గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శిరీష, కానిస్టేబుల్ మహేష్ బాబు, నవీన్, గులాం దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** బాధితుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీకి, జిల్లా నలుమూలల నుండి సుదూర ప్రాంతాల వారు నేరుగా ఫిర్యాదులను సమర్పించి వారి సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను తెలియజేసిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి ఫిర్యాదుల పట్ల వారి సమస్యల పట్ల వెంటనే సిబ్బందిని కేటాయించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారము వచ్చిన పిర్యాదులలో పొలానికి సంబంధించి-7, గొడవలకు సంబంధించి-1, ప్లాట్ ఇష్యూస్ సంబంధించి-3, ఇతర విషయాలకు సంబంధించి - 3, మొత్తం 14 ఫిర్యాదులు అందాయి అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా



ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల, శాంతినగర్, అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టి. శ్రీను, శంకర్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- వనపర్తి డిఎస్పి



**పెబ్బేరు, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, తద్వారా సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన 'ఫేర్వెల్ పార్టీ' (వీడ్కోలు వేడుక)కు డి.ఎస్.పి వెంకటేశ్వర్లుతో పాటు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వంటిదని, సాంకేతిక విద్యలో రాణించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. నేటి పోటీ ప్రపంచంలో నిరంతరం అప్డేట్ అవుతూ, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని విద్యా సంస్థల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యార్థం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, జయచంద్ర, స్థానిక ఎస్సై దివ్య రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థినిని సన్మానించిన వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



**రేవల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** 2026వ సంవత్సరంలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం(ఎంపీసీ) చదుతున్నటువంటి గోపాలపేట గ్రామానికి చెందిన మదారు జానకిరాముడు కుమార్తె మదారు పల్లవి 991 మార్కులు సాధించి వనపర్తి జిల్లాలో రెండవ స్థానంలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల యాజమాన్యం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విద్యార్థినికి అభినందనలు తెలిపి సన్మానం చేసి ఇంకా ఎన్నో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు.

# పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం కావాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటివరకు మొత్తం 73.52 శాతం పూర్తయిందని, పట్టణ ప్రాంతాల్లో వేగవంతం కావాల్సి ఉందని అదనపు కలెక్టరు లక్ష్మీనారాయణ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సోమవారం హైదరాబాదు నుంచి ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా జరిగిందని, తెలంగాణలోనూ వేగవంతం చేయాల్సి ఉందన్నారు. ఈఆర్ఓ లు, ఏఈఆర్వోలు మ్యాపింగ్ ప్రక్రియ విషయంలో సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు, సూపర్వైజర్లకు దిశా నిర్దేశం చేస్తూ ఉండాలన్నారు. బూత్ స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకానికి సంబంధించి ఇప్పటికే పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినందున వారి సహకారం



తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పరిధిలోని బిఎల్ఓ లతో స్వయంగా మ్యాపింగ్ చేయించుకునేందుకు ఆసక్తి చూపితే మిగిలిన వారి మ్యాపింగ్ చేసేందుకు సులభతరమవుతుందన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ వీసీ లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించాలి



**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ప్రజావాణి లో వచ్చిన ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించడంపై ఆయా అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అర్జీదారుల నుండి అడిషనల్ కలెక్టర్ పాండు సబ్ కలెక్టర్ ఉమా హారతి తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా అధికారులకు అందజేసి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పై ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 31 పిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,
ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

**పెబ్బేరు, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** పెబ్బేరు పట్టణంలో ఏడాది కాలంగా ఆగిన రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని, విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పెబ్బేరు సుభాష్ కూడలి వద్ద నిరహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వనపర్తి వెళ్లే దారిలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూ లేదా ప్లాటు కేటాయించి రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. వనపర్తి వెళ్లే రోడ్డులో అసంపూర్తిగా ఉన్న రహదారి విస్తరణ పనులు వెంటనే షురూ చేయాలని, ముందుగా డ్రైనేజీ నిర్మింఇ రోడ్డు వేయాలని చెప్పారు. అదేవిధంగా రోడ్డుకు రెండు వైపులా 40 ఫీట్ల వేర రహదారి నిర్మాణం చేపట్టాలని ఎక్కడా కూడా ఎక్కువ, తక్కువలు లేకుండా చూడాలని కోరారు. అంతేకాకుండా పెబ్బేరు సుభాష్ చౌక్, అంబేద్కర్ చౌక్ల వద్ద మహిళలకు, పురుషులకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ప్రధానంగా డిమాండు చేశారు. తమ డిమాండ్లు నెరవేరేంత వరకు రోజూ దీక్షలు కొనసాగుతామని వారు చెప్పారు. దీక్షకు ఎంఐఎం మండల అధ్యక్షుడు ఆఫ్రోజ్, బీఎస్పీ నేత ఏబీజే సత్యం సాగర్, సీపీఐ నేత పెద్ద ఖాజా, బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్, మద్దతు తెలిపారు. కార్యక్రమంలోవి.




శ్రీధర్ రెడ్డి జీ, వెంకటేష్, హన్మంతు రెడ్డి, శ్యామ్లాల్, చాకలి రాముడు, సీతమ్మ, నరేందర్ జీ, మోహన్లాల్, నర్సింహ గౌడ్, శ్రీనాథ్, రఫీ, తదితరులు దీక్షలో కూర్చున్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా బసవేశ్వర జయంతి




సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) : మహాత్మ బసవేశ్వర జయంతి సందర్భంగా టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డిలోని బసవేశ్వర విగ్రహాలకు పూల మాలలు సమర్పించారు. మొదట సంగారెడ్డి పట్టణంలోని ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో ఉన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు., ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.్తరువాత బైపాస్ రోడ్డులోని బసవేశ్వర విగ్రహానికి ఆమె పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా లింగాయత్ సమాజ్ ఆధ్వర్యం లో నిర్మలా జగ్గారెడ్డి ని , మున్సిపల్ చైర్మన్ , కౌన్సిలర్ ల ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాయకమే కైలాసం అని మహాత్మా బసవేశ్వరుడు శ్రమ యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పాడన్నారు. సామాజిక సంస్కరణ కోసం, సామాజిక అసమానతలు, కుల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్తగా బసవేశ్వరుడి పాత్రను నిర్మల జగ్గారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, నాయకుడు కూన సంతోష్, కౌన్సిలర్లు వంశీ, సతీష్ రెడ్డి, హరిష్, లింగాయత్ సమాజ్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

**నంగునూర్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వెంకటాపూర్, ముండ్రాయి, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, ఖానాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఏఎంసి డైరెక్టర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. తమ రైతులు కష్టార్జిత పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి, క్వింటాల్‌కు రూ.2,389



మద్దతు ధర పొందాలని కోరారు. రైతుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. రైతులు ధాన్యం విక్రయించిన అనంతరం 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశారనీ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ధాన్యం విక్రయానికి తీసుకొచ్చే రైతులు తేమ శాతం 14లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాలు, తేమ శాతం వంటి సాంకేతిక సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే కొనుగోలు ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని వివరించారు. ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రేకులపల్లి సంతోష్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు ఏఓ గీత, మాజీ జడ్పీటీసీ దువ్వల మల్లయ్య, మాజీ పిఎస్సి చైర్మన్ ఎల్లంకి మైపాల్ రెడ్డి, సర్పంచులు చేర్యాల రాజు, చారగొండ మానస - ప్రభాకర్ రెడ్డి, బల్దా మల్లేశం, చామంతి- వెంకట్ ఏఎంసీ డైరెక్టర్లు ఎండి ఇమ్రాన్, కొమ్మరాజుల ఐలయ్య, పిడిశెట్టి ప్రభాకర్,గొట్టం రంగారెడ్డి, ,గణపురం రమేష్, ఉపసర్పంచ్ కలకుంట్ల యాదగిరి, మాజీ సర్పంచులు మాజీ, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులే రేపటి దేశానికి భవిష్యత్తు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఆదర్శలో వైభవంగా 36వ వార్షికోత్సవ వేడుకలు



**కాటారం, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన 36వ వార్షికోత్సవ, గ్రాడ్యుయేషన్ ఫెస్ట్, కల్చరల్ కార్నివాల్ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. 36 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలో ఆదర్శ విద్యా సంస్థ అందిస్తున్న సేవలను అభినందించి, పలువురు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బాల్యంలోనే మంచి విద్య, విలువలు అలవాటు పడితే పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పాఠశాలలు, తల్లిదండ్రులు కలిసి కృషి చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక పరిజ్ఞానం అందించాలన్నారు. కాటారంలో ప్రభుత్వ విద్యాలయాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు దబ్బెట రాజేష్, పసుల మొగిలి, కొట్టే శ్రీహరి, కొట్టే ప్రభాకర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అభివృద్ధి పనుల శ్రీకారం

- 1.50 కోట్లతో అభివృద్ధి పనులు..
- అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** హన్మకొండ నగరంలోని హసన్‌పర్తి 66వ డివిజన్ పరిధిలో గల పెద్ద చెరువు మూల మలుపు వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. సుమారు రూ.1.50 కోట్ల నిధులతో చేపడుతున్న రోడ్డు వెడల్పు మరియు సెంట్రల్ లైటింగ్ పనులను నేడు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మరియు హనుమకొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరంగల్ కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత కొంత కాలంగా ఈ మలుపు వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల అనేక ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లింది. దీనిని దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం కోసం రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నట్లు నేతలు తెలిపారు. రాత్రి వేళల్లో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా అధునాతన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ నగరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజక వర్గంలోని ప్రతి సమస్యనూ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు., సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బసవేశ్వరుడు అందరికీ ఆదర్శం

- కలెక్టరేట్లో ఘనంగా మహాత్మా బసవ జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 20(జనంసాక్షి) :** సామాజిక న్యాయం నైతిక విలువలు అమలు పరచడంలో బసవేశ్వరుడు అందరికీ ఆదర్శమని ఆయన నేటి తరానికి ఆదర్శమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా బసవ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వారి చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా బసవ గారి జీవితం, సూత్రాలు సమాజానికి మార్గ దర్శకమని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, నైతిక విలువలను ప్రోత్సహించిన ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్మా బసవ గారి ఆదర్శాలను ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత ఆయన సందేశాలను గ్రహించి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, జెడ్పి సీఈఓ రాంరెడ్డి, మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# బాలయేసు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- ఉపాధ్యాయ సంఘాల నిరసన

**పాలకుర్తి, ఏప్రిల్ 20(జనంసాక్షి)** దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాల కరస్పాడెంట్ జేసురాజు, ఎంఈవో కళావతి పట్ల దురుసుగా ప్రవర్తించిన తీరును ఖండిస్తూ. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ ఈ నెల 19న ఆదివారం పాఠశాలకు సెలవు ప్రకటించకుండా పాఠశాలను నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలుసుకొని తనిఖీకి వెళ్లిన ఎంఈవో డాక్టర్ కళావతి పట్ల ఆ పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు ప్రవర్తించిన తీరును వ్యతిరేకిస్తూ భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. జేసురాజుపై జిల్లా కలెక్టర్, డీఈవో తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి. శరీప్, సూర్యప్రకాష్, టీపీటీఎఫ్ ఇమ్మడి అశోక్, పి ఆర్ టి యు బాధ్యులు శ్రీనివాస్. టీఆర్టిఎఫ్ బాధ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

- ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనుల పరిశీలన
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ఏప్రిల్ 20, (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. వంటశాల, సామాగ్రి నిల్వ గదిని పరిశీలించి ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో అనుత్తీర్ణులైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆదర్శ పాఠశాలల వసతి గృహాన్ని సందర్శించి కొనసాగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మక్కలు, ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

- పాలకుర్తిలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో
- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం
- బీజేపీ రాష్ట్ర నాయకుడు రామ్మోహన్ రెడ్డి



**పాలకుర్తి, ఏప్రిల్ 20(జనంసాక్షి) :** పాలకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చిన మక్కలు పదిహేను రోజుల నుంచి కొనుగోళు లేక. రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించడంతో సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో భారతీయ జనతాపార్టీ అధ్వర్యంలో రైతులు పెద్దఎత్తున రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. సుమారు గంట పాటు పాలకుర్తి, స్టేషన్ఘన్పూర్, పాలకుర్తి, మొండ్రాయి, పాలకుర్తి, నాంచారిమదూరు, పాలకుర్తి, జనగాం రూట్లలో రహదారిలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపో యాయి. ఎండను సైతం లెక్క చేయకుండానే చౌరస్తాలో రైతులు, బీజేపీ నాయకులు బైటాయిం చారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడు తూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింద న్నారు. స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఈ నెల 6న పాలకుర్తిలో చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్లో మొక్కజొ న్నల కొనుగోల్లు కేంద్రాన్ని ప్రారంబించారని తెలిపారు. ఒక్కో రైతు ప్రారంభించిన రోజు తీసుకు వచ్చిన మొక్కజొన్నలు ఇంత వరకు కోనుగోళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు. కనీసం రైతులకు గన్ని బ్యాగులు ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వ్యవసాయం పట్ల అవగాహన లేకపోవడంతో కొనుగోళ్లపై ఏ మాత్రం పట్టింపులేదని ధ్వజమెత్తారు. మొక్కజొన్నలు కొనుగోళ్లు అయ్యేంత వరకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉందని, అనుకోకుండా వర్షం కురిస్తే రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారవుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు పేరుతో రైతులను గాలికి వదిలేశారని ఘాటుగా విమరించారు. మార్కెట్ లో పోసిన మొక్క జొన్నలు, గ్రామాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని, లేకుంటే రెండు రోజుల తర్వాత జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు దుంపల సంపత్, నిరంజన్ రెడ్డి. బాగాల నవీన్ రెడ్డి. గడ్డం నరేందర్, పులిగిల్ల ఉపేందర్, పైండ్ల రాజేష్, నవీన్, గణేష్, నూకల నవీన్, చిక్కుడు అశోక్, వంశీ, సాయి ముఖేష్, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

- పాఠశాలలు, వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- గిరివాణి, ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్,ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టిఎస్



**ఏటూరునాగారం, ఏప్రిల్ 20(జనంసాక్షి) :** విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలు, వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గిరివాణి, ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో ప్రజావాణి – గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను స్వయంగా కలెక్టర్‌కు అందించారు. జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమానికి 96, ప్రజావాణి కార్యక్రమానికి 26, మొత్తం 122 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పాఠశాలలు, వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం వాటిని పర్యవేక్షించి, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను రూపొందించాలని సూచించారు. వంటశాల, స్టోర్ రూమ్, క్యాంపస్ పరిసరాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి లాంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను వెంటనే అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, ఏపీవో వసంతరావు, ఆర్డీఓ వెంకటేష్, డీడీ జనార్ధన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, ఐటీడీఏ ఏఓ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం భద్రత ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఎస్పీ, కలెక్టర్



**కాటారం, ఏప్రిల్ 20 ( జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తురుపల్లిలో జరిగే భారీ బహిరంగ సభస్థలిని రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పి సిరి శెట్టి సంకీర్త్, ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ పలువురు అధికారులు సభాస్థలిని పరిశీలించారు . సభా ప్రాంగణాన్ని కలియ తిరుగుతూ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సభకు వచ్చే సామాన్య ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులతో వారు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లతో కలిసి కాటారం లో సీఎం సభ ఏర్పాట్లను పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సభ విజయవంతం కావడానికి అవసరమైన వేదిక, ప్రజల కూర్చొనే ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులతో కలిసి సమీక్షించారు. అలాగే వివేక్ వెంకటస్వామి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు లతో కలిసి సభా ప్రాంగణాన్ని సందర్శించారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి భూపాలపల్లి జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ సభ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సభా స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, వేదిక ఏర్పాట్లను వారు సమగ్రంగా పరిశీలించారు. సభ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, స్టేజ్ పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. హెలిప్యాడ్‌ను కూడా పరిశీలించారు. అదనంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల సౌకర్యాలపై అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

# బాసరలో పోటెత్తిన భక్తజనం



**బాసర, ఏప్రిల్ 20(జనం సాక్షి) :** అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని పవిత్ర జ్ఞాన సరస్వతీ క్షేత్రమైన బాసర భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం ఉదయం నుంచే తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి వైదిక బృందం మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అక్షయ తృతీయ సందర్భంగా జ్ఞాన సరస్వతీ అమ్మవారు బంగారు లక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆ రూపంలో దర్శించుకోవడం మహద్భాగ్యంగా భావించి భక్తులు పులకించిపోయారు.

### అక్షరాభ్యాసాలతో మార్మోగిన ఆలయం...

అక్షయ తృతీయ రోజున అక్షరాభ్యాసం చేయిస్తే విద్యాభివృద్ధి కలుగుతుందనే నమ్మకంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను పెద్ద సంఖ్యలో తీసుకువచ్చారు. అమ్మవారి సన్నిధిలో వేద పండితుల ఆశీర్వచనాలతో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా చిన్నారుల ' సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా 'అనే పలుకులతో, వేద మంత్రాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దీంతో ఆలయానికి భారీగా ఆదాయం వచ్చి ఉంటుందని హనికులు ఆశాభావ వ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు.



# అంతర్నిలో అగ్నిప్రమాదం

- చేతికొచ్చిన మొక్కజొన్న పంట దగ్ధం

**కుబీర్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కుబీర్ మండలం అంతర్నిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన రైతు భోజన్న తనకున్న భూమిలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. పంట కోతకు వచ్చి, చేతికి అందుతుందన్న తరుణంలో ఒక్కసారిగా అగ్నిప్రమాదం జరగడంతో ఆశలన్నీ అగ్నిపాలయ్యాయి. పొలంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు, రైతులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వేగంగా వీచిన గాలుల వల్ల మంటలు క్షణాల్లో వ్యాపించి, సుమారు 1:00 ఎకరం మేర ఉన్న మొక్కజొన్న పంట కాలి బూడిదైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే బూడిద కావడంతో బాధిత రైతు భోజన్న కన్నీరుమున్నీరయ్యాడు. ప్రమాద సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నరేష్ సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ అగ్నిప్రమాదం వల్ల సుమారు ?75,000 వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆయన ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నారు.

# దొంగిలించిన ఆటోతో దొరికిపోయిన దొంగ..

- రిమాండ్‌కు తరలింపు



**కుబీర్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** కుబీర్ మండల కేంద్రంలో ఇటీవల చోటుచేసుకున్న ఆటో దొంగతనం కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కుబీర్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దనగరి గల్లీకి చెందిన ఆటో డ్రైవర్ పుప్పాల దత్తాత్రి తన ఆటోను ూ16ఖూ 2615 ఈ నెల 17న రాత్రి ఇంటి ముందు పార్క్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు దానిని దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డోదర్న గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, దొంగిలించిన ఆటోతో వెళు న్న నిందితుడు పట్టుబడ్డాడని ఎస్సై వివరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, సుమారు రూ. 80,000 విలువైన ఆటోను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు.

# రామాలయం గుడి నిర్మాణానికి భూమిపూజ



**ములుగు/వెంకటాపూర్,ఏప్రిల్20(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలో రామాలయం గుడి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క గ్రామంలో నిర్మిస్తున్న రామాలయం గుడి నిర్మాణానికి ప్రభుత్వం నుండి సహకరిస్తామన్నారు.

## సంక్షేమ వసతి గృహాల పరిశీలన



**నూతనకల్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని సంక్షేమ వసతి గృహాలు, విద్యాలయాలను సోమవారం మండల అధికారులు ఎంపీడీవో సునీత, తహసీల్దార్ శ్రీనివాసరావు తనిఖీ చేసి పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హాస్టల్స్ లో ఏప్రిల్ 20 నుండి 26 వరకు ఏడు రోజులు సంక్షేమ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు మొదటిరోజు సంక్షేమ వసతి గృహాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు టాయిలెట్స్ శుద్ధి చేయడం వసతి గృహాలను నీటితో శుద్ధి చేశారు హాస్టల్స్ లో ఫుడ్ మెటీరియల్ బియ్యం ఆయిల్ కూరగాయలు వారు పరిశీలించారు మెనూ ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించాలని సంక్షేమ అధికారులకు సూచించారు ఈ వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, బీసీ సంక్షేమ అధికారి అంజయ్య, జ్యోతి, ఎస్సీ సంక్షేమ అధికారి లింగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని,నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్ లకు కూడ అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు.వేసవిలో ప్రజల కొరకు ప్రతి గ్రామపంచాయతీలో బస్ స్టాప్, పబ్లిక్ ప్రాంతాలలో, ఉపాధి హామీ పనులు జరిగే చోట, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు.ఎండ తీవ్రత దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉదయం 11.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనుగోళ్లు నిలిపివేయాలని అన్నారు. తదుపరి 4 గంట నుండి రాత్రి వరకు అవసరమైతే ఫ్లడ్ లైట్లు పెట్టుకొని రాత్రి 10 వరకు కూడ నిర్వహించుకోవచ్చని తెలిపారు.ఉదయం 4 గంటల నుంచి కూడ కొనుగోళ్లు ప్రారంభించుకోవచ్చని



అన్నారు.డిఎంహెచ్ఓ, పీహెచ్ సీల నుండి ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సెలైన్లు అందుబాటులో ఉంచాలని, కలెక్టరేట్ లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎండ నుండి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.కలెక్టరేట్ లో కూడా అవసరమైతే మరికొన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ పరిపాలన అధికారిని ఆదేశించారు.ప్రతి మండలం నుండి తహసిల్దార్ ద్వారా ప్రతి రోజు టెంపరేచర్ రిపోర్ట్ అందించాలని, ఆర్డబ్ల్యూఎస్, డిపిఓ త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని అన్నారు.జనగణన గురించి కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రారంభమగు హౌస్ లిస్టింగ్ లో ప్రతి ఉద్యోగి సొంతంగా వారి యొక్క కుటుంబ వివరాలు 33 ప్రశ్నలకు వివరాలు అందించాలని అన్నారు. ఏన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు, వారికి ఆ నివేదికను అందించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని ప్రతి శాఖ వారి పరిధిలో గల మండల, గ్రామ కార్యాలయాల పరిధిలో గల సిబ్బంది ద్వారా ప్రజలకు జనగణన గురించి అవగాహన కల్పించాలని అన్నారు. సిపిఓ ద్వారా జనగణన అవగాహన ఫ్లెక్సీ బోర్డును ఆవిష్కరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 31, డిఆర్డిఏకు 4, మున్సిపాలిటీకి 3, డిపిఓకి 3, డిఎంహెచ్ఓకు 3, మిగిలిన 17 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, సీఈఓ జడ్పీ శిరీష, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్ఓ డాక్టర్ పి.వెంకటరమణ, హౌసింగ్ పీడీ సిద్దార్థ, సిపిఓ కిషన్, డీఎస్ఓ, డిటిడిఓ శంకర్, ఎస్సీ కార్పొరేషన్ డెవలప్మెంట్ అధికారి దయానందరాణి, డిఐఈఓ బి.సులోచన రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి సూపరింటెండెంట్లు శ్రీలత, సాయి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ లలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ.2400 మద్దతు ధర కల్పిస్తుందని, మార్కెట్ లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో పంటను అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

### బయట నుండి ధాన్యం రాకుండా పటిష్ట భద్రత

ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు ధాన్యం రాకుండా బార్డర్ చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు.పోలీస్, సివిల్ సప్లయ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పని చేస్తూ



బయట నుండి ధాన్యం రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి అందిస్తున్న బోనస్ తెలంగాణ రైతులు పొందేలా బయట నుండి ధాన్యం రాకుండా ఆదేశాలు జారీ చేశామని, ధాన్యం వస్తున్నట్లు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాదాపు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### రైతులకు రూ.5కే నాణ్యమైన భోజనం....

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో రైతుల కోసం రూ.5లకే భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.5కు అన్నపూర్ణ భోజనాన్ని ప్రారంభించి రైతులకు స్వయంగా వడ్డించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దూరం నుండి పంటను అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు మంచి క్వాలిటీ భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సీజన్ సమయంలో భోజనంతో పాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిఫిన్ ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎంఓ నాగేశ్వర శర్మ, డిసిఓ ప్రవీణ్, ఎఎంసి డైరెక్టర్స్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారి కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ



చంద్రుగొండ, ఏప్రిల్ 20 (జనం సాక్షి) : చంద్రుగొండ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారిని నాగలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ అధికారిని తో పాటు స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు లు భోజనశాలను ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం తోపాటు అల్పాహారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ డి జగదీశ్వర ప్రసాద్, ఎంపీడీవో బయ్యారపు అశోక్, ఎంఈఓ సూరయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత లు పాల్గొన్నారు.

## సమాజంలో అంగన్వాడీ టీచర్లది గురుతర బాధ్యత

- **ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**మునుగోడు, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** అంగన్వాడీ టీచర్లు సమాజంలో గురుతర బాధ్యతను నిర్వహిస్తున్నారని పేరుకు వాళ్లు చేసే పోస్ట్ చిన్నదైనా బాధ్యతలు మాత్రం పెద్దవని ఆరు సంవత్సరాలలోపు బాల బాలికలను కన్నతల్లు లాగా కంటికి రెప్పలా చూసుకుంటున్నారని వారికి



ప్రభుత్వం ఎంత చేసిన తక్కువేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా పనిచేస్తున్న 357 మంది అంగన్వాడీ టీచర్లకు సూపర్వైజర్లకు మొబైల్ ఫోన్లను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు.. అలాగే అంగన్వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారులకు యూనిఫార్మ్ ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల పాలనలో ప్రజా సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చించే స్వేచ్ఛ ఎమ్మెల్యేలు ఎంపీలకు ఉండేది కాదని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ చిన్న ప్రజా సమస్యలైనా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చించే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకు ఇతర ప్రజాప్రతినిధులకు ఉందని అన్నారు. అంగన్వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి నేరుగా తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు... అనంతరం అంగన్వాడీ టీచర్లు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్సుని సందర్శించి సొంతంగా తయారుచేసిన పౌష్టికాహార పదార్థాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లావణ్య కుమారి, వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
- **ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు**

**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** బసవేశ్వరుడి ఆశయాలను అనుసరించి సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.సోమవారం జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా శ్రీబసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరై బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడని కొనియాడారు.నేటి సమాజంలో చదువు గొప్పతనాన్ని గుర్తించి ప్రజల్లోకి చదువు తీసుకెళ్లాలన్న ఆలోచనతో పాటల, రచనల ద్వారా చైతన్యం కలిగించారన్నారు.ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజ కమ్యూనిటీ కోసం అవసరమైన భూమిని కేటాయించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, కులాలు, ఉపకులాలు లేవన్న మహాత్మా బసవేశ్వరుని సందేశం ఆచరణీయమని అన్నారు.ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.అనంతరం అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నరసింహ, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షుడు వల్లెం శేఖర్, గౌరవ అధ్యక్షులు వల్లెం ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సంకురిశెట్టి పరమేష్, మహిళా అధ్యక్షురాలు సుర సోమేశ్వరి, సంఘం ఇంచార్జ్ బత్తుల మల్లికార్జున్, శోభ, రాణి, ఉషారాణి, వీరయ్య, సంధ్య, సురేష్, శంకర్, ప్రసాద్,

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- **రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ రాష్టంలో త్వరలో చేపట్టే



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమములో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితాను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ప్రతి ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలని తెలిపారు. గ్రామాలలో సెర్ప్ సిబ్బంది, మున్సిపాలిటీలలో మెప్మా సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని, సెర్ప్, మెప్మా సిబ్బందితో ఓటరు జాబితాపై ప్రత్యేక సమగ్ర సవరణపై విస్తృత ప్రచారం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో మ్యాపింగ్ చేసుకునేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో స్పష్టమైన జాబితా రూపకల్పన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుడు చేసిన సేవలు మరువలేనివి

**హయత్‌నగర్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** సమాజంలో కులవ్యవస్థ,వర్ణవివక్ష,లింగ వివక్షలను గట్టిగా వ్యతిరేకించిన అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడు అని ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కొనియాడారు. వనస్థలిపురం లోని సంపూర్ణ డబల్ బెడ్ రూమ్ వద్ద వనస్థలిపురం వీరశైవ లింగయత్ సమాజం అధ్యక్షులు దీపావళి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారి 893వ జయంతి ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి బసవేశ్వరుడు విగ్రహానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ



వారు 1134 సంవత్సరంలో కర్ణాటక రాష్ట్రంలోని బాగేవాడిలో మాదిరాజు, మాదలంబిక దంపతులకు బసవేశ్వరుడు జన్మించారని తెలిపారు. వేద పండితుల కుటుంబంలో జన్మించిన ఆయన, కళ్యాణ రాజధానిలో ప్రధానమంత్రిగా పనిచేసి సమాజ సేవలో విశేష పాత్ర పోషించారని చెప్పారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బసవేశ్వరుడు చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, అంటరాని తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. వీరశైవ ధర్మాన్ని ప్రచారం చేసి, మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, ముద్దగొని సతీష్ కుమార్ గౌడ్, కిరణ్, నాయకులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో పారిశుధ్య, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి

- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**టేకులపల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం టేకులపల్లి మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం విధానాన్ని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. వంటగది పరిస్థితులు, వంట తయారీ ప్రక్రియను తనిఖీ చేసి, విద్యార్థులకు అందించే భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వంటకు ఉపయోగించే సరుకుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవా లని సూచించారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ్యం పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించిన కలెక్టర్, అది ఎప్పుడు ఏర్పాటు చేశారో, గత రెండు సంవత్సరాలుగా ఎందుకు వినియోగంలో లేదో సంబంధిత అధికారులను ప్రశ్నించారు. దీనికి అధికారులు పాఠశాలలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా సమస్య ఉండటంతో ప్లాంట్‌ను ఉపయోగించలేక పోతున్నా మని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, తక్షణమే త్రీఫేస్ కరెంట్ సమస్యను పరిష్కరించి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం టేకులపల్లి మండలం నంద్యా తండాలోని ఏకలవ్య పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్,వారికిఅందుతున్న సదుపాయాలు, మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అందుతున్నదా, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి రోజువారీ శుభ్రత నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని , పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచా లని, సంబంధిత సిబ్బంది క్రమం తప్పకుండా శుభ్రత పనులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్,మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారో లేదో తనిఖీ చేసి, నిర్దేశిత మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు వండుతున్న ఆహార పదార్థాలను పరిశీలించి,నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు.స్టోర్ రూమ్‌లో ఉంచిన కూరగాయలను పరిశీలించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తాజా కూరగాయలను మాత్రమే వినియోగించాలని



ఆదేశించారు. కూరగాయలను నేలపై ఉంచడంపై వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే ర్యాక్‌లు ఏర్పాటు చేసి శుభ్రంగా నిల్వ చేయాలని సూచించారు.

విద్యార్థులకు ఎల్లప్పుడూ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు పాఠశాల పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీరామ్, తాసిల్దార్ వీరభద్రం, ప్రిన్సిపల్ రవీంద్ర, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఒడుదొడుకుల అనంతరం ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చల విషయంలో అనిశ్చితి కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో రోజంతా సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78,632.90 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,493.54) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,203.30- 78,942.45 మధ్య కదలాడింది. చివరికి 26.76 పాయింట్ల లాభంతో 78,520.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 11.30 పాయింట్ల నష్టంతో 24,364.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 19 పైసలు క్షీణించి 93.10గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఎస్‌బీఐ, ఏషియన్ పెయింట్స్, ఎన్టీపీసీ, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ లాభపడ్డాయి. బీఈఎల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ చమురు బ్యారెల్ ధర 94.42 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4796 డాలర్ల వద్ద ట్రేడవుతోంది

# పెట్రో మంటలే..

### 2027 వరకు ధరలు ఎక్కువగానే
### అమెరికా ఇంధనశాఖ మంత్రి

ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి **జనంసాక్షి:**లో మరోసారి ఉద్రిక్త వాతావరణం కనిపిస్తోంది. రెండోసారి శాంతి చర్చలపైనా స్పష్టత కనిపించడం లేదు. దాంతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2027 వరకు అమెరికాలో పెట్రోల్ ధరలు ఎక్కువగానే ఉండొచ్చని అంచనా వేశారు. పెట్రోల్ ధర ఒక గ్యాలన్‌కు 3 డాలర్ల పైనే ఉండొచ్చన్నారు "ఒకవేళ ఈ ఏడాది చివర్లో పెట్రోల్ ధర 3 డాలర్ల కంటే తక్కువకు రావొచ్చు. లేకపోతే వచ్చే ఏడాది వరకు తగ్గకపోవచ్చు. వివాదం పరిష్కారమైతేనే ధరలు దిగొస్తాయి" అని క్రిస్‌రైట్ పేర్కొన్నారు. ఈ ధరలపై ట్రంప్ యంత్రాంగంలోని నేతలు ఒక్కొక్కరూ ఒక్కో ప్రకటన చేస్తున్నారు. ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. ఈ ఏడాది వేసవిలో 3 డాలర్లకు తగ్గొచ్చని అంచనా వేశారు. ఆదివారం అమెరికా లో



ఒక గ్యాలన్ పెట్రోల్ ధర సగటున 4.05 డాలర్లుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి ఆ రేటు 3.16 డాలర్లే. సాధారణంగా అమెరికా ముడి చమురు ఎగుమతి చేసే దేశం. అక్కడే పెట్రోల్ ధరలు అధికంగా ఉంటే.. ప్రపంచ వ్యాప్తంగా దిగుమతిపై ఆధారపడిన దేశాల పరిస్థితి మరింత దారుణంగా ఉండే అవకాశం ఉంది.

**భగ్గుమన్న చమురు ధరలు..**

హర్మూజ్ దిగ్బంధనంతో చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు ఆరు శాతం పెరిగి.. 95.89 డాలర్లకు చేరింది. ఫ్యూచర్స్‌లో యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 7 శాతానికి పైగా పెరిగి, 90.13 డాలర్లుగా ఉంది. కాగా.. ఇరాన్ పతాకంతో ప్రయాణిస్తున్న తౌస్కా అనే వాణిజ్య నౌకపై అమెరికా దళాలు కాల్పులు జరిపి, స్వాధీనం చేసుకొనా న్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో చోటుచేసుకొన్న ఈ ఘటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ధ్రువీకరించారు. దీనిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఐఆర్‌జీసీ దళం అమెరికా యుద్ధ నౌకల పైకి డ్రోన్లను ప్రయోగించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ వెల్లడించింది.

## వినియోగదారులకు ఎయిర్‌టెల్ షాక్..

### పాపులర్ ప్రీపెయిడ్ ప్లాన్ ధర పెంపు

**న్యూఢిల్లీ:**ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ వినియోగదారులకు షాకిచ్చింది. 84 రోజుల వ్యాలిడిటీ కలిగిన పాపులర్ ప్రీపెయిడ్ ప్లాన్ ధరను పెంచేసింది రూ.859 ప్రీపెయిడ్ ప్లాన్ ధరను రూ.899కు పెంచింది. వినియోగదారులకు ఎటువంటి ముందస్తు సమాచారం




లేకుండా ఈ ధరలను సవరించింది. దీంతో ఈ ప్లాన్‌ను రెగ్యులర్‌గా రీఛార్జి చేసుకునే వినియోగదారులపై రూ.40 అదనపు భారం పడనుంది. సవరించిన ప్లాన్‌లో ఎటు వంటి అదనపు ప్రయోజనాలు కల్పించకపోవడం గమనార్హం. 84 రోజుల వ్యాలిడిటీ కలిగిన రూ.899 ప్లాన్ కింద రోజుకు 1.5 జీబీ హైస్పీడ్ డేటా, అపరిమిత కాల్స్, 100 ఎస్సెమ్మెస్‌లు, ఎయిర్‌టెల్ ఫ్రీ హలోట్యూన్ బెనిఫిట్స్‌ను అందిస్తోంది. అదే సమయంలో ప్రత్యర్థి కంపెనీ అయిన రిలయన్స్ జియో రూ.899కే 2జీబీ డేటా, 84 రోజుల వ్యాలిడిటీ ప్లాన్‌ను అందిస్తోంది. దీనికితోడు 20జీబీ అదనంగా ఇస్తోంది. మరోవైపు రోజుకు 1.5 జీబీ డేటాతో 77 రోజుల వ్యాలిడిటీ కలిగిన రూ.799 ప్లాన్‌ను కూడా ఎయిర్‌టెల్ తొలగించింది. అయితే, ఇందుకుగల కార ణాలను మాత్రం ఎయిర్‌టెల్ వెల్లడించలేదు. టెలికాం ఆపరేటర్ల వృద్ధిని సూచించే యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ఈ ధరలు పెంచినట్లు తెలుస్తోంది.

## రూ.16,500కే మాతా వైష్ణోదేవి, మథుర, హరిద్వార్, రిషికేశ్ సందర్శన



**న్యూఢిల్లీ:**ఈ వేసవిలో ఏవైనా ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించాలని అనుకుంటున్నారా? అయితే ఈ టూర్ ప్యాకేజీ మీ కోసమే. జమ్మూకశ్మీర్‌లోని మాతా వైష్ణోదేవి ఆలయ సందర్శనతో పాటు మథుర, హరిద్వార్, రిషికేశ్ వంటి క్షేత్రాలను దర్శించుకునేందుకు ఐఆర్‌సీటీసీ ఓ టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. మొత్తం 9 రాత్రులు, 10 పగళ్లు ఈ యాత్ర కొనసాగుతుంది. మే 12న యాత్ర ప్రారంభమవుతుంది. టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాసుల్లో ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకోవచ్చు. టికెట్ ధరలు రూ.16,500 నుంచి ప్రారంభమవుతాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలైన మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి, బాంకే బిహారి ఆలయం, ప్రేమ్ మందిర్, జమ్మూకశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్, రిషికేశ్ ప్రాంతాలను దర్శించుకోవచ్చు. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు సికింద్రాబాద్ నుంచి మే 12న ప్రారంభమవుతుంది. సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట జంక్షన్, పెద్దపల్లి జంక్షన్, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్హార్షా, వార్ధా, నాగ్‌పూర్ మీదుగా రైలు ప్రయాణిస్తుంది. ఆయా రైల్వేస్టేషన్లలో రైలు ఎక్కొచ్చు. యాత్ర అనంతరం ఆయా రైల్వేస్టేషన్లలో యాత్రికులు దిగొచ్చు.

ప్రయాణం ఇలా..

మొదటి రోజు సికింద్రాబాద్ నుంచి మే 12న రాత్రి 8 గంటలకు ఈ టూరిస్టు రైలు బయలుదేరుతుంది. రెండో రోజు ప్రయాణం సాగుతుంది. మూడో రోజు ఉదయం 6 గంటలకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర జంక్షన్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. కేటాయించిన హోటల్ గదుల్లో స్నానాలు పూర్తిచేస్తారు. అనంతరం శ్రీకృష్ణుడి ఆలయాన్ని సందర్శిస్తారు. రాత్రి భోజనం, బస మథురలోనే ఉంటుంది. నాలుగో రోజు మథురలోని హోటల్ చెక్‌అవుట్ చేసి సుమారు 15 కిలోమీటర్లు రోడ్డు మార్గంలో ప్రయాణించి బృందావనానికి చేరుకుంటారు. బాంకే బిహారి ఆలయం, ప్రేమ్ మందిర్‌ను దర్శించుకుంటారు. తర్వాత మథుర జంక్షన్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని జమ్మూకశ్మీర్ బయలుదేరుతారు.

ఐదో రోజు ఉదయం 9 గంటలకు జమ్మూకశ్మీర్‌లోని శ్రీ మాతా వైష్ణోదేవి కత్రా రైల్వేస్టేషన్‌కి చేరుకుంటారు. అనంతరం హోటల్‌లో దిగుతారు. మాతా వైష్ణోదేవి దర్శనానికి వెబ్‌సైట్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 26 కిలోమీటర్లు కాలినడకన ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. లేదంటే సొంత ఖర్చులతో డోలీ, గుర్రాలు, హెలికాప్టర్, బ్యాటరీ కారు వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. యాత్రికులే ఈ ఖర్చులు భరించాలి.ఆరో రోజు రాత్రి 10 గంటలకు మాతా వైష్ణోదేవి కత్రా రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉత్తరాఖండ్‌కు బయలుదేరుతారు. ఏడో రోజు ఉదయం 10 గంటలకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ చేరుకుంటారు. హోటల్‌లో దిగుతారు. స్నానాలు పూర్తయ్యాక మానస దేవి ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం గంగా హారతి ఉంటుంది. హరిద్వార్‌లోనే రాత్రి బస ఉంటుంది. ఎనిమిదో రోజు ఉదయం గంగానదిలో స్నానాలు పూర్తయ్యాక అల్పహారం ముగించుకొని సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రిషికేశ్‌కు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. రామ్ ఝూలా, లక్ష్మణ్ ఝులా వంతెనలు సందర్శిస్తారు. అక్కడితో యాత్ర ముగుస్తుంది. అనంతరం రాత్రి 9 గంటలకు రిషికేశ్ రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. తొమ్మిదో రోజు ప్రయాణం సాగుతుంది. పదో రోజు ఉదయం 10 గంటలకు రైలు సికింద్రాబాద్ చేరుకోవడంతో ఈ యాత్ర ముగుస్తుంది.

ప్యాకేజీ ఛార్జీ వివరాలిలా..

ఎకానమీ (స్లీపర్ క్లాస్) ఒక్కో టికెట్ ధర రూ.16,500 ఉంటుంది. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకైతే రూ.15,400 చెల్లించాలి. వీరు బస చేసే హోటల్‌లో నాన్‌ఏసీ గదులు ఇస్తారు. ఒక్కో గదిలో నలుగురైదుగురు బస చేయాల్సి ఉంటుంది. నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది.స్టాండర్డ్‌లో (3ఏసీ) టికెట్ ధర పెద్దలకు రూ.25,700; 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు రూ.24,300 చెల్లించాలి. రాత్రిపూట బసకు ఏసీ గదులు కేటాయిస్తారు. ఒక్కో గదిలో ఇద్దరూ లేదా ముగ్గురికి బస ఉంటుంది.కంఫర్ట్‌లో (2ఏసీ) టికెట్ ధరను రూ.33,400; 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు రూ.31,800 చెల్లించాలి. బస చేసేందుకు ఏసీ గదులు ఇస్తారు. ఇద్దరూ లేదా ముగ్గురు గదిని షేర్ చేసుకోవాల్సి ఉంటుంది.

ప్యాకేజీలో ఇవీ భాగమే..

ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం (శాకాహారం) అంతా రైల్వే సిబ్బందే చూసుకుంటారు. ప్యాకేజీని బట్టి ప్రయాణానికి ఏసీ వాహనం సమకూరుస్తారు. యాత్రికులకు ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటుంది. అవసరమైన సాయం కోసం ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్లు అందుబాటులో ఉంటారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,42,800 (22 క్యారెట్లు) | ₹ 1,55,780 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,80,000

# ఖాళీ ప్లేట్లు.. పలచటి చపాతీలు

### అమెరికా సైనికులకు ఆహార కొరత..?



పలచటి చపాతీలు.. ఉడి**వాషింగ్టన్:**కించిన కొన్ని క్యారెట్ ముక్కలు.. ఓ పక్కన కొంచెం మాంసం.. ఈ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమెరికా సైనికులకు ఈ చాలీచాలని ఆహారమే అందు బాటులో ఉందట కొన్ని వారాలుగా పశ్చిమాసియాలో విధుల్లో ఉన్నవారు ఆహార కొరతను ఎదుర్కొంటున్నా రా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..ఇరాన్‌తో యుద్ధం ప్రారం భమైన దగ్గరినుంచి వేలమంది సైనికులను అమెరికా పశ్చిమాసియాకు పంపింది. అలాగే యూఎస్ఎస్ ట్రిపోలీ, యూఎస్ఎస్ అబ్రహాం లింకన్.. హర్మూజ్ దిగ్బంధనంలో పాల్గొంటున్నాయి. కొన్ని వారాలుగా యుద్ధ నౌకలు, విమాన వాహక నౌకల్లో విధులు నిర్వర్తి స్తున్నారు. వారికి వడ్డిస్తోన్న ఆహారం ఫొటోలను తమ కుటుంబసభ్యులకు షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. అలాగే మిలిటరీ జిప్‌కోడ్స్ (విదేశాల్లోని సైనిక, దౌత్య కార్యాలయాలకు పంపే పోస్టులు)కు పోస్టల్ సేవలను నిలిపివేయడంతో పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. దీంతో యూఎస్‌లోని కుటుంబాలు విధుల్లో తమ వారికి ఆహారం, ఇతర ఉత్పత్తులు పంపించేందుకు వీలు లేకుండా పోయింది. ఇక, యూఎస్ఎస్ ట్రిపోలిలో ఉన్న ఆహారాన్ని రేషన్ పద్ధతిలో వాడుకోవాల్సి వస్తోందని తెలుస్తోంది. తాజా సరకులు అనేవే లేవని ఒక మెరైనర్ తన తండ్రికి వెల్లడించారు. తన బిడ్డ కోసం షాంపూ, టూత్‌పేస్ట్, కొన్ని స్నాక్స్ పంపానని చెప్పారు. అయితే అవి ఇంతవరకు చేరలేదు. "వీలైనప్పుడు తింటున్నాం. ఎవరికైనా ఎక్కువ ఆహారం అందితే దానిని ఇతరులతో పంచుకుంటున్నాం. సరకులు చాలా తక్కువగా ఉన్నాయి" అని ఒక సెయిలర్ తన తల్లితో చెప్పి వాపోయారు. అతడికి వారి కుటుంబం ఆహారాన్ని పంపినా అది గమ్యస్థానానికి చేరలేదు. యుద్ధం వల్ల గగనతల మూసివేతలు, రవాణా సమస్యల కారణంగా ఏప్రిల్ నుంచి డెలివరీలు నిలిచిపోయాయని యూఎస్ ఆర్మీ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. మార్చి 27న ట్రిపోలి 3,500 మంది మెరైన్లతో ఇరాన్‌కు చేరువగా వెళ్లింది. ఈ ఆహార సమస్య దీనిలో ఉన్న సైనికులకు మాత్రమే పరిమితం కాలేదని ఆ కథనాలు పేర్కొన్నాయి. జనవరి 26నే పశ్చిమాసియా ప్రాంతంలో ఉన్న యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌లోనూ నాణ్యమైన ఆహారం లభించడం లేదని వెల్లడించాయి. నాణ్యత పక్కనపెడితే.. అందులోని వారు ఎప్పుడూ ఆకలితోనే ఉంటున్నారట. ఇదిలాఉంటే.. ఇరాన్ వార్‌లో భాగమైన విమాన వాహక నౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లోని ప్రధాన లాండ్రీ విభాగంలో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. దీంతో పలు కంపార్ట్‌మెంట్లలోని అమెరికా సైనికులు, నావికులు విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఆ నౌకలో విధులు నిర్వర్తిస్తోన్న 4500 సిబ్బంది టాయిలెట్ కష్టాలను ఎదుర్కొన్నట్లు కథనాలు వెలువడ్డాయి. యుద్ధనౌక నిరంతరం కదులుతున్నందున, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల అందులో ఉన్న చాలావరకు మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో వారు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఉద్రికత్తల కారణంగా నెలల పాటు కొనసాగుతోన్న మోహరింపులు ఎప్పటికప్పుడు సైనికులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నట్లు కనిపిస్తోంది.

## కరడుగట్టిన ఐఆర్‌జీసీ నాయకుల చేతుల్లోకి ఇరాన్..?

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో దేశ నాయకత్వ బాధ్యతలు ఐఆర్‌జీసీ లోని అతివాదుల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ సైన్యాన్ని, దౌత్యపరమైన నిర్ణయాలను వారే నియంత్రిస్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఐఆర్‌జీసీ మేజర్ జనరల్ అహ్మద్ వహిద్, అతడి సన్నిహితులు కీలక పదవులను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలో మితవాద నేతలు పాలన నుంచి పక్కకు జరిగారని రాసుకొచ్చింది. హర్మూజ్‌ను అమెరికా దిగ్బంధించిన నేపథ్యంలో వారాంతంలో ఈ మార్పు జరిగిందని తెలుస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వంటి మితవాదులను పక్కనపెట్టిన సూచనలు కనిపిస్తున్నాయని ఆ కథనం పేర్కొంది. శాంతిచర్చల వేళ హర్మూజ్‌ను తెరిచేందుకు అరాగ్చీ అంగీకరించారు. అయితే ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎదుర్కోవడానికి హర్మూజ్‌ను మూసే ఉంచాలని ఐఆర్‌జీసీ భావిస్తోందని వాషింగ్టన్‌లోని ఇనిస్టిట్యూట్ ఫర్ ద స్టడీ ఆఫ్ వార్ అంచనాలు వెల్లడిస్తున్నాయి.



## నికత్ జరీన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసిన నిఖత్ జరీన్‌ను డిజిపి కొనియా డారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.అదేవిధంగా, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, తెహ్రీ లేక్ వేదికగా ఏప్రిల్ 8 నుండి 12 వరకు నిర్వహించిన '25వ ఆల్ ఇండియా పోలీస్ వాటర్ స్పోర్ట్స్ క్లస్టర్ పోటీల్లోనూ తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. రోయింగ్ కాక్స్‌లెస్ పెయిర్ - 500 మీటర్ల విభాగంలో 1వ బెటాలియన్ టీజీఎస్పికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎన్. రామకృష్ణ , సీఏఆర్ సిద్దిపేటకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ జె. రాజు అద్భుత ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. వీరిని డిజిపి అభినందించారు.అభినందన కార్యక్రమాలలో శాంతి భద్రతల అదరపు డిజిపి మహేష్ ఎం భగవత్, స్పోర్ట్స్ ఐజిపి గజరావు భూపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఆర్వి రామారావు, కోచ్ పి. కృష్ణారావు (హెడ్ కానిస్టేబుల్, డీఏఆర్ వనపర్తి) తదితరులు పాల్గొన్నారు.

## మూడేళ్ల చిన్నారిని పీక్కుతిన్న వీధికుక్కలు

సుల్తానాబాద్, 20(జనంసాక్షి): మండలంలోని ఓ ఇటుక బట్టీలో యాజమాన్య నిర్లక్ష్యంతో కనీసం రక్షణ లేక, కనీస సౌకర్యాలకు నోచుకోని ఇటుకబట్టి లో దారుణం చోటుచేసుకుంది. సభ్య సమాజం తలదించుకునే విధంగా మూడు సంవత్సరాల పసి గుడ్డును కుక్కలు ఎత్తుకొని వెళ్లి చంపిన హృద యాన్ని కలిసి వేసే సంఘటన చోటు చేసుకుంది. యాజమాన్య నిర్లక్ష్యంతో జరిగిన ఆ సంఘటనపై విచారణ చేసి యాజమాన్యం పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు మండల ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు మరే ఇటుక బట్టీలలో జరగకుండా జాగ్రత్తలు చేపట్టే విధంగా సంబంధిత అధికారులు ఆదేశాలు జారీచేయాలని కోరారు.

## జపాన్‌లో భూకంపం..

### పలు చోట్ల ఎగిసిన అలలు.. సునామీ హెచ్చరికలు జారీ

టోక్యో: జపాన్ ఉత్తర తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 7.4గా నమోదైంది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో మూడు మీటర్ల (10 అడుగులు) మేర అలలు ఎగసి పడొచ్చని జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూంకంపం సంభవించింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. దీంతో తీర ప్రాంత ప్రజలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎత్తైన ప్రదేశాల్లోనే ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు.భూకంపం అనంతరం ఉత్తర జపాన్ తీర ప్రాంతంలో పలు చోట్ల చిన్న స్థాయిలో సునామీ అలలు ఎగిసిపడ్డాయి. ఇవాటే ప్రిఫెక్చర్‌లోని (రాష్ట్రం) కుజి పోర్ట్ వద్ద 80 సెంటీమీటర్ల ఎత్తులో సునామీ అలలు ఎగిసిపడినట్లు జపాన్ మీడియా వెల్లడించింది. మియాకో పోర్ట్‌లో 40 సెంటిమీటర్లు, మరికొన్ని పోర్టుల వద్ద 20-30 సెంటిమీటర్ల మేర అలలు ఎగిశాయి. ఇవాటే, హ్వొక్కైడో, అమోరి ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియరాలేదు.జపాన్‌లో భూకంపం కారణంగా జారీ చేసిన సునామీ హెచ్చరికల ప్రభావం మన దేశంపై ఉండబోదని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ వెల్లడించింది. సునామీ ఏర్పడిన కేంద్రం నుంచి 300 కిలోమీటర్ల వరకే దాని ప్రభావం ఉంటుందని తెలిపింది. సముద్ర మార్పులను గమనిస్తున్నామని, ఒకవేళ తీవ్రతలో మార్పులు వస్తే ప్రకటన విడుదల చేస్తామని ఇంకాయిస్ పేర్కొంది.

## జమ్మూకాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

### బస్సు బోల్తాపడి 15మంది మృతి

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూ కాశ్మీర్ కాగోర్ట్ సమీపంలోని రామ్‌నగర్-ఉదంపూర్ జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని ఉదంపూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకోగానే జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం కారణంగా బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్ష్యులు వెల్లడించారు. సోమవారం రామ్‌నగర్ నుంచి ఉదంపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద ఘటనపై ఉదంపూర్ జిల్లా ఉన్నతాధికారులతో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ప్రమాదంపై ఆయన ఆరా తీశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర వైద్య సహాయం కోసం ఎయిర్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# అమ్మో.. ట్రంప్

### అతడికి అన్నీ చెప్పకూడదు
### మిలిటరీ ఆపరేషన్‌కు దూరంగా ఉంచిన అధికారులు



**న్యూఢిల్లీ:**టీవల అమెరికా ఎయిర్‌మన్ రెస్క్యూ ఆపరేషన్ విషయంలో అధికారులు గోప్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో దేశాధ్యక్షుడు ట్రంప్‌నకూ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించలేదని అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. ట్రంప్ గతంలో వ్యవహరించిన తీరును దృష్టిలో ఉంచుకొని వారు ఆయనకు పరిమిత సమాచారం మాత్రమే అందుబాటులో ఉంచారట.ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్ ఇరాన్ భూభాగంపై కూలడంతో అమెరికాకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ఒక పైలట్‌ను వెంటనే కాపాడినా.. అదే విమానంలో మరో పైలట్ (వెపన్ ఆఫీసర్) జాడ మాత్రం తెలియలేదు. ఇక ఆ సైనికుడిని కాపాడేందుకు అమెరికా భారీ ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. అమెరికా మిలిటరీ, నేషనల్ సెక్యూరిటీ అధికారులు 24 గంటలపాటు ఈ ఆపరేషన్‌ను నేరుగా పర్యవేక్షించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దాని వివరాలు ఆయనకు ఇచ్చినప్పటికీ.. అసలు అది ఎలా సాగుతోందనే దానిపై ప్రతి విషయాన్ని ఆయనకు క్షుణ్ణంగా తెలియజేయలేదట. ఆ వివరాల ఆధారంగా ట్రంప్ ఏవైనా మాటలు మాట్లాడితే, ఆపరేషన్‌కే ఎసరు తేవచ్చనే ఆందోళనతోనే ఆయనకు పరిమిత సమాచారమే ఇచ్చారట.

**గట్టిగా కేకలు వేసిన ట్రంప్..!**

ఆపరేషన్‌ను పర్యవేక్షించేవారు రెస్క్యూ బృందాలతో మాట్లాడాలి.. ఇరాన్ బలగాల కదలికలను గమనించాలి. పరిస్థితులు చేయిదాటితే ఎలా ఎదుర్కోవాలో అంచనా వేయాలి. మామూలుగా ఈ ప్రక్రియ అంతా జరిగే సిట్యుయేషన్ రూమ్‌లో అధ్యక్షుడి పర్యవేక్షణ ఉంటుంది. అయితే ఇరాన్‌లో విమానం కూలడంతో ఆయన సహాయకులపై గట్టిగా కేకలు వేశారట. ఆ ఘటనపై ఆయన తీవ్ర ఆందోళన చెందారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్ భూభాగంలోకి వెళ్లి, ఆ సైనికుడిని తీసుకురావడం ఎంత క్లిష్టమైందో తెలిసినప్పటికీ.. వెంటనే అతడిని తీసుకురావాలని ఒత్తిడి తీసుకువచ్చారట. ఇది తన రాజకీయ జీవితంలో అతిపెద్ద విపత్తుగా మిగిలిపోతుందేమోనన్న భయం ట్రంప్‌లో కనిపించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన అసహనం ఆపరేషన్ ప్లానింగ్‌నే దెబ్బతీయొచ్చని అధికారులు భావించారట.దాంతో ఆపరేషన్ నిర్వహించే రూమ్‌కు ఆయన్ను కొన్ని గంటల పాటు దూరంగా ఉంచారట. ఫోన్‌లోనే ఆయనకు వివరాలు చెప్పారట. అయితే దానిని పర్యవేక్షించిన వారిలో ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, పెంటగాన్, నిఘా సంస్థల అధికారులు, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ స్టాఫ్ ఉన్నారు. ఇక ఆ రెండో సైనికుడిని కూడా కాపాడినట్లు సమాచారం ఇవ్వగానే ట్రంప్ దూకుడుగా సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. హర్మూజ్ గురించి ఇరాన్‌ను హెచ్చరిస్తూ అభ్యంతరకర భాష వాడిన సంగతి తెలిసిందే.



## రైతును రాజు చేయడమే లక్ష్యం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ముస్తాబాద్ ఏప్రిల్ 20 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండలం నామాపూర్ లో నీటి పారుదల శాఖ భవనాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించిన ప్రభుత్వ విప్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఎస్డీఎఫ్ నిధులు రూ.31 లక్షలతో ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో నిర్మించిన ఉప కార్య నిర్వహక ఇంజనీర్, ఇరిగేషన్ సబ్ డివిజన్ నెంబర్ 4 కార్యాలయ భవనాన్ని సోమవారం ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్ట్ లను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని వివరించారు. జిల్లాలో పారిశుధ్య పనులు, రెసిడెన్షియల్ విద్యార్థులు, ప్రజలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించామని, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, నీటి పదుల శాఖ డి ఈ రవికుమార్, ఎఈ నవీన్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాఘవేందర్, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీవో లచ్చాలు, సర్పంచులు మాదాస్ అనిల్ , మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి , అన మేని చక్రధర్ రెడ్డి, ఒకసారి మార్కెట్ చైర్మన్ తల రాణి నర్సింలు, నామాపూర్ ఉప సర్పంచ్ కమురయ్య , పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి రాజు, వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి);**
సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 218 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి,వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఏఓ కలెక్టరేట్, తహసీల్ ఆఫీస్ బోయినపల్లి, చందుర్తి, గంభీరావుపేట, ఎంపీడీఓ ఇల్లంతకుంట, విద్యాశాఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, డీ, ఈ సెక్షన్ సూపరింటెంట్, జీజీ హెచ్ సిరిసిల్ల, పశు వైద్య సంవర్ధక శాఖ, అటవీ శాఖ, జిల్లా వైద్యాధికారి, మైనార్టీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ అధికారికి ఒకటి చొప్పున వచ్చాయి. ఎంపీడీఓ బోయినపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ఆర్డీఓ సిరిసిల్లకు -2 చొప్పున, చేనేత జౌళి శాఖ, ఎంపీడీఓ చందుర్తి, ఎస్పీ కార్యాలయం, తహసీల్ ఆఫీస్ కోనరావుపేట, జిల్లా పౌర సరఫరాల అధికారి, డీటీసీపీఓ, నీటి పారుదల శాఖకు -3 చొప్పున, తహసీల్ ఆఫీస్ ఇల్లంతకుంట, విద్యుత్ శాఖ, ఎస్డీసీ, తహసీల్ ఆఫీస్ ముస్తాబాద్, తహసీల్ ఆఫీస్ వేములవాడ, వేములవాడ రూరల్, ఎల్లారెడ్డిపేటకు - 4 చొప్పున, ఎంపీడీఓ కోనరావుపేట, తంగళ్ళపల్లి, మున్సిపల్ వేములవాడకు 5 చొప్పున, ఆర్డీఓ వేములవాడకు -6, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, తహసీల్ ఆఫీస్ సిరిసిల్లకు 7 చొప్పున, ఉపాధి కల్పనా శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి 13 చొప్పున, తహసీల్ ఆఫీస్ తంగళ్ళపల్లికి -11, గృహ నిర్మాణ శాఖకు -31, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు -35 వచ్చాయి.ఇట్టి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు : కలెక్టర్

**ముస్తాబాద్ ఏప్రిల్20 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో కొనుగోలు కేంద్రాల ప్రారంభం.రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు అందించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. గూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన టెంట్, నీటి వసతి పరిశీలించి. అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రైతుల సౌకర్యం కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఇతర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 239 కొనుగోలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.వేసవి నేపథ్యంలో రైతుల కోసం టెంట్లు, నీటి వసతి, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ల తలారి రాణి నర్సింలు, స్వరూపారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగం, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, అఫ్జల్ బేగం, తహసీల్దార్లు మహమ్మద్ అబ్దుల్ ఫారుక్, ఎంపీడీఓ లచ్చాలు, గ్రామ సర్పంచ్ తాటి పెల్లి శంకర్, మండల వ్యవసాయ అధికారి అనూష, చిట్లేని శ్రీనివాసరావు, చిట్లిన్ అంజన్ రావు, ఇన్చార్జి ఏపిఎం రాజనర్సు, సీసీలు, వివో ఏలు, కొనుగోలు కేంద్రం నిర్వాకురాలు సడిమెల భాగ్య, మహిళా సంఘాల గ్రూప్ లీడర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక హబ్‌గా కరీంనగర్

### మంత్రి బండి సంజయ్ కీలక ప్రకటన

**● 5.80 కోట్లతో తీగలగుట్టపల్లి, కొత్తపల్లి, రేకుర్తి చెరువులను పర్యాటక ప్రాంతాలుగా సుంధరీకరిస్తాం: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి):**
కరీంనగర్ నగరపాలక సంస్థ ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా సోమవారం రోజు కేంద్ర ప్రభుత్వంకు చెందిన అమృత్ 2.0 పథకంలో 5.82 కోట్ల నిధులతో చెరువుల సుందరీకరణ పనులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. నగరంలోని 2వ డివిజన్ పరిదిలో గల తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువులను సంధర్శించి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి అమృత్ 2.0 పథకంలో 1.21 కోట్ల రూ. నిధులతో తీగలగుట్ట పల్లి మాలకుంట చెరువు, 2.86 కోట్ల రూ. నిధులతో కొత్తపల్లి ఊర చెరువుల సుందరీకరణ పనులను భూమి పూజ చేశారు. అనంతరం తీగలగుట్టపల్లి, కొత్తపల్లి రెండు చెరువులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి పరిశీలించారు. చెరువుల సుందరీకరణ పనుల నాణ్యత, వాటి వేగవంతం పై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెరువుల అభివృద్ధి లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన మ్యాప్, ప్రణాళిక పత్రాలను పరిశీలించి పనులను త్వరగా ప్రారంభం చేసి వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకొని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సంధర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ...
నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచే పర్యటక ప్రాంతాలుగా చెరువులను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. నగరానికి ఆనుకోని ఉన్న మూడు చెరువులను సుంధరీకరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నుండి 5.82 లక్షల నిధులను విడుదల చేశామన్నారు. గతంలో తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువుల వద్ద వినాయక, బతుకమ్మ నిమజ్జనాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వీటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక నిధులను విడుదల చేశామన్నారు. చెరువుల సుంధరీకరణ పనుల్లో ప్రజలకు అవసరమైన ఘాట్స్ నిర్మాణం, చెరువు కట్ట విస్తరణ తో పాటు బలంగా చేయడం, స్టోన్ స్టిచ్చింగ్, సీవరేజ్ వాటర్ కలవకుండా డ్రైనేజీల డైవర్షన్, ప్రొటక్షన్ వాల్, రేలింగ్, చక్కటి లైటింగ్, గ్రీనరీ, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. నగర ప్రజలు కుటుంబ సమేతంగా ఈ ప్రాంతాలకు వచ్చి సేదతీరే విధంగా అన్ని రకలా వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మూడు చెరువులను అభివృద్ధి చేసి కరీంనగర్ నగరాన్ని పర్యటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని అన్నారు. నగర అభివృద్ధి లో పాలకవర్గ సభ్యులంతా కలిసి ముందుకు సాగుతున్నారని కలిసి ఉంటే కరీంనగర్ అభివృద్ధి ని ఎవరు ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యలో రాణించాలి

### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య



**సిరికొండ ఏప్రిల్ 20( జనంసాక్షి):** ప్రతి విద్యార్థి తన జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ధేశించుకుని, ఆ లక్ష్య సాధన కోసం కృషి చేస్తూ విద్యలో రాణించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కమిషనర్ కార్యాలయంలో భారత తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ఉపకార వేతనాలకు ఎంపికైన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు కె. రుగ్వేద, యస్. చైత్ర, వై. సాన్విక, ఆర్. ఐశ్వర్య, ఎం. మేఘన, కె. నిత్యశ్రీ, యన్. కార్తీక, టి. శ్రీనిధి, డి. రిషిక, యస్. శ్రీ చైతన్య, యన్. ప్రిన్స్ లకు సి. పి. సాయి చైతన్య జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఎంతగా ప్రేమిస్తారో అదే విధంగా విద్యను కూడా ప్రేమించా లని సూచించారు. సెల్‌ఫోన్‌ను, సామాజిక మాధ్య మా లను అనవసర వినోదాలకు కాకుండా, తమకు ఇష్టమైన సబ్జెక్టులపై అధ్యయనం చేయడానికి, పరిశోధన చేయడానికి, వినూత్న అంశాలు నేర్చు కోవడానికి వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి రోజూ క్రమశిక్షణతో చదువు కోవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ఉపాధ్యాయుల సూచనలను పాటించడం ద్వారా మంచి ఫలతాలు సాధించవచ్చన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకొని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. రోడ్డు భద్రతపై తమ తల్లి దండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి. సి. పి. బస్వారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, ఉపాధ్యాయుడు టి. సతీష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## 45 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,ఏప్రిల్ 20(జనంసాక్షి) :**
45 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఫీల్డ్ సందర్శనలో భాగంగా ఐ.టీ.ఐ. పునరుద్ధరణ పనులను,మార్కెట్ యార్డ్‌లో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులో పూర్తి కావాలని,ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఐటీఐ మరియు ఇండోర్ స్టేడియం పనులను వచ్చే 45 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.పనుల అమలులో సమన్వయం పాటిస్తూ, అవసరమైన వనరులు సమయానికి అందుబాటులో ఉంచాలని, ఎటువంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు,ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ తీశారు ఎత్తడం మరిచారు



**గంభీరావుపేట ఏప్రిల్ 20 (జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో మురికి కాలువ తీశారు,, కానీ దానిని ఎత్తడం మర్చిపోయారు, దారియంబడ నడవాలంటే పోరాకుండా మురికి కాలువ కుప్పలు కుప్పలుగా,వేశారని దానిని వెంటనే తీసివేయాలని కాలనీవాసులు కోరుతున్నారు, లేకుంటే , కోళ్లు, పందులు, బోట్రీ, మళ్లీ యథా విధంగా డ్రైనేజీలో పడుతుందని, తెలిపారు మరియు,దోమలు తయారై మలేరియా అటువంటి వ్యాధులు వస్తాయని సుభాష్ నగర్ కాలనీ వాసు కోరుతున్నారు వెంటనే డ్రైనేజీ కుప్పలు తీసివేయాలని కోరారు.



## రైతులకు ఇబ్బందులు కలగొద్దు గంగుల కమలాకర్

### మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 20 ( జనంసాక్షి)**
కరీంనగర్‌లో మొక్కజొన్న, వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.ప్రభుత్వం పంట మార్పిడిని ప్రోత్సహిస్తూ మొక్కజొన్న సాగు చేయమని చెబుతూనే, కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంద మొక్కజొన్న సాగులో ఎకరానికి 35-40 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, ప్రభుత్వం కేవలం 25 క్వింటాళ్లకే మద్దతు ధర చెల్లించడం అన్యాయ మన్నారు. మిగిలిన ధాన్యాన్ని రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, దీనివల్ల భారీ నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళారి వ్యవస్థను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని పేర్కొంటూ, రైతులు పండించిన ప్రతి క్వింటాల్‌ను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలని హెచ్చరించారు.

## యుద్ధ ప్రాతిపదికన పేదల ఇళ్ల నిర్మాణం

### మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 20 (జనంసాక్షి):** వేములవాడలోని నిరుపేదలకు సొంతింటి కల నెర వేర్చడమే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం పనులను వేగవంతం చేస్తోందని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. సోమవారము ఆర్టీసీ డిపో సమీపంలో నిర్మిస్తున్న (ఇందిరమ్మ) డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను మున్సిపలు కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న బ్లాకులను పరిశీలించి అక్కడ విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో నిరంతర పర్యవేక్షణలో పనులు శరవేగంగా సాగుతున్నాయని చైర్మన్ తెలిపారు. ముఖ్యంగా నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులను, సిమెంట్, ఇసుక మిశ్రమం నుంచి ఫినిషింగ్ పనుల వరకు ప్రతి దశలోనూ నిబంధనలు పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పనుల పురోగతిని వివరించగా, వైస్ చైర్మన్ నరాల శేఖర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు కౌన్సిల్ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మెనెజర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు మొవేట్ సంస్థకు ఎంపిక

### ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ , పీజీ కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :**
ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బి.కాం (సిఎ) తృతీయ సంవత్సరం విద్యార్థినులు కుమారి జంగం కీర్తి యాదవ్, కుమారి జాహ్నవి యశ్వడ ప్రముఖ సంస్థ మొవేట్ లో ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణం అని కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియామక ప్రక్రియలో భాగంగా మొదటి దశ , అనంతరం సెకండ్ టెక్నికల్ రౌండ్ నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ రెండు దశల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు తుది ఎంపిక పొందగా, ఆఫర్ లెటర్స్ అందుకున్నారని వివరించారు. ఈ ప్రక్రియలో అనేకమంది పాల్గొన్నప్పటికీ, మా కళాశాల విద్యార్థినులు ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు. మా కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ట్రైనింగ్, ప్లేస్మెంట్ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, అప్టిట్యూడ్, టెక్నికల్ స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడం మా ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇలాంటి సమగ్ర శిక్షణ వల్లే విద్యార్థులు మంచి సంస్థల్లో అవకాశాలు పొందుతున్నారని వివరించారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థినులు కుమారి జంగం కీర్తి యాదవ్, కుమారి జాహ్నవి యశ్వడలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన




అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి తో పాటు టాస్క్ రీజినల్ కోఆర్డినేటర్ జి. గంగా ప్రసాద్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రాయికల్‌లో "కేంబ్రిడ్జ్ స్కూల్ పేరుతో నిర్వహిస్తున్న పాఠశాల" మూసివేత

### గుర్తింపు లేకుండా తరగతులునిర్వహిస్తున్న సంస్థపై విద్యాశాఖ చర్యలు

**రాయికల్, జనంసాక్షి:**
రాయికల్ పట్టణంలో "కేంబ్రిడ్జ్ స్కూల్ పేరుతో నిర్వహిస్తున్న పాఠశాల"పై మండల విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకొని ఆ పాఠశాలను ఈరోజు మూసివేశారు. గుర్తింపు లేకుండా చిన్నారులకు విద్యాబోధన నిర్వహిస్తున్నట్లు తెలిసి ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, గత విద్యాసంవత్సరం వరకు రాయికల్‌లో నిర్వహించబడిన కేంబ్రిడ్జ్ స్కూల్ ప్రస్తుత విద్యాసంవత్సరానికి రామాజిపేట్ గ్రామంలో అధికారిక గుర్తింపుతో కొనసాగుతోంది. అయితే అదే పాఠశాల పాత భవనాన్ని ఉపయోగించి రాయకల్‌లో మళ్లీ "కేంబ్రిడ్జ్ స్కూల్ పేరుతో నిర్వహిస్తున్న పాఠశాల"గా కొంతమంది నిర్వాహకులు అనధికారంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ దృష్టికి వచ్చింది.
ఈ పాఠశాలలో సుమారు 25 మంది నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల విద్యార్థులతో బోధన జరుగుతున్నట్లు పరిశీలనలో తేలింది. సరైన అనుమతులు, గుర్తింపు లేకుండా పాఠశాల నడపడం విద్యా నియమావళికి విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల విద్యాధికారి ఆధ్వర్యంలో అధికారులు పాఠశాలను తనిఖీ చేసి, తక్షణమే మూసివేయాలని ఆదేశించారు. అనంతరం ఆ పాఠశాల కార్యకలాపాలను నిలిపివేయించి, చిన్నారుల భద్రత, విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండల విద్యాధికారి మాట్లాడుతూ, గుర్తింపు లేని పాఠశాలలు నిర్వహించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చేర్పించి, వారి భవిష్యత్తును సురక్షితం చేయాలని సూచించారు. విద్యా ప్రమాణాలను కాపాడటంతో పాటు, చిన్నారుల విద్యలో ఎలాంటి లోపాలు రాకుండా ఉండేందుకు విద్యాశాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.





## వేములవాడ డిపోలో ఆర్టీసీ జేఏసీ ఏర్పాటు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 20 (జనంసాక్షి)**





వేములవాడ ఆర్టీసీ డిపోలో సోమవారం కార్మికుల ఆమోదం మేరకు జేఏసీగా ఏర్పడ్డారు.ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు జిబి సింగ్ మాట్లాడుతూ ఈనెల 22 న ఆర్టీసీ జేఏసీ తలపెట్టిన సమ్మెకు పూర్తిస్థాయి మద్దతు తెలుపుతా మన్నారు. ప్రభుత్వము ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందన్నారు.ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటీస్ ఇచ్చినప్పటికీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులను పిలిచి ఎలాంటి చర్చలు జరపలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని ఆర్టీసీ డిపోలలో జేఏసీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపుమేరకు ఈనెల 22న సమ్మెలో పాల్గొంటున్నా మన్నారు. వేములవాడ డిపోలో జేఏసీ కమిటీలో గౌరవ అధ్యక్షులు పిప్పిరి రాజయ్య, జేఏసీ చైర్మన్ జిబి సింగ్, వైస్ చైర్మన్ చాగంటి ప్రవీణ్, కన్వీనర్ కూనబోయిన లక్ష్మణ్, గట్టు మునిందర్, మహిళా సెక్రెటరీలుగా కేఎస్ లత,ఆర్‌ఎల్ రేణుక,శిరీషలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. జేఏసీ కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన డిపోలోని కార్మికు లందరికీ జేఏసీ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# జావీద్ కూతురికి పదవి ఇచ్చి జావీద్ కుటుంబానికి న్యాయం చేయాలి

## జావీద్ కుటుంబానికి పరామర్శించిన హనుమంతరావు




**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన మహ్మద్ జావీద్ కుటుంబానికి ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు పరామర్శించారు. సోమవారం ఖమ్మం నగరంలోని రెడ్ హిల్స్ జావీద్ స్వగృహం వెళ్లి జావీద్ కుటుంబాని ఓదార్చారు. అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన వ్యక్తి జావీద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ పిలుపు ఇచ్చిన దానికి అనుగుణంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తిసుకొని వచ్చే విధంగా పనిచేశారని గుర్తు చేశారు. జావీద్ వచ్చే పదవి జావీద్ పెద్ద కూతురుకి ఇచ్చి న్యాయం చేయాలని హనుమంతరావు కోరారు. మహిళా డిక్లరేషన్ ప్రకారంగా జావీద్ కూతురుకి నామినేట్ పదవి ఇచ్చే విధంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ జావీద్ కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన తెలిపారు. జావీద్ తనతో ఉన్న సంబంధంని గుర్తు చేసుకొని కన్నీటిపర్వంతయ్యారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు నాగుబండి రాంబాబు, పార్టీ బాధ్యులు ముక్రమ్, అవేజ్ పాల్గొన్నారు.

# జెప్టోపై మరోమారు ప్రజావాణిలో ఫిర్యాదు

## బిల్డర్‌తో పాటు జెప్టోపై చర్యలకు డిమాండ్



**బోడుప్పల్- జనంసాక్షి :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ డివిజన్ శంకర్‌నగర్ బండి గార్డెన్స్ రోడ్డులో జెప్టో కార్యకలాపాలపై కాలనీవాసులు మరోసారి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.గతంలో ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటరెడ్డి, శేషగిరిరావు, సురేందర్ రెడ్డి, అనిల్, కృష్ణ, ఆకేష్, కరుణాకర్, మహేష్ తదితరులు డిప్యూటీ కమిషనర్ శైలజను కలిసి సమస్యలను వివరించారు. అనుమతి లేని నిర్మాణంలో ఉన్న భవనాన్ని జెప్టోకు అద్దెకిచ్చి,సరైన పార్కింగ్ సౌకర్యం లేకుండా డెలివరీ వాహనాలను కాలనీ రోడ్లపైనే నిలిపివేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. రాత్రివేళల్లో వాహనాల రద్దీతో నిద్రాభంగం కలుగుతోందని,కొంతమంది వ్యక్తులు మద్యం సేవించడం, గంజాయి వినియోగించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితులతో కాలనీలో భయాందోళన వాతావరణం నెలకొన్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భవన యజమాని చింతల ఉపేందర్ రెడ్డి,జెప్టో యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.సమస్యను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.


GHMC
Greater Hyderabad Municipal Corporation
Boduppal Circle-10 Uppal Zone
No :
Date:
Applicant Name :
Contact No :
Address :
Complaint Details :
Section :
Signature

# మోసపోయాం.. మాకు న్యాయం చేయండి

## ముఖీం అనుచరుల చేతిలో..

- హైడ్రా ప్రజావాణిలో అమీన్‌పూర్ పేదల వేడుకోలు
- బ్లూసీ వెనుక ఉన్న 2 ఎకరాలను కాపాడండి అంటూ వినతి

**హైదరాబాద్/అమీన్‌పూర్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** 'ఒకరా ఇద్దరా.. అందరూ ముఖీం అనుచరులే.. ముఖీం పెద్ద లాయర్ మా వెంట ఉన్నారు.. మీకేం కాదు.. మేం చూసుకుంటాం.. అని నమ్మబలికి మాకు 70 గజాల చొప్పున ప్లాట్లు అమ్మేశారు. ప్రభుత్వ భూమి అని మాకు తెలియదు.. అందరూ కొనుక్కుంటున్నారు.. అలాగే మేమూ కొనుక్కున్నాం.. ఇప్పుడు వారిని అడిగితే మాకేమి తెలీదు.. ఖాళీ జాగా ఉంచొద్దు.. వెంటనే ఇల్లు కట్టుకోండి అని చెబితే మీరు వినలేదని తిరిగి మమ్మలనే దబాయిస్తున్నారు. మా డబ్బులు మాకిచ్చేయండి అంటే.. అవెప్పుడో ఎవరి వాటాలు వారికి వెళ్లిపోయాయి. మా దగ్గర లేవని దాటేస్తున్నారు. మా నోటరీలు.. అగ్రిమెంట్లు చూసి ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి' అంటూ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో ప్లాట్లు కొన్న వందలాది మంది వచ్చి సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కురుమ మల్లేష్, మాణిక్ యాదవ్, రవి నాయక్, రామచంద్ర నాయక్ తదితరులు ముఖీం అనుచరులుగా వేర్వేరు పేర్లతో అగ్రిమెంట్లు, నోటరీలు చేసి అమ్మారంటూ పేర్కొన్నారు. కూలీ డబ్బులు చిట్టీలు వేసుకుని.. ఊళ్లలో ఉన్న కాస్త పొలం అమ్ముకుని.. నానా అవస్థలు పడి ప్లాట్లు కొనుక్కొన్నాం. ఇప్పుడెవరూ పలకడంలేదు.. ప్రభుత్వమే న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. వీటికి తోడు.. నగరంలో ప్రభుత్వ భూములు, యూఎల్‌సీ ల్యాండ్స్, అసైన్డ్ భూములు కబ్జాలకు గురౌతున్నాయని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఔటర్ రింగురోడ్డు నిర్మాణంలో సేకరించిన అసైన్డ్ భూముల్లో మట్టిని అమ్ముకున్నవారే.. ఇప్పుడు ఆ భూములను కూడా కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని దుండిగల్ గ్రామ నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆ భూములు అసైనీలకు దక్కాలి.. లేదంటే ప్రభుత్వానికి ఉండాలి కాని మధ్యలో కబ్జాదారుల పాలవ్వకుండా చూడాలని కోరారు.



**బ్లూసీ వెనుక ఉన్న 2 ఎకరాలను కాపాడండి**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని బ్లూసీ హోటల్ వెనుక ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. ప్రభుత్వ భూమిని కొట్టేయాలని అక్కడివారు కేసులు ఒకరిపై ఒకరు వేసుకుని నడిపిస్తున్నారని.. ఈ విషయంలో హైడ్రా చొరవ తీసుకుని కాపాడాలన్నారు. కిక్కిరిసిన జనాభా ఉన్న ఈ ప్రాంతంలో పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి విలేజ్ సర్వే నంబరు 54లో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని.., రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, మియాపూర్ గ్రామంలోని సర్వే నంబరు 100, 101లో ఎకరా ప్రభుత్వ భూమి ఉంటే స్థానికంగా ఉన్న వారు కబ్జా చేస్తున్నారని శ్రీ శక్తి మహిళామండలి ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సికింద్రబాద్ బేగంపేటలోని బ్రాహ్మణవాడి సర్వే నంబరు 210లో 3 వేల గజాల స్థలం ప్రభుత్వానిది కాగా.. కబ్జాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. సైదాబాద్లోని ఫిష్ మార్కట్ వద్ద ఓపెన్ ప్లేస్ 4083 గజాలుంటే.. దానిని పిల్లలకోసం పార్కును అభివృద్ధి చేయాలని మేమంతా జీహెచ్ ఎంసీని కోరుతుంటే.. మధ్యలో వేరే వ్యక్తులు వచ్చి కబ్జాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమదంటే తమదని ఇద్దరు వ్యక్తులుప్రభుత్వ భూమిపై కోర్టుకెక్కడం.. వాళ్లలో ఎవరో ఒకరు సొంతం చేసుకుంటున్నారని.. రెవెన్యూ, జీహెచ్ ఎంసీకి కూడా ఫిర్యాదు చేశామని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఐహెచ్‌ఎం హైదరాబాద్‌లో వార్షిక అవార్డుల వేడుక

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ ఔ అప్లైడ్ న్యూట్రిషన్ (హైదరాబాద్)లో 2025--26 విద్యా సంవత్సరం వార్షిక అవార్డుల వేడుకను విద్యానగర్‌లోని డీడీ కాలనీ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. హాస్పిటాలిటీ, ఆధ్యాత్మికత, విద్యా రంగాల ప్రముఖులతో ఈ వేడుక మరింత ప్రత్యేకంగా మారింది. ఈ కార్యక్రమం గణేశ్ వందనంతో ప్రారంభమైంది. అనంతరం జాతీయ గీతం ఆలపించారు. కళాశాల మాగజైన్ 'క్యాకిల్' ను ఆవిష్కరించారు. గత సంవత్సరం సాధించిన విజయాలు, సృజనాత్మకతకు ఈ మాగజైన్ అద్దం పట్టింది. ఈ వేడుకలో అధ్యాపకులు, సిబ్బందిని సత్కరించారు. ఐహెచ్‌ఎం విద్యార్థులు సుమారు 40 మంది ప్రముఖ హోటల్ చైన్‌లలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలుగా నియమితులయ్యారు. ఇంకో 150 మందికి పైగా విద్యార్థులు క్యూఎస్‌ఆర్లు, ఎఫ్‌ఎంసీజీ, రిటైల్, కో-వర్కింగ్ స్పేస్‌లు, ఎయిర్‌పోర్ట్ ఔట్‌లెట్లు, కార్పొరేట్ కేటరింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ వంటి విభిన్న రంగాల్లో ఉద్యోగాలు పొందారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులలో కొంత మంది అంతర్జాతీయ ప్లేస్‌మెంట్‌ల దిశగా అడుగులు వేస్తుండటం పరిశ్రమతో ఐహెచ్‌ఎంకు ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తోంది. విద్యా రంగంలో ఉన్నత స్థానంలో ఉన్న విద్యార్థులు, క్రీడలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను యమునా రంగారావు ట్రోఫీ ఇంటర్-కాలేజీ క్రీడా పోటీల్లో ఘనంగా సత్కరించారు. సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ నిర్వహించిన ఇంటర్-కాలేజియేట్ ఫ్లవర్ అరేంజ్‌మెంట్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులను గౌరవించారు. ఇండియా స్కిల్స్, ఎవరెస్ట్ బెటర్ కిచెన్ వంటి రాష్ట్ర, జాతీయ స్థాయి వంటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈజీడైనర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఐహెచ్‌ఎం చెఫ్స్ తయారు చేసిన వంటకాలతో అతిథులకు ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఐహెచ్‌ఎం హైదరాబాద్ ప్రిన్సిపాల్ సంజయ్ ఠాకూర్ మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు తగిన హాస్పిటాలిటీ నిపుణులను తయారు చేసేందుకు విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఇస్కాన్ ఆధ్యాత్మిక గురువు ప్రద్యుమ్న కృష్ణ దాస, ది వెస్టిన్ హైదరాబాద్ మైండ్ స్పేస్ జనరల్ మేనేజర్ దీప్ ప్రీత్ బింద్రా, ట్రైడెంట్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ ఔ జీఎం గౌరవ్ కే కుమ్రా, ది పార్క్ హైదరాబాద్ ఏరియా జీఎం అజిత్ సింగ్ గర్చా, గ్రీన్ పార్క్ హోటల్స్ వీపీ ఆపరేషన్స్ బరనిరథన్ చిదంబర్, వివాంతా హైదరాబాద్ జనరల్ మేనేజర్ విశాల్ శ్రీవాస్తవ, టీఏఏఐ ఆంధ్రప్రదేశ్ ఔ తెలంగాణ చాప్టర్ చైర్మన్ నాగేష్ పాంపాటి, ఇండియా టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ రావిపాటి తదితరులు పాల్గొన్నారు.



# నియోజకవర్గాల పునర్విభజనకు మాత్రమే వ్యతిరేకం

## మహిళ రిజర్వేషన్‌లకు కాదు..

**ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య బీజేపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోంది : నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి**




**నిజామాబాద్ బ్యూరో (జనంసాక్షి) :** మహిళ రిజర్వేషన్‌పైన బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి ఖండించారు. జిల్లా కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్‌కు ఎప్పుడు కూడా వ్యతిరేకం కాదు అని, మహిళా రిజర్వేషన్ పేరుతో బిజెపి చేస్తున్న నియోజకవర్గాల పునర్విభజనకు మాత్రమే వ్యతిరేకమని నగేష్ రెడ్డి అన్నారు. 2023లో మహిళ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలిపిందని, బిజెపికి మహిళలపై చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతం ఉన్న 543 పార్లమెంటు స్థానాలలో మహిళ రిజర్వేషన్ను అమలు చేయాలని నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షిణ భారతంలో ఉన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని గమనించిన రేవంత్ రెడ్డి ఢిల్లీలో పూర్తిగా వివరించడం జరిగిందని, పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఈ బిల్లును వ్యతిరేకించడం జరిగింది అని, 2023లో మహిళ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు తెలిపిందని కానీ ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ మహిళా రిజర్వేషన్ పేరుతో కుట్రలు చేస్తూ కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తుందని అన్నారు. 543 పార్లమెంట్ స్థానాలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించే విధంగా బిల్లు పెట్టి కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలుపుతుందని అంతేగాని కుట్రలు చేస్తూ రాజ్యాంగాన్ని ఖూనీ చేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లుతో బిజెపి ప్రభుత్వం దేశాన్ని బలహీనం చేసే విధంగా కుట్రలు చేస్తున్న విధానాన్ని గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతా రెడ్డి రాజారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి భక్తవత్సలం, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కౌడపు శరత్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేంద్ర గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రఘు,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకులు అపర్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థ గలీజు పనిచేసింది..!

## ఫోర్జరీ సంతకాలతో లీజు గడువు పొడిగింపు

- చర్యలు తీసుకోవాలని భవన యజమాని డిమాండ్
- దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటాం : మేడిపల్లి సీఐ శంకరయ్య





**బోడుప్పల్-జనంసాక్షి :** పాఠశాల భవనం లీజు పెంపు విషయంలో భవన యజమాని నో చెప్పడంతో గతంలో చేసుకున్న లీజు డీడ్‌ను ఫోర్జరీ చేసి లీజు గడువు పెంచుకున్నారని బోడుప్పల్ నారాయణ స్కూల్ యజమానులు ఆరోపించారు.ఈ మేరకు సోమవారం భవన యజమానులు పన్నాల బాల్ రెడ్డి, బాల్ చందర్ రెడ్డి మాట్లాడుతూ తమకు చెందిన భవనాన్ని 2015 లో " నారాయణ పాఠశాలకు పది సంవత్సరాల పాటు లీజ్‌కు రిజిస్టర్ డీడ్ చేశామని, అయితే లీజు ముగుస్తున్న సమయానికి ఎనిమిది నెలల ముందే భవనం ఖాళీ చేయాలని నోటిస్ ఇచ్చామని అన్నారు. నారాయణ పాఠశాల యాజమాన్యం మాత్రం తమకు ఇంకా సమయం కావాలని కోరిన తాను అంగీకరించలేదని అన్నారు. ఇదిలా ఉండగానే తాము గతంలో చేసుకున్న ఒప్పందం పత్రాన్ని ఫోర్జరీ చేసి లీజు గడువు పెంచినట్లు చూపుతూ వ్యవస్థలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఫోర్జరీపై గతంలో మేడిపల్లి పీఎస్ లో ఫిర్యాదు చేయగా ఏలాంటి యాక్షన్ తీసుకోలేదని వాపోయారు.

**అధికార బలాన్ని ఉపయోగిస్తున్న యాజమాన్యం**

నారాయణ పాఠశాల యాజమాన్యానికి తమ భవనం ఖాళీ చేయాలని గత ఎనిమిద నెలల నుండే నోటీసులు ఇచ్చామని వాళ్ళు ఇంకా కొన్ని సంవత్సరాల గడువు పెంచాలని కోరినా తాము ఒప్పుకోలేదని తెలిపారు. తమ మాట వినక పతే చాలా ఇబ్బందులు వస్తాయని తమకు రాజకీయ పలుకుబడి ఉందని మీరు ఏం చేసిన భవనం ఖాళీ చేయలేదని బెదిరింపులకు దిగుతున్నారని భవనం యజమానులు వాపోయారు.దీనిపై మేడిపల్లి సీఐ చింత శంకరయ్య స్పందిస్తూ గతంలో భవనం యజమానుల నుండి వచ్చిన ఫిర్యాదు అంశం తమకు తెలియదని మరోసారి సదరు ఫిర్యాదు పై లోతుగా దర్యాప్తు జరుపి నిజాలను నిగ్గు తెలుస్తామని అన్నారు.

# అక్రిడేషన్లలో జర్నలిస్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**టీయుడబ్ల్యూజే (హెచ్ 143) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అక్రిడేషన్ కమిటీ చైర్మన్ బాధావత్ సంతోష్‌కు వినతి**



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా లోని జర్నలిస్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సోమవారం జిల్లా జర్నలిస్ట్ అక్రిడేషన్ కమిటీ చైర్మన్,కలెక్టర్ బాధావత్ సంతోష్‌కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్143) ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశం అనంతరం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్ 143) జిల్లా అధ్యక్షుడు అక్రిడేషన్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర రావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఖానాపురం ప్రదీప్, తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్(టీజేఏ) జిల్లా బాధ్యులు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ దస్తగిరి ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ప్రధానంగా నాగర్ కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (నల్లమల) లోని మన్ననూర్, దోమలపెంట (బ్రహ్మగిరి) జర్నలిస్టులకు అక్రిడేషన్లను మొదటి లిస్టులోనే అందించే విధంగా చర్యలు తీసుకోగలరనీ కోరారు.ప్రధానంగా సమాచార పౌర సంబంధాల శాఖ సైట్ లో ఈ రెండు సెంటర్లకు సంబంధించిన వివరాలు లేకపోవడంతో ప్రతి అక్రిడేషన్ జారీ చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయనీ పేర్కొన్నారు. శాశ్వతంగా ఈ రెండు సెంటర్లకు గుర్తింపు కల్పిస్తూ శాశ్వత పరిష్కారం చూపగలరని కోరారు. అటవీ ప్రాంతంలో శ్రీశైలం ప్రాజెక్టు, లెఫ్ట్ బ్యాంక్ పవర్ ప్లాంట్, వరకు మన్ననూర్, దోమల పెంట (బ్రహ్మగిరి) కేంద్రాలకు చెందిన రిపోర్టర్ల పాత్ర కీలకమైనదనీ పేర్కొన్నారు. వారి ప్రాధాన్యతను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపగలరని కోరారు. అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా తో పాటు రంగారెడ్డి జిల్లాలో కూడా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే విధంగా వెసులుబాటును కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( హెచ్ 143) నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ ద్వారా కోరుతున్నామని అన్నారు. కడ్తాల్ వరకు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పరిధి ఉంటుంది కాబట్టి ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని కోరగా ఈనెల 25 న జరిగే అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అందరూ సభ్యుల సమక్షంలో తీర్మానం చేసి సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కు నివేదిస్తామని కలెక్టర్ బాధావత్ సంతోష్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కలెక్టర్ అంశాల గురించి సానుకూలంగా స్పందించారని వారు వివరించారు.



# ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేస్తామని ప్రకటించే దమ్ము ఉందా?

**మహిళా లోకానికి కెసిఆర్ క్షమాపణ చెప్పాలి : మంత్రి సీతక్క డిమాండ్**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉచిత బస్ ప్రయాణ పథకంపై మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. ఫ్రీ బస్ పథకాన్ని "పనికిమాలినది"గా అభివర్ణించడం దొరతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, ఆమె డిమాండ్ చేశారు. నిజంగా ఈ పథకం పనికిరాదని భావిస్తే, దాన్ని రద్దు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఈ ఉచిత బస్ పథకం ద్వారా లక్షలాది మహిళలు ప్రతి రోజు ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుంటూ, ఉద్యోగాలు, విద్య, ఆరోగ్య సేవలు సులభంగా పొందుతున్నారని ఆమె వివరించారు. ఇప్పటివరకు సుమారు రూ.10 వేల కోట్ల మేర మహిళలకు ప్రయాణ వ్యయ భారం తగ్గిందని తెలిపారు. ఇది కేవలం పథకం మాత్రమే కాదు, మహిళల ఆర్థిక స్వావలంబనకు, సామాజిక స్వేచ్ఛకు దారితీసే కీలక అడుగు అని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ఈ పథకాన్ని ఓర్వలేక, దాన్ని తక్కువ చేసి చూపించే ప్రయత్నం జరుగుతోందని మంత్రి విమర్శించారు. మహిళలు బయటకు రావడం, తమ పనులు స్వయంగా చేసుకోవడం ఇష్టపడని దొరతనపు ఆలోచనల వల్లే ఇటువంటి వ్యాఖ్యలు వస్తున్నాయని అన్నారు. మహిళల మనోభావాలను దెబ్బతీసినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# వసతి గృహాల విద్యార్థులకు శుభ్రమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి

**బుద్ధారం గురుకుల పాఠశాలలో వనపర్తి జిల్లా కలెక్టర్ తనిఖీ**



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందులో భాగంగానే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గోపాలపేట మండలం బుద్ధారం గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల వంటగది (కిచెన్) మెస్‌ను పరిశీలించారు. కిచెన్, మెస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆహార సామాగ్రి నిల్వ రిజిస్టర్లను పరిశీలించి, మెస్ కమిటీ విద్యార్థులు రిజిస్టర్లలో సంతకాలు చేస్తున్నారా లేదా అనే అంశంపై విచారణ చేశారు. విద్యార్థులకు అందించే ఆహారాన్ని సూపర్వైజర్ ముందుగా రుచి చూసి, అనంతరం విద్యార్థులకు అందించాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆర్ బీ ఎస్ కే ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరాల ద్వారా మొత్తం 6950 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, 570 మందికి చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించగా, ఈ పాఠశాలలో 400 మంది విద్యార్థుల్లో 69 మందికి చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.ఈ విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అయిన ఓపి ట్రైబల్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైదరాబాద్ టైటాన్స్ రౌండ్ టేబుల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచితంగా కొత్త కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నితిన్, అభిషేక్, అఖిల్ పాల్గొన్నారు. ఉచితంగా కళ్లద్దాలు అందించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాయినాథ్ రెడ్డి, డివైఎస్ఓ సుధీర్ రెడ్డి, పాఠశాల సిబ్బందిపాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
21 ఏప్రిల్ 2026

# పరీక్షల వేళ కట్టుదిట్టమైన భద్రత

- సైబరాబాద్ సిపి రమేశ్ ఉత్తర్వులు



**హైదరాబాద్, ఏప్రిల్20 (జనంసాక్షి) :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబరాబాద్ సీపీ రమేశ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్, తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ పరీక్షల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతని పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో గుమిగూడటానికి నిషేధం విధిస్తున్నట్లు సైబరాబాద్ సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా గూడటం నిషేధమని తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర వందమీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఉత్తర్వులు అమలు అవుతాయని వెల్లడించారు. పోలీస్, సైనిక సిబ్బంది, హోం గార్డులకు ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఉంటుందని అన్నారు. విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ విధులకు అనుమతి ఉంటుందని, అలాగే అంత్యక్రియల ఊరేగింపులకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ రమేశ్ స్పష్టం చేశారు.

# వంద రూపాయల అప్పు ఇవ్వనందుకు దాడి

- దంపతులపై దాడిలో భర్త మృతి




**మంచిర్యాల, ఏప్రిల్20 (జనంసాక్షి) :** మంచిర్యాలలో దారుణం చోటుచేసుకుంది. అప్పు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఘాతుకానికి ఒడిగట్టాడు. దంపతులపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో భర్త చనిపోగా.. భార్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన శంకరయ్య దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓ వ్యక్తి దుకాణం దగ్గరకు వచ్చాడు. 100 రూపాయలు అప్పు ఇవ్వమని అడిగాడు. ఇందుకు శంకరయ్య ఒప్పుకోలేదు. దీంతో ఆ వ్యక్తి గొడవకు దిగాడు. గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. విచక్షణ కోల్పోయిన ఆ వ్యక్తి శంకరయ్యపై కత్తితో దాడి చేశాడు. అడ్డం వచ్చిన శంకరయ్య భార్యపై కూడా దాడి చేశాడు. దాడి అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ శంకరయ్య దంపతులను స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శంకరయ్య ప్రాణాలు విడిచాడు. ఆయన భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# కేబుల్ బ్రిడ్జిపై హిట్ అండ్ రన్

- బెంజ్ కారు ఢీకొని వ్యక్తి మృతి




**హైదరాబాద్, ఏప్రిల్20 (జనంసాక్షి) :** హైదరాబాద్ లోని మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా వచ్చిన ఓ మెర్సిడెస్ బెంజ్ కారు ఢీకొనడంతో శ్యామ్ రాజ్ (32) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జూబ్లీ హిల్స్ నుంచి ఐకియా వైపు వస్తున్న వెస్ట్ బెంగాల్ రిజిస్ట్రేషన్ కలిగిన బెంజ్ కారు బ్రిడ్జిపై ఆగి ఉన్న శ్యామ్ రాజ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో కారు ఇంజన్ భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కారును కొంత దూరం తీసుకెళ్లి అదే కేబుల్ బ్రిడ్జిపై పార్క్ చేసి, డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి అక్కడి నుంచి తప్పించుకున్నారు. ప్రమాదం సమయంలో కారులో ఇద్దరు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# భూ రికార్డుల సవరణకు లక్షన్నర లంచం

- ఎసిబికి చిక్కిన విఆర్‌వో

**అనకాపల్లి, ఏప్రిల్20 (జనంసాక్షి) :** అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో భూమి రికార్డుల సవరణ కోసం లంచం డిమాండ్ చేసిన వీఆర్వో పోతల శంకర్‌రావు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఒక రైతు తన భూమి రికార్డుల్లో పేరు మార్పు చేసి, ఎల్పీఎం జారీ చేయించుకోవడానికి వీఆర్వోను సంప్రదించారు. ఈ పని చేయడానికి వీఆర్వో శంకర్‌రావు రూ. 1.50 లక్షల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి వీఆర్వో నగదు తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. వీఆర్వో శంకర్‌రావుకు గతంలో కూడా అవినీతి మరకలు ఉన్నట్లు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది.

# 30నాటికే అజారుద్దీన్ మంత్రి పదవి!

- ఈలోగా ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదించాలి
- సిఎం వినతితో గవర్నర్ ఆమోదిస్తారా అన్న ఉత్కంఠ



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** గతేడాది అక్టోబర్ 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యుడు కాకుండా మంత్రి పదవి చేపడితే కచ్చితంగా ఆరు నెలల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్‌కు ఈ నెల 30తో ఆ గడువు ముగుస్తుంది. ఈలోగా ఆయన ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు హడావిడిగా ఆయనను కేబినేట్‌లోకి తీసుకున్నారు. ప్రస్తుతం గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిపై గత బీఆర్ఎస్ నుంచి వివాదాలు కొనసాగుతున్నాయి . కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను మంత్రివర్గం సిఫార్సు చేసింది. దీన్ని బీఆర్ఎస్ నేతలు న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఇద్దరి ఎమ్మెల్సీ పదవులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ తర్వాత మంత్రివర్గం అమీర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును చేర్చి.. మళ్లీ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేసింది కానీ, విషయం న్యాయ స్థానంలో ఉండటంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు. తెలంగాణలో ఎమ్మెల్సీల ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డుకావని ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో.. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఫైల్ క్లియరెన్స్ కోసం సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిసినట్టు సమాచారం. వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించాలని కోరారు. ఈ వారం, పదిరోజుల్లో గవర్నర్ ఆమోదిస్తే అజారుద్దీన్ మంత్రిగా ఉంటారు. లేదంటే మళ్లీ మాజీ కాక తప్పదు. గవర్నర్ కోర్టులో ఇప్పుడు బాల్ ఉంది. ఇద్దరు ఎమ్మెల్సీల్లో కోదండరాం పేరును ఆమోదించేందుకు గవర్నర్ సానుకూలత వ్యక్తం చేసినట్టు తెలిసింది. అజారుద్దీన్ విషయంలో సందిగ్ధంలో ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఏసీబీ కేసు నమోదైందని, మూడు ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని గవర్నర్ కార్యాలయం గుర్తించినట్టు తెలిసింది. రూ.3.8కోట్ల ఆర్థిక అవకతవకల మీద ఈడీ విచారణ ఎదుర్కొని, ఇదే కేసులో ఆయనపై చార్జ్‌షీట్ ఉన్నదని గుర్తించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఫైల్‌ను న్యాయసమీక్షకు పంపినట్టు తెలిసింది. న్యాయనిపుణుల సలహా మేరకు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేసేందుకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆర్థిక అవకతవకల కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న నేపథ్యంలో ఆయన్ను నేరుగా ఎమ్మెల్సీగా ఆమోదించేందుకు అంగీకరించలేదని తెలిసింది. న్యాయనిపుణుల సలహా తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ తేల్చిచెప్పినట్టు తెలిసింది. అజారుద్దీన్‌కు మరో 10రోజులే డెడ్‌లైన్ ఉన్నది. ఆయన మంత్రిగా కొనసాగాలంటే ఈలోగా ఎమ్మెల్సీ కావాల్సిన అనివార్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గవర్నర్‌తో భేటీ అయ్యారు. గవర్నర్ కోటాలో ముద్దసాని కోదండరాంరెడ్డి, మహ్మద్ అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. ఈ ఇద్దరు పేర్లను ఆమోదించాల్సిందిగా రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను అభ్యర్థించారు. గవర్నర్ తీసుకునే నిర్ణయంతో ఈ ఇద్దరి భవితవ్యం ఆధారపడి ఉంది..

# కెటిఆర్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సంజయ్

- అక్రమ సంపాదనతో వచ్చిన అహంకారమని విమర్శ




**జగిత్యాల, ఏప్రిల్20 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌దే క్రాస్‌బ్రీడ్ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరబోతున్న సమయంలో తనపై వచ్చిన విమర్శలకు ఆయన తీవ్రంగా స్పందించారు. ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. తనను క్రాస్ బ్రీడ్ నాయకుడని కేటీఆర్ సంబోధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'నేను రాజకీయ వ్యభిచారినైతే.. నువ్వు వ్యభిచార కొంప నడిపావా? గతంలో వైసీపీ, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న నీదా క్రాస్ బ్రీడ్..? నాదా..?' అని కేటీఆర్‌ను నిలదీశారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రశేఖర్ గౌడ్‌ను నిలబెట్టి.. జీవన్‌రెడ్డికి క్రాస్ ఓటేయించిన క్రాస్‌బ్రీడ్ నాయకుడు కేటీఆర్.. అక్రమ సంపాదనతో వచ్చిన అహంకారంతో మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబ అహంకారపూరిత వ్యాఖ్యలతోనే రాష్ట్రంలో వెలమ జాతి గౌరవం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేటీఆర్ రాజకీయాల్లోకి రాక ముందు నుంచే తానూ తన కుటుంబం రాజకీయాల్లో ఉన్నామన్న సంజయ్.. రాజకీయాల్లోకి వచ్చాక తన ఆస్తులు తగ్గాయే తప్ప పెరగలేదని స్పష్టం చేశారు.

# అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మంటలు

- ఫైర్ సిబ్బంది రాకతో తప్పిన ముప్పు

**హైదరాబాద్, ఏప్రిల్20 (జనంసాక్షి) :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అపార్ట్‌మెంట్ మొత్తం దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బిల్డింగ్ సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సెల్లార్‌లోని 15 ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# ఎన్డీఏతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంజిఆర్, ఎన్టీఆర్ మంచి మిత్రులు
- తమిళనాడు ప్రచారంలో చంద్రబాబు



**కోయంబత్తూరు, ఏప్రిల్20 (జనంసాక్షి) :** ఏపీకి, తమిళనాడుకు ఎనలేని అనుబంధం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనకున్న రాజకీయ అనుభ వంలో ఎంతోమంది నాయకులను చూశానని పేర్కొ న్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రం అరుదైన వ్యక్తి అని ప్రశంసించారు. దేశ గౌరవాన్నిమోదీ నిలబెట్టారని కొనియా డారు. మహిళలకు మోదీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. సోమవారం తమిళనాడులోని ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. థల్లి నియోజక వర్గంలో బీజేపీ అభ్యర్థి నగేష్ తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఎం తమిళంలో ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారికి ధన్యవాదాలు చెప్పారు. తన పుట్టినరోజున ఇక్కడకు వచ్చానని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. పుట్టిన రోజున ఇక్కడికి వచ్చానంటే ప్రాధాన్యం అర్థం చేసుకోవాలని అన్నారు. తమిళనాడులో ఈసారి జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నాయకులను ప్రజలు గెలిపించాలని కోరారు. తమిళభాషకు ఎంతో ప్రాధాన్యం ఉందని ఉద్ఘాటించారు. మనందరికీ మద రాసు రాజధానిగా పరిపా లన కొనసా గిందని తెలిపారు. తమిళ ప్రజలంటే క్రమశిక్షణ, శ్రమ కలిగిన వారు.. వారి విజయానికి అదే సూత్రమని చెప్పారు. ఎంతోమంది ప్రముఖులు, చరిత్రకారులు తమిళనాడు వారు ఉన్నారని ప్రస్తావించారు. దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ ద్రవిడ భాషలను ప్రోత్సహించారని చెప్పుకొచ్చారు. ద్రవిడ యూనివర్సిటీని ప్రారంభించారని ప్రస్తావించారు. ఎన్డీఏ కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ కూడా తమిళనాడులోనే జీవించారని.. తనకు పెళ్లి జరిగింది కూడా తమిళనాడు లోనేనని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్, ఎంజీఆర్‌లు చాలా దగ్గరి స్నేహి తులని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారిద్దరూ కలిసి తమిళనాడుకు నీళ్లు తీసుకురావడానికి తెలుగు గంగ ప్రారంభిం చారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులోని కోయంబ త్తూరులో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల తరపున ప్రచారం నిర్వహించారు. నదుల అనుసంధానంతో దేశానికి నీటి భద్రత వస్తుంది. భవిష్యత్తులో అన్నీ కుదిరితే గోదా వరి- కృష్ణ- కావేరి నదులు అనుసం ధానం కావాలి. ప్రధాని నరేంద్ర మోదీ ద్వారానే ఇది సాధ్యమవుతుంది. తమిళుల ప్రయోజనాలు పట్టని పార్టీలు మనకొద్దు. తమిళనాడు అభివృద్ధి, దేశ ప్రగతి కోరుకునేది.. ఎన్డీయే మాత్రమే అని చంద్రబాబు అన్నారు.

## చంద్రబాబు ప్రచారంతో ఒరిగేదేమీ లేదు: నారాయణ

**హైదరాబాద్, ఏప్రిల్20 (జనంసాక్షి) :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఫైర్ అయ్యారు. తమిళనాడు రాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రచారం చేస్తున్న చంద్రబాబు నాయుడుకి శృంగభంగం తప్పదని పేర్కొన్నారు. నాడు జయలలిత అధికారంలో ఉన్నప్పుడు తమిళనాడు రాష్ట్రంలోని తెలుగు భాష బోధించే పాఠశాలను మూసేస్తామని అసెంబ్లీలో తీర్మానం తీసుకొచ్చినప్పుడు తమిళనాడు రాష్ట్రంలో నివసిస్తున్నటువంటి తెలుగు ప్రజలు దీనిపై స్పందించాలని చంద్రబాబు నాయుడుని నేరుగా కలిసి విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. అలాంటి చంద్రబాబు ప్రస్తుతం మోడీనికాపాడేందుకు ఎన్డీఏ తరపున తెలుగు ప్రజల మధ్య ప్రచారానికెళ్లడం విడ్డూరమన్నారు. తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల కూటమి గెలుపు ఖాయమన్నారు.

# విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం
# కేసు జూన్ 15కు వాయిదా వేసిన కోర్టు

- భరణంపై కోర్టు బయట బేరసారాలు
- ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా భరణం డిమాండ్
- 35 కోట్లు మాత్రమే ఇస్తానన్న విజయ్



**చెన్నై, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్ గా మారింది. ఒక వైపు రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి విమర్శలు, మరోవైపు వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఇప్పుడు దళపతినిఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజయ్ భార్య సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్ పై చెంగల్పట్టు కోర్టు విచారణను జూన్ 15కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే విజయ్ – సంగీత జంట పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం చైన్నైలో ఇరువురి లాయర్లు కలిసి చర్చించినట్లు సమాచారం. విడిపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే సెటిల్ మెంట్ కింద ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన ఆస్తుల ఆధారంగా , తన ఇద్దరు పిల్లలు భవిష్యత్తు కోసం సుమారు రూ. 250 కోట్లు భరణం సంగీత కోరినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే విజయ్ మాత్రం సంగీతకు రూ. 35 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం. కుమారుడు, కుమార్తె బాగోగులు తాను చూసుకుంటానని విజయ్ అన్నట్లు తెలుస్తోంది. అయితే విడాకుల వ్యవహారం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోదని సమాచారం. విజయ్ నుంచి విడాకుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆమె పేర్కొన్న అంశాలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. తనను మానసిక, శారీరక వేధింపులకు గురిచేశారని, కనీస ఆర్థిక స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కదలికలపై ఆంక్షలు విధించారని, మాటలతో తీవ్రంగా కించపరిచారని ఆమె వాపోయారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. తన సొంత పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విజయ్‌కు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అయితే, సరిగ్గా ఎన్నికల ప్రచార సమయంలో ఈ విడాకుల వ్యవహారం తెరపైకి రావడం ఆయనకు ప్రతికూలంగా మారుతుందా అన్న చర్చ సాగుతోంది. మరి ఈ విడాకుల వ్యవహారం రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి మరి.

# వాతావరణం అనుకూలించక సమస్య

- హుబ్లీ వెళ్లాల్సిన విమానం బెంగళూరుకు మళ్లింపు



**హైదరాబాద్, ఏప్రిల్20 (జనంసాక్షి) :** హైదరాబాద్ నుంచి హుబ్లీ వెళుతున్న ఫ్లై 91 విమానాన్ని బెంగళూరుకు దారి మళ్లించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో విమానం గాల్లో ఉండగానే సాంకేతిక సమస్య ఎదురైనట్టు అధికారులు వెల్లడించారు. దీంతో విమానాన్ని దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చిందని, విమానంలోని ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని తెలిపారు. ఆదివారం రోజు సాంకేతిక సమస్యల వల్ల విమానం మూడు గంటలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనల కు గురయ్యారు. కొందరు భయంతో బిగ్గరగా ఏడుస్తూ, క్షేమంగా కిందకు దిగాలని ప్రార్థనలు చేశారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బయల్దేరింది. అది 4.30కి హుబ్లీ చేరుకోవాలి. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో దాన్ని బెంగళూరుకు దారి మళ్లించాల్సి వచ్చిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఆ తర్వాత బెంగళూరు నుంచి తిరిగి సాయంత్రం 6.30కు ప్రారంభమైంది. హుబ్లీ చేరుకునేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది. 22 మంది ప్యాసింజర్లు సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఇదిలాఉండగా, వాతావరణ పరిస్థితుల వల్ల ముంబయి నుంచి కొల్హాపుర్‌కు వెళ్లాల్సిన మరో విమానాన్ని గోవాకు మళ్లించారు. విమానంలో సమస్య ఏం లేదు, ఇందులోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని సంబంధిత అధికారులు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370